RNI No.21139/1970

SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL ILLUSTRATED MONTHLY
Volume:57, Issue: 04
September - 2026, Price Rs.20/-

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

సెప్టెంబరు 2026
వెల రూ. 20/-
పుటలు - 56



**తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవము**

**ధ్వజారోహణం-15-09-2026**



# తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి నవరాత్ర బ్రహ్మోత్సవములు

| తేదీలు | వారం | పగలు ఉత్సవములు | రాత్రి ఉత్సవములు |
|---|---|---|---|
| 11-10-2026 | ఆదివారం | -- | సేనాధిపతిఉత్సవం, అంకురార్పణ |
| 12-10-2026 | సోమవారం | వజ్రకవచాద్యాభరణాలతో తిరుచ్చిఉత్సవం | పెద్దశేషవాహనం |
| 13-10-2026 | మంగళవారం | చిన్నశేషవాహనం | హంసవాహనం |
| 14-10-2026 | బుధవారం | సింహవాహనం | ముత్యపుపందిరివాహనం |
| 15-10-2026 | గురువారం | కల్పవృక్షవాహనం | సర్వభూపాలవాహనం |
| 16-10-2026 | శుక్రవారం | పల్లకీలో మోహినీ అవతారోత్సవం | గరుడవాహనం |
| 17-10-2026 | శనివారం | హనుమద్వాహనం, పుష్పక విమానము | గజవాహనం |
| 18-10-2026 | ఆదివారం | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 19-10-2026 | సోమవారం | స్వర్ణ రథోత్సవం | అశ్వవాహనం |
| 20-10-2026 | మంగళవారం | పల్లకీ ఉత్సవం మరియు తిరుచ్చిఉత్సవం, స్నపన తిరుమంజనం మరియు చక్రస్నానం | |



## గీతాశ్లోకార్థసారం

**శ్లో : త్రైగుణ్య విషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున।**
**నిర్ద్వంద్వో నిత్యసత్త్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్ ॥**

(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం-45వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** అర్జున= ఓ అర్జునా; వేదాః= వేదములు; త్రైగుణ్యవిషయాః= సత్త్వరజః తమములను మూడు గుణములకు సంబంధించిన విషయములను వివరించును; నిస్త్రైగుణ్యః= త్రిగుణములకు అతీతుడవును; నిర్ద్వంద్వః= హర్షశోకాది ద్వంద్వములు లేనివాడవును; నిత్యసత్త్వస్థః= నిత్యుడైన పరమాత్మయందే స్థితుడవైనవాడవును; నిర్యోగక్షేమః= యోగక్షేమములను ఆశించనివాడవును; ఆత్మవాన్= ఆత్మజ్ఞానివి; భవ= అగుము.

**భావం:** ఓ అర్జునా! వేదములు (అందలి పూర్వభాగమగు కర్మకాండ) సత్త్వ రజః తమములను త్రిగుణములను గూర్చి, వాటి కార్యరూపములైన భోగములను గూర్చి, వాటి సాధనలను గూర్చి వివరించును. నీవు త్రిగుణములను విడువుము. భోగములపై, వాటి సాధనలపై ఆసక్తిని త్యజించుము. హర్షశోకాదిద్వంద్వములకు అతీతుడవగుము. నిత్యుడైన పరమాత్మయందే స్థితుడ వగుము. నీ యోగక్షేమముల గురించి ఆరాటపడకుము. ఆత్మజ్ఞానివి కమ్ము.

---

## నానాదిక్కుల నరులు వానలలో వత్తురు

నానాదిక్కుల నరులెల్లా
వానలలోననే వత్తురు గదలి

సతులు సుతులుఁ బరిసరులు బాంధవులు
హితులు గొలువఁగా నిందరును
శతసహస్రయోజనవాసులు సు
వ్రతములతోడనె వత్తురు గదలి

ముడుపులు జాళెలు మొగిఁ దలమూఁటలు
కడలేని ధనముఁ గాంతలును
కడు మంచిమణులు కరులుఁ దురగములు
వడిగొని చెలఁగుచు వత్తురు గదలి

మగుటవర్ధనులు మండలేశ్వరులు
జగదేకపతులుఁ జతురులునుఁ
తగు వేంకటపతి దరుశింపఁగ బహు
వగల సంపదల వత్తురు గదలి

ఆధ్యాత్మసంకీర్తన- సంపుటం 1- సంకీర్తన 346





భక్తజనులందరు బంధువులతో ముడుపులు, కానుకలతో చాలదూరం నుండి శ్రమకోర్చి, నియమనిష్ఠలతో శ్రీవారి ఉత్సవాలకు వస్తారు. సామాన్య ప్రజలే కాదు. రాజులు, చక్రవర్తులు, సార్వభౌములు, జగదేకపతులు ఇలాగ ఒక్కరేమిటి ఆబాలగోపాలం శ్రీవేంకటేశుని దర్శించడానికి వానలలోనే కదలివస్తారని అన్నమయ్య వర్ణించిన కీర్తన ఇది.

శ్రుతివాక్యం

# కృషి- తద్ద్వారా క్షేమం, సంపద, పోషణ (శుక్లయజుర్వేదం)

## (కృష్యైత్వా క్షేమాయత్వా రయ్యైత్వా పోషయత్వా)

– బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

వేదఘోష ఎప్పుడూ కృషినే ప్రేరేపించింది. అక్రమార్జన ఎంత దోషమో, అశ్రమార్జన (శ్రమ లేకుండా సంపాదించడం) కూడా అంతే ఘోరం.

కష్టపడకుండా సుఖపడాలనే ఆశ పెరిగితే మనిషి సోమరి అవుతాడు. సుఖం విలువ కష్టపడ్డవానికే తెలుస్తుంది. ఏ కష్టమూ లేకుండా సంపాదించాలనే అత్యాశ వల్లనే అవినీతి వ్యాధి పెరిగి వ్యక్తికీ, దేశానికీ శ్రేయోహాని కలిగిస్తుంది.

శ్రమ పడకుండా సంపాదించాలని కొందరు సులభ మార్గాలను ఆశ్రయిస్తారు. ఇంకొందరు వంచనలకు పాల్పడతారు. అవినీతికి అంకితమవుతారు. ప్రజాధనాన్ని కూడా దోచుకునేందుకు సిద్ధపడతారు. అది అశ్రమార్జన, అక్రమార్జనకు దారితీసి వ్యక్తిత్వంలోని శుద్ధతను నశింపజేస్తుంది. శుద్ధిలేని వ్యక్తిత్వం ఆత్మశక్తిని పోగొడుతుంది. ఫలితంగా అడుగడుగునా అశాంతీ, ఆవేదనా మిగులుతాయి. అందుకే వేదం కృషి గురించి చాలా గొప్పమాటల్ని చాటింది.

*'తే మనుష్యాః కృషిం చ, సస్యం చ ఉపజీవన్తి...'* అని అథర్వవేద వచనం.

మనుషులు కృషి ద్వారా లభించిన ఫలం వల్ల జీవించాలి. శ్రమ, సాఫల్యం– ఈ రెండే మనిషికి ముఖ్యం. అందుకే *"ఉత్తమం స్వార్జితం విత్తం - మధ్యమం పిత్రార్జితం".* స్వయంగా శ్రమించి సాధించిన సంపదనే ఉత్తమంగానూ, పైతృక సంపదను మధ్యమంగానూ సుభాషితాలు సైతం చెప్పాయి. మిగిలినవి పరద్రవ్యాలు, వాటిని ఆశించరాదు.



*'సానో భూమిర్వర్ధయద్ వర్ధమానా'* – కృషిచేత పృథ్వి అన్ని సంపదలను మనకు ప్రసాదిస్తుంది. వర్ధిల్లుతుంది... అని వేదమాత పదేపదే పలుతావుల ప్రబోధిస్తోంది.

అలసత్వాన్నీ, సోమరితనాన్నీ మన సంస్కృతి ఎంత అసహ్యించుకుందో ఈ వాక్యాలు పట్టిచూపిస్తాయి.

*'కృష్యైత్వా క్షేమాయత్వా రయ్యైత్వా పోషయత్వా'*

కృషి– తద్ద్వారా క్షేమం, సంపద, పోషణం... అని శుక్లయజుర్వేద బోధ. పాలకులు ప్రజలను కృషిచేసేవారిగా తీర్చిదిద్దాలని శ్రుతివాక్యాలు స్పష్టం చేశాయి. 'నో రాజాని కృషిం తనోతు' వంటి ఎన్నో వాక్యాలు దీనికి ఉదాహరణ. ప్రజలను తేలికగా సుఖపడేలా చేసే మార్గాలను ప్రోత్సహించడం తగదు.

స్వధర్మ నిర్వహణ, స్వకర్మ పాలనలలో అలసత్వానికి అవకాశమీయరాదు. ఇంద్రియాలు, బుద్ధి సరిగ్గా శ్రమించాలి. అది కూడా ధార్మికమైన రీతిలో ఉండాలి. ధర్మనిర్వహణకు భగవంతుడిచ్చిన పరికరాల్లో మొదటిది శరీరం. *'శరీరమాద్యం ఖలు ధర్మసాధనమ్'* అనే మాటకు ఇదే అర్థం.

పరిశ్రమించని వానికి సుఖపడే అర్హత లేదు. సులభ పద్ధతుల ద్వారా సేకరించుకున్న వాటికి స్థిరత్వమూ, దృఢత్వమూ ఉండవు.

మన చుట్టూ ఉన్న ప్రకృతిలో ఎన్నో సంపదలు దాగి ఉన్నాయి. కృషి ద్వారా వాటిని వెలికితీయాలి. ఆ పనిలో ప్రకృతికి సంబంధించిన శాశ్వత, దీర్ఘకాలిక ప్రయోజనాలు దెబ్బతినకుండా జాగ్రత్త పడాలి.

మానవజీవనానికి సార్థక్యం కృషి మాత్రమే. *'కృషితో నాస్తి దుర్భిక్షమ్'*– అన్న ప్రాచీనుల పలుకులు వేదహృదయస్పందనలే. ఈ సనాతననాదాన్ని అమలు పరచుకున్న హిందూ ధర్మం అద్భుతంగా అభివృద్ధిని సాధిస్తుందనడంలో సందేహం లేదు.

తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 57 సెప్టెంబరు, 2026 సంచిక : 04



వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి॥

గౌరవ సంపాదకులు
శ్రీ ముద్దాడ రవిచంద్ర, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు

ప్రచురణకర్త-సంపాదకులు,
ప్రధాన సంపాదకులు (ఎఫ్.ఏ.సి.)
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఎ., పిహెచ్.డి.,
పి.జి.డిప్లొమా ఇన్ జె.ఎం.సి.

ఉపసంపాదకురాలు
డా॥ అల్లాడి సంధ్య, ఎం.ఏ.(తెలుగు& సంస్కృతం),
ఎం.ఫిల్., పిహెచ్.డి., పి.జి.డిప్లొమా ఇన్ జర్నలిజం

ముద్రాపకులు
శ్రీ ఆర్.వి.విజయకుమార్, బి.ఏ., బి.ఎడ్.,
ఉపకార్యనిర్వహణాధికారి,
(పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం), తి.తి.దే., తిరుపతి.

ఫోటోలు
శ్రీ పి.ఎన్.శేఖర్, చీఫ్ ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
ప్రధానసంపాదకులు-0877-2264363
కార్యాలయం -0877 -2264543
0877 -2264359

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా(12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-

వెబ్‌సైట్- ttdevasthanams.ap.gov.in;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
sapthagiri_helpdesk@tirumala.org;
ద్వారా తెలియజేయవచ్చు.

24 గంటలూ పనిచేసే ఈ క్రింది తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్‌నెంబర్లకి ఫోన్ చేసి తి.తి.దే.కి సంబంధించిన సమస్తసమాచారాన్ని మీరు తెలుసుకోవచ్చు.

0877 2277777 / 2233333

## ఈ నెలలో....

| | | |
|---|---|---|
| కృషి- తద్వారా క్షేమం, సంపద, పోషణ | బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ | 04 |
| తిరుమల బ్రహ్మోత్సవాలు- నాటి సంప్రదాయం, నేటి వైభవం | శ్రీ అర్చకం రామకృష్ణ దీక్షితులు | 07 |
| తోమని పళ్లాల్లో వేంకటేశ్వరునికి విందు | శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం | 18 |
| తిరుమోగూర్ (108 దివ్యదేశాలు) | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 24 |
| శ్రీవారి బ్రహ్మోత్సవ వాహనాల దివ్య వైభవం | అర్చకం శ్రీనివాసకృష్ణచంద్ర దీక్షితులు | 31 |
| అన్నమయ్య పదాల్లో శ్రీకృష్ణ తత్త్వం | డా॥ వేదార్థం మధుసూదన శర్మ | 37 |
| ప్రథమపూజితా ప్రమథగణాధిపా! | శ్రీ జంధ్యాల శరత్‌బాబు | 40 |
| శ్రీ 'వామన' వైభవం | ప్రాచార్య శలాకరఘునాథశర్మ | 43 |
| తిరుమంగయాళ్వార్ల పాశురాలలో "బలరాముడు" | డా॥ ఈ.ఏ.శింగరాచార్యులు | 45 |
| శ్రీవారి వైద్య సేవ- మానవసేవకు శ్రీనివాసుని దివ్య వేదిక | | 48 |
| శ్రీవారి సేవా మాహాత్మ్యం | శ్రీమతి ఏ.వీ.ఎన్.లలిత | 49 |
| గోవర్ధనగిరిధారి (చిత్రకథ) | కథ: శ్రీ డి.శ్రీనివాస దీక్షితులు<br>చిత్రాలు: శ్రీ కె.ద్వారకనాథ్ | 50 |
| క్విజ్ | | 52 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాలవేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 53 |
| శ్రీపదకేళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 54 |

ముఖచిత్రం : తిరుమల వార్షిక బ్రహ్మోత్సవం- 'ధ్వజారోహణం'
వెనుకచిత్రం : తిరుమల వార్షిక బ్రహ్మోత్సవం- 'రథోత్సవం'



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

# సప్తగిరీశుని వార్షిక బ్రహ్మోత్సవం

**'వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన'**

బ్రహ్మాండంలో ఎక్కడా వేంకటాద్రికి సమానమైన స్థానం లేదు. కలియుగ వైకుంఠం ఇది. ఆదిదేవుడు, సర్వాదిదేవుడు, వేదవేద్యుడు అయిన ఆ శ్రీమన్నారాయణుడు కోరికోరి ముచ్చటపడి వెలసిన శిఖరం ఇది. పరమపావన పుణ్యక్షేత్రం ఇది. వేంకటాద్రిని దర్శిస్తేనే చాలు పాపాలు పటాపంచలై పునీతమౌతుంది జన్మ.

అంతటి పవిత్రమైన తిరుమల శిఖరాగ్రాన అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన వేంకటేశ్వరుడికి ఉత్సవాలు జరుగుతున్నాయి. ఆయన సన్నిధానంలో అనేక ఉత్సవాలు జరుగుతూనే ఉంటాయి. కాని ఇది సర్వోత్కృష్టమైన **'బ్రహ్మోత్సవం'**.

సృష్టికర్త బ్రహ్మ తానే అంకురార్పణ చేసి ముందుగా నిలిచి జరిపే ఉత్సవం. ముక్కోటి దేవతలు ముదమార ఇలకు దిగివచ్చి కలియుగ వైకుంఠంలో కొలువుదీరే ఉత్సవం. వారందరు అదృశ్యంగా ఉండి శ్రీనివాసుని ఉత్సవ దృశ్యాలను ఆశ్చర్యంతో ఆనందంతో తిలకించే ఉత్సవం. మానవులు దేవతలు కలిసి పరమాత్ముడికి జరిపే పవిత్ర ఉత్సవం.

**ఒక్కసారి దర్శిస్తే తరిస్తుంది జన్మ, ఒక్కసారి కీర్తిస్తే నశిస్తుంది కర్మ.**

ఈసారి స్వామివారికి రెండు బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. సెప్టెంబరు నెలలో **'వార్షిక బ్రహ్మోత్సవాలు'**, అక్టోబరులో **'నవరాత్ర బ్రహ్మోత్సవాలు'** జరుగుతున్నాయి. వార్షిక బ్రహ్మోత్సవాలలో **'ధ్వజారోహణం'**, **'ధ్వజావరోహణం'** ఉంటుంది. నవరాత్ర బ్రహ్మోత్సవాలలో ఇది ఉండదు.

తిరుమలలో ఎటు విన్నా వేదఘోష వినిపిస్తుంది. ప్రతి చెట్టు, పిట్టకూడ నారాయణ నామజపమే చేస్తుంటాయి. అంగరంగ వైభవంగా అలంకరణలు. శేషవాహనం ఆదిగా ఆ ఆదిపురుషుడికి నిత్యం రకరకాల వాహనాలలో ఊరేగింపులు జరుగుతాయి.

ఎటువిన్నా గోవిందనామం. ఎటుచూసినా నారాయణరూపం. తిరుమల వైకుంఠ ప్రతిరూపం. ఆర్తితో ఆ వేంకటమూర్తిని తిలకిస్తే జీవితానికి స్ఫూర్తి కలుగుతుంది. అంతేకాక విశ్వరథచోదకుడు అధిరోహించిన రథాన్ని ముందుకు నడిపే భాగ్యం మనకు లభిస్తుంది. అందుకే అందరం తిరుమల చేరుకోవాలి. అంబరాన్ని అంటే బ్రహ్మోత్సవ సంబరాల్లో మనమూ భాగస్వాములం కావాలి. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో పాల్గొనలేని భక్తులు, నవరాత్ర బ్రహ్మోత్సవాలలో పాల్గొని శ్రీవారి అనుగ్రహానికి పాత్రులుకండి.

స్వామికి **'ఆత్మ'**ను నైవేద్యం చేసి అర్పించుకోవాలి.

ఈ బ్రహ్మోత్సవాలలో శ్రీవారిని దర్శించుకోవటానికి విచ్చేసే భక్తులందరికీ అన్ని సౌకర్యాలు కల్పించటానికి తిరుమల తిరుపతి దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. భక్తులుకూడ దేవస్థానంతో సహకరించాలి. జన్మ లభించినందుకు, ప్రాణశక్తి పరమాత్ముడు ప్రసాదించినందుకు పరుగుపరుగున తిరుమల చేరుకుందాం. మాధవుడికి జరిగే బ్రహ్మోత్సవాలలో ప్రత్యేకించి భక్తులు ముందుంటారని చాటుకుందాం.

**కన్నులున్నందుకు వెంకన్నను దర్శిద్దాం. నోరున్నందుకు గోవిందనామం కీర్తిద్దాం.**

దేవతలతో పాటు మనము గొంతు కలిపి **'వేంకటేశ సమో దేవో, న భూతో న భవిష్యతి'** అంటూ వినమ్రంగా ప్రణమిల్లుదాం!

ఓం నమో వేంకటేశాయ

శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు- 15 సెప్టెంబరు నుండి 23 వరకు

# తిరుమల బ్రహ్మోత్సవాలు- నాటి సంప్రదాయం, నేటి వైభవం

- శ్రీ అర్చకం రామకృష్ణ దీక్షితులు, శ్రీవారి అనువంశిక అర్చకులు, 94944 04343

శ్రీవారి బ్రహ్మోత్సవాలపై ప్రత్యేక కథనం



ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులందరూ ఎంతో ఆత్రుతతో ఎదురుచూసే అతి పవిత్రమైన సమయం...

తమ ఆధ్యాత్మిక తృష్ణను తీర్చుకోవాలని పరితపించే భక్తులందరికీ ఎంతో ఇష్టమైన సమయం... శ్రీమన్నారాయణుని దేదీప్యమానమైన మహోత్సవాలను కనులారా చూసేందుకు దేవతలు, మానవులు తిరువీథులలో భుజాలు రాసుకుంటూ నిలిచి వీక్షించే అపురూపమైన సమయం...

నిజంగా ఇది ఎలాంటి సమయమంటే, దేవుని తలచుకోనివారు సైతం ఆ వైభవాన్ని చూసి ముగ్ధులై, 'ఆహా! ఎంతటి అద్భుతమైన దృశ్యం! నా జన్మ ధన్యమైనది' అని తమలో తాము అనుకునే సమయం...

ఆ విశిష్టమైన సమయం మరేదో కాదు, సమస్తప్రాణికోటిని అనుగ్రహించడానికి శ్రీ శ్రీనివాస ప్రభువు భూమిపై ఆవిర్భవించిన పుణ్యదినాన్ని పురస్కరించుకుని తిరుమలలో నిర్వహించే "వార్షిక బ్రహ్మోత్సవాల" సమయం ఇదే! ఈ దివ్యమైన మహోత్సవాలు గతంలో ఏ విధంగా జరిగేవి, మరి ఇప్పుడు ఎలా నిర్వహించబడుతున్నాయో ఒకసారి విహంగ వీక్షణం చేద్దాం... గోవిందా... గోవిందా!

## తిరుమల శ్రీనివాసుని ఉత్సవాలు



తిరుమల శ్రీనివాసస్వామివారికి ఏడాది పొడవునా 1) నిత్యోత్సవాలు 2)వారోత్సవాలు 3)పక్షోత్సవాలు 4)మాసోత్సవాలు 5) వార్షికోత్సవాలు లేదా సంవత్సరోత్సవాలు ఇలా ఐదు విధాలుగా అత్యంత వైభవంగా జరుగుతాయి.

## నిత్యోత్సవాలు

తిరుమలలో ప్రతిరోజు తెల్లవారుజామున సుప్రభాతం మొదలు రాత్రి ఏకాంతసేవ వరకు శ్రీస్వామివారికి ఎన్నో సేవలు, ఉత్సవాలు జరుగుతాయి. ఇలా ఒక రోజులో జరిగే వాటిని 'నిత్యోత్సవాలు' అంటారు.

ప్రతిపుటలోని శ్రీనివాసుని ఉత్సవ వివరాలన్నీ, శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం గారి "శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవాలు" (తి.తి.దే.) పుస్తకం నుండి స్వీకరించబడినవి. కొన్ని సేవల చిత్రాలు 'నమూనా ఆలయం', 'తి.తి.దే. వైభవోత్సవాల' లోనివి.

## సుప్రభాతం



తిరుమలలో శ్రీస్వామి వారికి జరిగే తొలిసేవ 'సుప్రభాతం'. శయన మండపంలో పట్టుపానుపుపై శయనించి ఉన్న శ్రీనివాస ప్రభువును మేల్కొల్పడమే 'సుప్రభాతం' అంటారు.

ప్రతిరోజు తెల్లవారు జామున బంగారు వాకిలి ముందు ఆచార్య పురుషులు "కౌసల్యా సుప్రజారామ..." అంటూ సుప్రభాత శ్లోకాలను పఠిస్తూ ఉండగా అదే సమయంలో తాళ్లపాక అన్నమయ్య వంశీయులు ఒకరు "మేలుకో శృంగార రాయ..." అంటూ మేల్కొల్పులు పాడతారు.

ఈ సమయంలో అర్చకులు, జియ్యం గారులు, ఆలయాధికారులు, సుప్రభాత సేవకు ఆర్జితం చెల్లించిన భక్తులు ఇలా అందరూ బంగారు వాకిలిముందు చేరి ఎప్పుడెప్పుడు బంగారు వాకిళ్లు తెరుస్తారా? అని నిరీక్షిస్తుంటారు.

బంగారువాకిలి ముందు ఆచార్యులు సుప్రభాత స్తవాన్ని పూర్తి చేయగా, బంగారు వాకిళ్లు తెరుస్తారు. అందరూ ఒకరి తర్వాత ఒకరుగా వెళ్లి స్వామివారిని దర్శిస్తూ హారతి, తీర్థ శఠారిలను స్వీకరిస్తారు. చివరగా ఆర్జితం చెల్లించిన భక్తులు వెళ్లి శ్రీస్వామివారిని దర్శిస్తారు. సుప్రభాత సేవలో కలిగే శ్రీహరి ఆపాదమస్తక దర్శనాన్ని "విశ్వరూప సందర్శనం" అంటారు. ఈ దర్శనంలో కలిగే శ్రీస్వామివారి పాదదర్శనం చేస్తే చాలు పాపాలు పోతాయి. అందువల్లే "శ్రీహరి పాదదర్శనం పాప విమోచనం" అన్న ప్రసిద్ధి కలిగింది.

తిరుమల దివ్యక్షేత్రంలో బ్రహ్మోత్సవం అనే ఈ మహోత్సవాన్ని "కాలోత్సవం"గా నిర్వహిస్తారు– అంటే ప్రతి సంవత్సరం ఒక నిర్దిష్టమైన కాలంలో క్రమం తప్పకుండా ఈ క్రతువును నిర్వహిస్తారు. కాశ్యపజ్ఞానకాండ ప్రకారం, విష్ణు ఆలయాలలో నిర్వహించే మూడురకాల ఉత్సవాలైన కాలోత్సవం, శ్రద్ధోత్సవం, నిమిత్తోత్సవాలలో **'కాలోత్సవం'** అత్యంత ప్రధానమైనది. 'ఉత్సవం' అనే పదానికి ఉత్కృష్టమైన యజ్ఞం అని అర్థం ఉంది. మన ప్రాచీన దేవాలయాలలో వెలసిన దేవతలకు నిర్వహించే ఉత్సవాలు, ఆ ప్రాంతంలో నివసించే సమాజం యొక్క శ్రేయస్సు, శ్రేయోభివృద్ధి కోసం చేసే గొప్ప యజ్ఞాలుగా ఖ్యాతిని గడించాయి.

బ్రహ్మోత్సవం లేదా మహోత్సవం అంటే భగవంతుని అనుగ్రహాన్ని పరిపూర్ణంగా పొందేందుకు చేసే ఉత్కృష్టమైన యజ్ఞం. సమస్తమానవాళిని తరింపజేయడం కోసం కృతయుగంలో, వేంకటాచల పర్వతంపై స్వయంభువుగా వెలసిన శ్రీవేంకటేశ్వరుడు, తన కుడిచేతిని **'వరదముద్ర'**లో చూపిస్తూ అన్ని ధర్మాలను విడనాడి ఎటువంటి సందేహాలు లేకుండా తన పాదపద్మాలను ఆశ్రయించినవారికి:

**సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే ।**
**అభయం సర్వభూతేభ్యో దదామ్యేతద్వ్రతం మమ ॥**

అని సెలవిచ్చినట్లు, ఎడమచేతిని **'కట్యవలంబిత'** ముద్రలో ధరించి, తన పాదాలను స్థిరంగా నమ్మినవారికి సంసారసాగరం మొలబంటి లోతు మాత్రమేనని సూచిస్తూ సర్వవైభవాలతో, మహిమలతో, ఆశ్రయించిన భక్తులందరినీ అనుగ్రహిస్తూ కొలువై ఉన్నాడు. కళలను ఆరాధించేవారికి, కళాత్మక హృదయం ఉన్నవారికి శ్రీవారి బ్రహ్మోత్సవాలు జీవితంలోని వైవిధ్యమైన సంప్రదాయాలను, విశిష్టమైన కళారూపాలను చూసే ఒక గొప్ప సందర్భం.

వైఖానస ఋషియైన భగవాన్ అత్రిమహర్షి ప్రకారం, బ్రహ్మోత్సవాలు శాంతి, ఆనందం, ఆరోగ్యం, సంపదలను ఇస్తుంది.'

**కన్యా మాసే గతే భానౌ ద్వితీయాయాం జగత్పతే ।**
**ధ్వజారోహణ మాదాయ సాంకురార్పణమేవ చ ॥**

అన్న పురాణ ప్రమాణం మేరకు, ఇవి ప్రాచీన కాలం నుండి కన్యామాసం– పురట్టాసి (సెప్టెంబర్/ అక్టోబర్) నెలలో నిర్వహించబడుతున్నాయి.

శ్రీవైష్ణవ భక్తాగ్రేసరులైన ఆళ్వారుల పాశురాలు, ఈ కొండపై 'పరసినాళ్'లో (ఉత్సవ దినాలలో) భక్తులు పెద్ద సంఖ్యలో గుమిగూడేవారని తెలియజేస్తున్నాయి. సామాన్య శకం 614 నాటికే తిరుమల కొండపై అనేక ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తిరుమల శ్రీవారి ఆలయంలోని విశిష్ట సంప్రదాయం ఏమిటంటే, గర్భాలయంలో **నిత్యారాధన (తోమాలసేవ) పూర్తయిన తర్వాతే ఉత్సవాలు జరుగుతాయనే విషయాన్ని గమనించాలి; ధ్రువబేరం (మూలవిరాట్) యొక్క నిత్య కైంకర్యాలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఉత్సవాలు నిర్వహిస్తారు.**

### పురాణాల రహస్యాల లోతుల్లోకి...

ప్రాచీన రికార్డుల ప్రకారం, ఈ పండుగ యొక్క పురాతనత్వాన్ని గురించి తెలుసుకోవడానికి చాలా తక్కువ మంది మాత్రమే ప్రయత్నిస్తారు. ఈ పండుగ మొదట ఎప్పుడు ప్రారంభమైందో ఎవరూ ఖచ్చితంగా చెప్పలేరు. **"శ్రీవేంకటాచలమాహాత్మ్యం"** అనే సమగ్ర పురాణ సంకలనంలో ఈ ఉత్సవాన్ని బ్రహ్మదేవుడే స్వయంగా నిర్వహించినట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి.

- **వరాహపురాణం**లోని పందొమ్మిదవ అధ్యాయం శ్రీవేంకటేశ్వరుని మహోత్సవ వృత్తాంతాన్ని వివరిస్తుంది. ఈ కలియుగంలో మానవాళిని రక్షించడానికి దేవతలు, మునుల కోరిక మేరకు భగవంతుడు పవిత్రమైన వేంకటాచల కొండకు వచ్చాడు. మానవాళి పాపాలను దహించి వేయడానికి తాను వచ్చానని భగవంతుడు సెలవిచ్చాడు మరియు బ్రహ్మదేవుని కోరిక మేరకు ఈ కొండలపైనే ఉండిపోతానని మాట ఇచ్చాడు. పురాణ శ్లోకాల ప్రకారం, వేంకటాద్రి రత్నమైన శ్రీవేంకటేశ్వరుడు, విలువైన ఆభరణాలు, బంగారు వస్త్రాలతో అలంకృతుడై ఉచ్చైశ్రవమనే గుర్రం, ఐరావతమనే ఏనుగు, శేషవాహనం, వేదస్వరూపమైన గరుడవాహనాలపై శ్రీలక్ష్మీ దేవితో కలిసి, దివ్య సంగీత వాయిద్యాల నడుమ ప్రతిరోజూ ఊరేగుతూ భక్తులను అనుగ్రహిస్తారు.
- చివరి (9వ)రోజు అత్యంత పవిత్రమైన రోజు– భగవంతుడు భూమిపైకి వచ్చిన **'శ్రవణా'**నక్షత్రం కావడంవల్ల, లక్షలాది మంది భక్తులు పవిత్రమైన స్వామి పుష్కరిణిలో మంగళస్నానాలు ఆచరించి భగవంతుని ఆశీస్సులు పొందుతారు.
- ఇదే పురాణం తర్వాత వివరిస్తూ, చరిత్రకు అందని కాలంలో దేవతలు, మానవులు భూమిపై కలిసి తిరిగే సమయంలో బ్రహ్మదేవునిచే ప్రారంభించబడిన ఈ బ్రహ్మోత్సవాన్ని, ప్రాచీనచోళవంశానికి చెందిన **'తొండమాన్ చక్రవర్తి'** కొనసాగించాడని పేర్కొంది.

**శ్రీవేంకటాచల మాహాత్మ్యం–** భవిష్యోత్తరపురాణం, మొట్టమొదటి సారి చతుర్ముఖ బ్రహ్మదేవుడు, తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారికి జరిపిన బ్రహ్మోత్సవాల గురించి ఎంతో వైభవంగా వర్ణిస్తోంది. భవిష్యోత్తర పురాణం– 14వ అధ్యాయంలో బ్రహ్మదేవుడు నిర్వహించిన తొట్టతొలి బ్రహ్మోత్సవాల గురించి వివరిస్తూ:

> **ఉత్సవం కురు మే పుణ్యం బ్రహ్మన్! లోకపితామహ!**
> **ధ్వజారోహణ మారభ్య రథాన్తం చ సవాహనమ్ ॥ –భవిష్యోత్తర పురాణం**

"ఓ చతుర్ముఖ బ్రహ్మా! ధ్వజారోహణతో ఆరంభించి రథోత్సవం వరకు, ప్రతి రోజూ ఒక విధమైన వాహనంపై నన్ను ఊరేగిస్తూ పవిత్రమైన ఉత్సవాన్ని నిర్వహించు. వేద, ఆగమశాస్త్రాలను సంపూర్ణంగా అధ్యయనం చేసిన వైఖానసుల చేత అనేక రకాల నైవేద్యాదులను మూడుపూటలా నాకు నివేదింపజేయి" అంటూ శ్రీనివాసుడు బ్రహ్మదేవుడిని ఆజ్ఞాపించాడు.

ఇలా శ్రీవారు ఆజ్ఞాపించిన వెంటనే చతుర్ముఖ బ్రహ్మ, తొండమాన్ చక్రవర్తిని పిలిచి, 'నీవు స్వామి వారికి అనేక విచిత్రమైన వాహనాలను, అనేక చిత్రవిచిత్రములతో

## తోమాలసేవ



**తిరుమల ఆనందనిలయంలో శ్రీవేంకటేశ్వర స్వామివారి మూలవిరాట్టుకు ఉత్సవమూర్తులకు... ఇంకా ఇతర విగ్రహాలకు పుష్పమాలలతోను, తులసి మాలలతోను అలంకరించే కార్యక్రమాన్నే 'తోమాల సేవ'అంటారు.**

**భుజాల మీది నుంచి వేలాడేట్లుగా అలంకరించే శ్రీవారి పుష్పాలంకరణ విధానాన్ని "తోళ్ మాలై" అంటారు. అదే "తోమాల"గా మారిందంటారు. 'తోళ్' అనగా భుజమని అర్థం. ఆర్జితం చెల్లించిన భక్తులు కూడ ఈ సేవలో పాల్గొని దర్శించవచ్చు.**

**అయితే సాయంత్రం పూట జరిగే తోమాలసేవ మాత్రం ఏకాంతంగా జరుగుతుంది.**

**ఏకాంగి కాని లేదా జియ్యంగారులు పూల అరనుంచి సిద్ధం చేసిన పూల మాలలను తీసికొనివచ్చి అర్చకులకు అందిస్తూ ఉండగా, అర్చకులు శ్రీవారి నిలువెత్తు విగ్రహానికి పూలమాలల్ని అలంకరిస్తారు.**

**కొలువు**



**తోమాలసేవ అనంతరం ప్రతిరోజు బంగారు వాకిలి లోపలవున్న స్నపన మండపంలో బంగారు సింహాసనంపై కొలువు శ్రీనివాసమూర్తికి కొలువు జరుగుతుంది. ఆ సమయంలో ఆనాటి తిథివార నక్షత్రాది వివరాలతో పంచాంగ శ్రవణం జరిగిన తర్వాత ముందునాటి హుండీ ఆదాయ వ్యయాలు, అన్నదాతల పేర్లు అన్నీ శ్రీస్వామివారికి వినిపిస్తారు. పిదప కొలువు శ్రీనివాసమూర్తికి బెల్లం కలిపిన నువ్వుల పిండి నివేదిస్తారు.**

**బ్రహ్మోత్సవంలో తొలిరోజు ధ్వజా రోహణ జరిగేరోజు మాత్రము ఈ 'కొలువు' బంగారువాకిలిముందర జరుగుతుంది.**

**ప్రతిరోజు 'కొలువు' లో శ్రీనివాసుడు అర్చకులకు 'తండుల దానం' చేస్తాడు. అనగా బియ్యం, తాంబూలం, దక్షిణతో కూడిన బియ్యాన్ని దానం చేస్తాడు.**

**ఈ కొలువు పూర్తిగా ఏకాంతంగా జరుగుతుంది.**

చెక్కబడిన కర్రతో తయారు చేసిన గొప్ప రథమును, చక్కని గొడుగును, చామరములను, విసనకర్రలను విశ్వకర్మ ద్వారా నిర్మించమని' పురమాయించాడు. విశ్వకర్మ తొండమానుడి ఆదేశం ప్రకారం వాహనములను, రథమును, ఛత్రచామరాదులను శ్రీవేంకటేశ్వరునికి ప్రీతి కలిగించే విధంగా నిర్మించాడు.

ఈ ఏర్పాట్లకు తృప్తి చెందిన శ్రీనివాసుడు, అనేక దేశాలనుండి వచ్చిన భక్తులు, ప్రజలు ఈ ఉత్సవాలలో పాల్గొంటే గొప్పగా, వైభవంగా ఉంటుందని, కనుక వివిధ దేశాల రాజులను ఆహ్వానించమని చతుర్ముఖ బ్రహ్మను, తొండమానుడిని ఆజ్ఞాపిస్తాడు. *అంగ, వంగ, కళింగ, కాశీ, కాంభోజ, కేరళ, విరాట, కురు, జాంగల, బర్బర, పాండ్య, చేది, మత్స్య, సింధు* దేశీయుల రాజులు, పరివారము, ప్రజలు శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానింపబడి, అశేష సంఖ్యలో తరలివస్తారు. విచ్చేసిన భక్తులందరూ తమ ధనమును, వస్త్రములను, ఆభరణాలను, శరీరములను, ఆత్మలను, సుఖములను అన్నింటినీ శ్రీ శ్రీనివాస భగవానుని పాదములకు అర్పించారు.

అంతట సృష్టికర్తయైన బ్రహ్మ, సౌరమాన రీత్యా సూర్యుడు **కన్యారాశిలో** సంచరిస్తున్నప్పుడు, శ్రీనివాసభగవానుని అవతారనక్షత్రమైన ***శ్రవణానక్షత్రంనాడు*** అవభృథం(చక్రస్నానం) నిర్ణయించి, శుక్లవిదియహస్తానక్షత్రంనాడు **'అంకురార్పణం'** చేసి, దేవఋషులైన విఖనస, భృగు, మరీచి, అత్రి, కశ్యపులను ఋత్విక్కులుగా నియామకం చేసి, వారి యాజ్ఞీకంలో **'చిత్రా'** నక్షత్రం నాడు ధ్వజారోహణం నిర్వహించి నవాహ్నికంగా (తొమ్మిదిరోజుల పాటు) మహోత్సవాన్ని నిర్వహించాడు. అదే నేడు జరిగే బ్రహ్మోత్స వాలకి నాంది.

పిమ్మట బ్రహ్మ ఆధ్వర్యంలో మహర్షులు వేదమంత్ర పురస్సరంగా యాగశాలలో హోమాలు చేయసాగారు. బ్రహ్మదేవుడు శ్రీవారిని అనేక దివ్యాభరణాలతో అలంకరిం చాడు. విశేషార్చనలతో శ్రీవారిని అర్చించాడు. నేతితో తయారు చేసిన *చక్కెరపొంగలి, కట్టె పొంగలి, నువ్వుల పొంగలి, పులిహోర, క్షీరాన్నం, మాషాన్నం, దధ్యోదనం* వంటి రుచికరమైన అన్నప్రసాదాలను; తిలాపూపం, మాషాపూపం, మనోహరం, మోదకం మొదలైన భక్ష్యాలతో; నానారకాల ఫలాలతో నైవేద్యాలను బ్రహ్మదేవుడు శ్రీవేంకటేశునికి ఘనంగా, విశేషంగా సమర్పించాడు.

ఈ విధంగా తొలి బ్రహ్మోత్సవాన్ని 9 రోజులపాటు మూడుపూటలా నైవేద్యా లతో, రెండు పూటలా వాహనసేవలతో బ్రహ్మ నిర్వహించిన మహోత్సవానికి శ్రియః పతియైన శ్రీనివాసుడు సంతోషించి, 'ఓ బ్రహ్మా! నీ సంకల్పం చక్కగా నెరవేరింది. నేను సంతోషించాను. ఈ మహోత్సవం ఇక మీదట నీ పేరుతో **'బ్రహ్మోత్సవం'** అని ప్రసిద్ధమవుతుంది. ఈ ఉత్సవాలలో పాల్గొన్న వారు, వీక్షించిన వారు దుస్తరమైన సంసారసముద్రాన్ని దాటి, జన్మరాహిత్యాన్ని పొంది సుఖంగా ఉంటారు. ఈ బ్రహ్మోత్సవ మనే యజ్ఞంలో ఎవరైతే పూజనీయులైన భక్తులకు అన్నం, వస్త్రం, ధనం, గృహం, పాత్రలు మొదలైనవి దానం చేస్తారో వారు ధన్యులై, ధనవంతులై సుఖ సంపదలతో కూడిన జీవితాన్ని అనుభవిస్తారు' అని వరమిచ్చాడు. బ్రహ్మదేవుడి ప్రార్థన మేరకు శ్రీనివాసుడు వేంకటాచల క్షేత్రంలో కొలువై భక్తులందరికీ అభయమిస్తూ వారిని దయతో రక్షిస్తాడు. వారికి సకలసంపదలు, సమస్తశుభాలు అనుగ్రహిస్తాడు.

❖ బ్రహ్మాండపురాణంలో ఉన్న ‘శ్రీ వేంకటేశ్వర సహస్రనామ స్తోత్రం’లోని వేయి నామాలలో ఒక నామం ఇలా ఉంటుంది: బ్రహ్మోత్సవ మహోత్సుకాయ నమః (930). అంటే బ్రహ్మదేవుడు తన కోసం జరిపే ఉత్సవాల పట్ల శ్రీనివాస భగవానుడు ఎంతో సంతోషిస్తాడని ఇది సూచిస్తుంది.

❖ శేషాచలనాథునికి బ్రహ్మోత్సవాలను నిర్వహించడంలో బ్రహ్మదేవుడు ఎంతక్రమం తప్పకుండా, నిబద్ధతతో వ్యవహరించాడో అష్టోత్తర శతనామావళిలోని ఒక నామమైన బ్రహ్మకల్పోత్సవాయ శ్రీ వేంకటేశాయ నమః (49) ప్రతిబింబిస్తుంది. ఇవన్నీ ఈ పండుగను సృష్టికర్త స్వయంగా ప్రారంభించారని ధృవీకరిస్తున్నాయి.

**చారిత్రక ఆధారాల కాలంలోకి...**

చరిత్రకు అందని పురాణయుగాన్ని వదిలి, మనం మరింత ఖచ్చితమైన చారిత్రక ఆధారాల కాలంలోకి వద్దాం. తిరుమల ఆలయంలో నేటికీ ఉన్న అనేక శాసనాలలో ఆలయ మొదటి ప్రాకారంలోని ఉత్తర గోడపై ఒక ముఖ్యమైన, చాలా ప్రాధాన్యత కలిగిన శాసనం ఉంది. పల్లవ రాజవంశానికి చెందిన **“సామవై”** లేదా **“కడవన్ పెరుందేవి”** అనే రాణి, మార్గళి– అనగా ధనుర్మాసం (డిసెంబర్/ జనవరి) నెలలో శ్రీవేంకటేశ్వర స్వామికి ధ్వజారోహణంతో ప్రారంభమయ్యే ఏడు రోజుల ఉత్సవాల నిర్వహణ కోసం భూములను, బంగారాన్ని బహూకరించిందని, సూర్యచంద్రులు ఉన్నంత కాలం ఈ పండుగను నిర్వహించాలని ఆమె కోరినట్లు ఈ శాసనం స్పష్టంగా తెలుపుతోంది.

ఇది సామవై రాణి ప్రారంభించిన రెండవ ఉత్సవం. ఆ సందర్భం కోసం, అప్పటి వైఖానస అర్చకుల సూచన మేరకు, ఆమె ఆలయంలో “మణవాళప్పెరుమాళ్” గా పిలవబడే శ్రీనివాస ప్రభువు యొక్క ఘన వెండి విగ్రహాన్ని (**భోగ శ్రీనివాసమూర్తి**) ప్రతిష్ఠింపజేసింది. ఆయన కోసం ఆమె రత్నాలు పొదిగిన కిరీటం, కంఠి, ఇతర ఆభరణాలతో కూడిన పెద్ద సంఖ్యలో ఆభరణాలను సమర్పించింది; ఈ విషయాలన్నీ శాసనాలలో స్పష్టంగా పేర్కొనబడి ఉన్నాయి. చరిత్రకారులు ఈ రాణి కాలాన్ని పల్లవ రాజు దంతివర్మ రోజులతో ముడిపెడతారు మరియు ఈ కాలాన్ని సామాన్య శకం 614గా, అంటే 6వ శతాబ్దపు ప్రారంభంగా ఖచ్చితంగా చెప్పవచ్చు.

శ్రీ వేంకటేశ్వరస్వామికి 14వ శతాబ్దం వరకు రెండు (పెరటాసి, మార్గళినెలల్లో) బ్రహ్మోత్సవాలు జరుగుతుండేవి. 1300 సంవత్సరంలో తిరువేంకటనాథ యాదవరాయని కాలంలో రాచయదండ నాయకుని పేరుమీద సింగమదండ నాయకుడు ఆడి(ఆషాఢ) తిరునాళ్ళు ఏర్పాటు చేశాడు. ఇందుకు గాను ఇల్లత్తూరునాడులోని పొంగళూరు గ్రామాన్ని సర్వమాన్యంగా దానం చేశాడు (శాసనం:1–99, తి.తి.దే శాసనాలు, 1998).

13–01–1388 నాడు విజయనగర ప్రభువు రెండవ హరిహరరాయులు మాసి (మాఘమాసం) తిరునాళ్ళను నిర్వహించడానికి పూంగోడు గ్రామాన్ని దానం చేశాడు. ఈ గ్రామంపై వచ్చే ఆదాయంతో బ్రహ్మోత్సవాన్ని జరిపే కార్యభారాన్ని ముల్లై తిరువేంకటజీయరు వహిస్తాడని శాసనం తెలియజేస్తున్నది (శాసనం 1–185).

## సహస్రనామార్చన



శ్రీవేంకటేశ్వరస్వామి వారి మూల విరాట్టునకు ప్రతిరోజు ఉదయం తోమాల సేవ అనంతరం సహస్రనామార్చన జరుగుతుంది. జియ్యంగారులు అందించిన తులసిని స్వీకరించి అర్చకులు శ్రీవేంకటేశ్వర సహస్ర నామావళితో శ్రీవారి పాదాలను అర్చన చేస్తారు. పిదప అర్చకులు శ్రీవారి వక్షఃస్థలంమీది శ్రీమహాలక్ష్మీ అమ్మవారిని, మహాలక్ష్మి చతుర్వింశతి (24) నామాలతో అర్చిస్తారు.

ఇదిగాక ప్రతిరోజు శ్రీస్వామి వారికి రెండవ, మూడవ అర్చనలుగా మరి రెండు మారులు అష్టోత్తర శతనామాలతో మాత్రమే అర్చన జరుగుతుంది. ఈ అర్చనలు ఏకాంతంగా జరుగుతాయి.

కాని మంగళవారంనాడు రెండవ అర్చనగా జరిగే “అష్టదళపాద పద్మారాధన”లో ఆర్జితం చెల్లించి భక్తులు పాల్గొనవచ్చు.

## నివేదన



**ప్రతిరోజు ఉదయం సహస్ర నామార్చన జరిగిన వెంటనే గర్భాలయంలో శ్రీస్వామివారికి ఇతర మూర్తులకు నివేదన జరుగుతుంది. లడ్డూలు, వడలు, దధ్యోదనం, పులిహోర, పొంగళ్లు వగైరా ప్రసాదాలు నివేదిస్తారు. తొలి నివేదనను మొదటి గంట అంటారు.**

**మధ్యాహ్నం జరిగే నివేదనను - రెండవ గంట అంటారు.**

**రాత్రి జరిగే నివేదనను - మూడవ గంట లేదా రాత్రి గంట అంటారు.**

**ఇక రాత్రి ఏకాంతసేవకు ముందు 'తిరువీసం' గంట అనే చక్కెర పొంగలి ప్రసాదం శ్రీస్వామి వారికి నివేదిస్తారు. తర్వాత దానిని సన్నిధి భాష్యకారులకు నివేదించడం జరుగుతుంది. ఈ నివేదనలన్నీ ఏకాంతంగా అర్చకులు మాత్రమే నిర్వహిస్తారు.**

రెండవ దేవరాయలు 5-2-1429 తేదీన మూడు గ్రామాలు, 2200 పొన్నులు ఉత్సవనిర్వహణకు, నైవేద్యాలకు దానం చేశాడు. ఈ ఉత్సవం అల్పిశి (ఆశ్వయుజమాసం)లో పునర్వసు నక్షత్రం రోజునుండి స్వాతినక్షత్రం రోజువరకు (9 రోజులు) జరుగుతుంది. స్వాతినక్షత్రం నాడు చక్రస్నానం జరుగుతుంది (శాసనం. 1-192).

శ్రీవేంకటేశ్వరస్వామికి 15వ శతాబ్దంలో ఏడు బ్రహ్మోత్సవాలు జరుగుతుండేవి. అవి చిత్తిరి, ఆడి, ఆవణి, పెరటాసి, అల్పిసి, మాసి, పంగుణి నెలల్లో జరిగేవి. ఈ ఏడు బ్రహ్మోత్సవాలలో చక్రస్నానం రోజున శ్రీవేంకటేశ్వరస్వామికి అనంతశయనం అను భక్తుడు నైవేద్యాలు ఏర్పాటు చేశాడు (శాసనం: 1-213 తేదీ: 15-02-1445).

తాళ్లపాక పెదతిరుమలాచార్యులు (అన్నమాచార్యుల కుమారుడు) రెండు వేల వరహాలను శ్రీవారి భండారానికి సమర్పించి, తన పేర ఆణినెలలో (జ్యేష్ఠమాసం) 13 రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాన్ని (ప్రధాన ఉత్సవం 11 రోజులు) ఏర్పాటు చేశాడు (దానశాసనం: 4-129 తేదీ: 7-3-1539). ఈ బ్రహ్మోత్సవం జ్యేష్ఠమాసంలో (ఆణినెలలో) శ్రవణా నక్షత్రం నాడు ప్రారంభమై మృగశిర నక్షత్రం (తిరుమలాచార్యుని జన్మ నక్షత్రం) నాడు చక్రస్నానంతో ముగిసేది.

విజయనగర ప్రభువు సదాశివరాయలకాలంలో రాయసం వేంకటాద్రి అనే భక్తుడు తిరుమలలో జరిగే పది బ్రహ్మోత్సవాలలో కొలువు శ్రీనివాసమూర్తికి నైవేద్యాలు ఏర్పాటుచేసి, 700 రేఖైపొన్నులు ఆదాయం వచ్చే **దేసూరు**గ్రామాన్ని, 200 రేఖైపొన్నులు ఆదాయం వచ్చే **వేలాంజినేడు** గ్రామాన్ని, 130 రేఖైపొన్నులు ఆదాయం వచ్చే సగం తిమ్మసముద్రం గ్రామాన్ని - మొత్తం 1030 రేఖై పొన్నులు ఆదాయం వచ్చే $2^1/_2$ గ్రామాలను- శ్రీ వేంకటేశ్వరస్వామికి దానంగా సమర్పించి 8-7-1551నాడు శాసనం (5-129) వేయించాడు. ఆ సందర్భంలో ఎవరెవరు ఏ ఏ నెలల్లో జరిగే బ్రహ్మోత్సవాలను ఏర్పాటు చేసింది, వాటి వివరాలు ఆ శాసనంలో తెలిపాడు. ఆ వివరాలు ఇట్లున్నవి:

| క్ర.సం. | ఏర్పాటు చేసిన దాత | బ్రహ్మోత్సవం |
|---|---|---|
| 01 | తిరునిన్ర ఉడైయార్లు(తిరుమల ఆలయ అధికారులు) | ఆవణి బ్రహ్మోత్సవం |
| 02 | సామవై పెరుందేవి(బ్రహ్మదేవుని పేరున పల్లవరాణి) | పెరటాసి బ్రహ్మోత్సవం |
| 03 | దేవరాయ మహారాయులు | పెరటాసి బ్రహ్మోత్సవం |
| 04 | బుక్కరాయ మహారాయులు | కార్తికి బ్రహ్మోత్సవం |
| 05 | కృష్ణదేవమహారాయులు (తల్లిదండ్రుల పేరున) | తై బ్రహ్మోత్సవం |
| 06 | హరిహరరాయ మహారాయులు | మాసి బ్రహ్మోత్సవం |
| 07 | వీరనరసింగ యాదవరాయులు | పంగుణి బ్రహ్మోత్సవం |
| 08 | మేలుడయారు (ఆలయాధికారి) | చిత్తిరి బ్రహ్మోత్సవం |
| 09 | తాళ్లపాక తిరుమలాచార్యులు | ఆణి బ్రహ్మోత్సవం |
| 10 | రామరాజు చినతిమ్మరాజు | ఆణి బ్రహ్మోత్సవం |

ఈ విధంగా 16 వ శతాబ్దంలో శ్రీ వేంకటేశ్వర స్వామికి తొమ్మిది నెలల్లో పది బ్రహ్మోత్సవాలు 9, 11, 13 రోజుల పాటు జరుగుతుండేవి. ఈ బ్రహ్మోత్సవాలన్నీ కూడ సర్వమాన్య గ్రామాల, దేవమాన్య గ్రామాల భూముల సంవత్సర ఆదాయంపై ఆధారపడి జరుపబడుతుండేవి. దాతలందరూ తమ అనంతరం దానం రక్షింపబడాలని, తమ ఉభయం కొనసాగాలని కోరుకొంటూ శాసనం చివరగా:

దానపాలనయోర్మధ్యే దానాత్ శ్రేయోనుపాలనమ్
దానాత్ స్వర్గమవాప్నోతి పాలనాదచ్యుతం పదమ్।
స్వదత్తాత్ ద్విగుణం పుణ్యం పరదత్తానుపాలనమ్
పరదత్తాపహారేణ స్వదత్తం నిష్ఫలం భవేత్ ॥

“దానము, పాలనముల మధ్య తరతమ భేదం ఉంది. దానం కంటే ఇతరులు చేసిన దానాన్ని కాపాడుట శ్రేయస్కరమైన కార్యం. తాను దానం చేయడం వలన స్వర్గం లభిస్తుంది. ఇతరుల దానాన్ని రక్షించడం వలన మోక్షం (జన్మరాహిత్యం) లభిస్తుంది. తాను దానం చేసిన దానికంటే రెండింతల పుణ్యం ఇతరుల దానాన్ని కాపాడుట వలన లభిస్తుంది. ఇతరులు చేసిన దానద్రవ్యాన్ని అపహరించుట వలన తాను చేసిన దానం నిష్ఫలం అవుతుంది” అని వ్రాయించారు.

18వ శతాబ్దం నాటికి ఈ దానగ్రామాలు, భూములు, అన్యుల పరిపాలనకు లోనై అన్యాక్రాంతం అయ్యాయి. స్థిరాస్తుల ఆదాయం పోవడంచేత వారు ఏర్పాటుచేసిన ధర్మాలు, ఉభయాలు నిలిచిపోయాయి. వారు ఏర్పాటుచేసిన బ్రహ్మోత్సవాలు నిలిచి పోయాయి. అంతేగాక దాతలందరూ వారి వారి పేర, వారి జన్మనక్షత్రం నాడు చక్రస్నానం నిర్ణయించి ముందు ఎనిమిది, తొమ్మిది రోజుల నుండి జరిగే బ్రహ్మోత్సవాలను ఏర్పాటు చేశారు. వారి తదనంతరం వారు ఏర్పాటుచేసిన ధర్మకార్యాలు సహజంగా నిలిచిపోయాయి.

అయితే సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడు లోకకల్యాణం కొరకు వేంకటేశ్వరస్వామి అవతార నక్షత్రమైన కన్యాశ్రవణం నాడు చక్రస్నానం నిర్ణయించి, ముందు తొమ్మిది రోజుల నుండి నిర్వహించిన బ్రహ్మోత్సవాలు (బ్రహ్మదేవుని పేర పల్లవరాణి సామవై పెరుందేవి 614 సం॥లో పునరుద్ధరించి ఏర్పాటు చేసినవి) మాత్రం అఖండ వైభవంతో ఆనాటి నుండి నేటివరకు కొనసాగుతూ శ్రీవేంకటేశ్వరవైభవాన్ని దశదిశలా చాటుతున్నాయి. ఇవి అంకురార్పణ, ధ్వజారోహణంతో మొదలై చక్రస్నానం, ధ్వజావరోహణంతో ముగియుచున్న పదిరోజుల తిరునాళ్ళు. వీటిని తమిళ భాషలో **“తిరుక్కోడి తిరునాళ్”** అని పిలిచేవారు. ఈ పేరే శాసనాలలో ఉంది.

## అధికమాసం - రెండు బ్రహ్మోత్సవాల ఆగమ రహస్యం

తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి అధికమాసం కారణంగా రెండు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ప్రస్తుతం తిరుమలలో

## శాత్తుమొర

శ్రీస్వామివారికి నివేదించిన దధ్యోదనం, చక్కెర పొంగలి ప్రసాదాలు రామానుజుల వారికి మళ్లీ నివేదిస్తారు. పిదప వైష్ణవాచార్య పురుషులు శ్రీస్వామివారి సన్నిధిలో దివ్య ప్రబంధ పారాయణం చేస్తారు. దీన్నే శాత్తు మొర అంటారు. పిదప ఈ వైష్ణవాచార్యులు అందరు రామానుజులకు నివేదన అయిన ప్రసాదాన్ని స్వీకరిస్తారు.

## కల్యాణోత్సవం

శ్రీవారిఆలయం సంపంగి ప్రదక్షిణంలో ఉన్న శ్రీవేంకటరమణస్వామి కల్యాణమండపంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి వారికి ప్రతిరోజు మధ్యాహ్నం 12 గంటలకు “కల్యాణోత్సవం” జరుగుతుంది.

భక్తులు నిర్ణీత ఆర్జిత రుసుమును చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు.

ప్రత్యేక ఉత్సవ సమయాల్లో, విశేష సమయాల్లో జరిగే ఈ కల్యాణోత్సవాన్ని 15వ శతాబ్దంలో నిత్యకల్యాణోత్సవంగా నిర్వహించి ఏర్పాటు చేసినవారు తాళ్లపాక అన్నమాచార్యులవారు. కనుకనే నేటికీ జరిగే ఈ కల్యాణోత్సవంలో తాళ్లపాక వంశీయులు కన్యాదాతలుగా పాల్గొంటూ సత్కారాన్ని పొందుతూనే ఉన్నారు.

బ్రహ్మోత్సవం, పుష్పయాగం, పవిత్రోత్సవం వంటి విశేషోత్సవ సమయాల్లో తప్ప, మిగిలిన అన్నిరోజుల్లో విధిగా శ్రీవారికి నిత్య కల్యాణోత్సవం జరుగుతుంది.

కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు ప్రసాదాలు ఇస్తారు.



## డోలోత్సవం (అద్దాల మండపం)



ప్రతిరోజు మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఆర్జితంగా నిర్ణీత రుసుమును చెల్లించిన భక్తుల కోరిక మేరకు దేవేరులతో శ్రీ మలయప్ప స్వామివారికి అద్దాల మండపంలో డోలోత్సవం జరుగుతుంది.

ఆర్జితం చెల్లించిన భక్తుల కొరకు మాత్రమే ఈ సేవ జరుపబడుతుంది.

## ఆర్జిత బ్రహ్మోత్సవం

ఆర్జిత రుసుమును చెల్లించిన భక్తుల కోరికమేరకు ఆలయం ముందరవున్న వైభవ మండపంలో శ్రీదేవీ భూదేవీ సమేతంగా శ్రీ మలయప్పస్వామికి ఆర్జిత బ్రహ్మోత్సవం జరుపుతారు. ముఖ్యంగా పెద్దశేషవాహనం, గరుడవాహనం, హనుమంత వాహనం- మాత్రమే ఆర్జిత బ్రహ్మోత్సవంలో సంక్షిప్తంగా నిర్వహిస్తారు.

కల్యాణోత్సవానంతరం ఆర్జిత భక్తుల కోరిక మేరకు మాత్రమే ఈ బ్రహ్మోత్సవం జరుగుతుంది.

కన్యామాసంలో జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలు తొమ్మిదిరోజుల పాటు జరుగుతున్నాయి. అయితే చాంద్రమానరీత్యా సంవత్సరంలో అధికమాసం వచ్చినప్పుడు రెండు బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి.

అధికమాసం ప్రతి మూడవ సంవత్సరంలో వస్తూంటుంది. అధికమాసం లేని సంవత్సరంలో కన్యాశ్రవణం ఆశ్వయుజ మాసంలోనే వస్తుంది. అప్పుడు ఆశ్వయుజ విదియ మొదలు (చిత్తానక్షత్రం మొదలు) విజయదశమి (శ్రవణానక్షత్రం) వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతుంటాయి. అధికమాసం ఉన్న సంవత్సరంలో కన్యాశ్రవణం చాంద్రమాన భాద్రపదమాసంలో వస్తుంది. కనుక భాద్రపదమాసంలో జరిగే బ్రహ్మోత్సవాలు ప్రధానమైన **'వార్షిక బ్రహ్మోత్సవాలు'**. ఆ సంవత్సరంలో యథాపూర్వం ఆశ్వయుజ మాసంలో కూడ బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఈ రెండవ బ్రహ్మోత్సవాలను **"నవరాత్రి బ్రహ్మోత్సవాలు"** అని వ్యవహరిస్తారు.

వీటిలో కన్యాభాద్రపద మాసంలో జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రధానమైనవి. ఈ బ్రహ్మోత్సవాలలో అంకురార్పణ, ధ్వజారోహణంతో ప్రారంభమై ధ్వజావరోహణంతో ముగుస్తాయి. వాహనసేవలు యథావిధిగా ఉంటాయి. నవరాత్రి బ్రహ్మోత్సవాలలో అంకురార్పణ, ధ్వజారోహణ, ధ్వజావరోహణాలు ఉండవు. ఈ ఉత్సవాలకు అష్ట దిక్పాలకులు, దేవతలు ఆహ్వానింపబడరు. వాహన ఉత్సవాలలో... మొదటి వార్షిక బ్రహ్మోత్సవాలలో కొయ్యతేరును రథోత్సవంలో ఉపయోగిస్తారు. రెండవ నవరాత్రి బ్రహ్మోత్సవాలలో కొయ్యతేరుకు బదులు పూర్వం వెండిరథాన్ని ఉపయోగించేవారు; ఇప్పుడు వెండి రథానికి బదులుగా బంగారురథాన్ని ఉపయోగిస్తున్నారు. మొదటి వార్షిక బ్రహ్మోత్సవాలలో రాత్రి వాహన ఊరేగింపు తర్వాత ఉత్సవమూర్తులకు రంగనాయకుల మండపంలో ప్రతినిత్యం బంగారు తిరుచ్చిలో ఆస్థానం జరుగుతుంది. రెండవ నవరాత్రి బ్రహ్మోత్సవాలలో రాత్రి వాహనోత్సవం తర్వాత ప్రతినిత్యం రంగ నాయకుల మండపంలో బంగారు శేషవాహనంపై ఉత్సవమూర్తులకు (మలయప్పస్వామి, శ్రీదేవి భూదేవులకు) విశేషమైన నవరాత్రి కొలువు, ఆస్థానం జరుగుతుంది.

దేశంలో ఇతర వైష్ణవ దేవాలయాలలో అధిక మాసం వచ్చిన సంవత్సరం రెండు బ్రహ్మోత్సవాలు జరిగే సంప్రదాయం లేదు. తిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామికి మాత్రమే రెండు బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి.

గడచిన సంవత్సరాలలో జరిగిన బ్రహ్మోత్సవాల తేదీలను పరిశీలించినట్లయితే, అధికమాసం వచ్చిన సంవత్సరాలలో రెండవ బ్రహ్మోత్సవం నిర్వహించకపోతే వార్షిక బ్రహ్మోత్సవాల మధ్య వ్యవధి సంవత్సరం దాటిపోతుంది. ఇది వైఖానస ఆగమ నిర్దేశం అయిన కాలోత్సవ నియమానికి విరుద్ధం అవుతుంది. కనుక ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా బ్రహ్మోత్సవాలు నిర్దేశిత మాసంలో నిర్వహించాల్సి ఉండటంతో, అధికమాసం వచ్చిన సంవత్సరం రెండు బ్రహ్మోత్సవాలు జరుపబడుతున్నాయి అని స్పష్టమగుచున్నది.



నవరాత్రి బ్రహ్మోత్సవాలలో 'అంకురార్పణ, ధ్వజారోహణ, ధ్వజావరోహణలు' ఉండవు

వైఖానస భగవచ్ఛాస్త్రం ప్రకారం శ్రీవారికి జరిగే బ్రహ్మోత్సవం అనేది ఒక "కాలోత్సవం". అంటే శాస్త్రం నిర్దేశించిన నిర్దిష్టకాలంలోనే (సౌరమాన కన్యామాసంలో, శ్రవణా నక్షత్రం అంత్యంగా) దీనిని తప్పకుండా నిర్వహించాలి. భృగు సంహిత ప్రకారం ఈ నిర్ణీత కాలం తప్పిపోతే అది "కాలహీన దోషం" అవుతుంది.

## అధికమాసం వల్ల వచ్చే సమస్య

చాంద్రమాన సంవత్సరానికి (354 రోజులు), సౌరమాన సంవత్సరానికి (365 రోజులు) మధ్య ఉండే 11 రోజుల తేడా వల్ల ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి చాంద్రమానంలో "అధికమాసం" వస్తుంది.

- ఒకవేళ అధికమాసం వచ్చిన సంవత్సరంలో కూడా సాధారణ సంవత్సరం లాగే కేవలం ఒకే ఒక్క బ్రహ్మోత్సవాన్ని నిర్వహిస్తే... ఒక బ్రహ్మోత్సవానికి, తర్వాతి బ్రహ్మోత్సవానికి మధ్య ఉండాల్సిన వ్యవధి 12 నెలలు దాటి, దాదాపు 13 నెలలకు పైగా పెరిగిపోతుంది.
- ఇది వైఖానస ఆగమ సూత్రాల ప్రకారం "కాలోత్సవ కాలాతీత దోషం" కిందికి వస్తుంది.

మరీచి విమానార్చనాకల్పం (99వ పటలం) ప్రకారం కాలోత్సవం నిర్దేశిత కాలం దాటిపోతే (కాలోత్సవే వ్యతీతే తు), దానికి మహాశాంతి హోమాదులువంటి ద్విగుణీకృత ప్రాయశ్చిత్తాలు చేయవలసి ఉంటుంది. అలా ప్రాయశ్చిత్తం చేయకుండా కాలాతీతంగా ఉత్సవం జరిపితే అది ఆగమ విరుద్ధం అవుతుంది.

ఈ ప్రాయశ్చిత్తాల జోలికి వెళ్లకుండా, అసలు దోషమే సంభవించకుండా ఉండడానికి అప్పటి తిరుమల శ్రీవారి వైఖానస అర్చకులు ఈ నియమాన్ని తిరుమలకు అన్వయించారు.

ఒకసారి వైఖానస సంహితలను పరిశీలిస్తే, వైఖానస భగవచ్ఛాస్త్రం ప్రకారం తిరుమల శ్రీవారి ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాలు కేవలం ఉత్సవాలు మాత్రమే కావు, అవి నిర్దేశిత కాలంలోనే జరగవలసిన "కాలోత్సవాలు". ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి వచ్చే అధికమాసం వల్ల ఈ కాలగణనలో వచ్చే వ్యత్యాసాన్ని, ఆగమ దోషాలు సంభవించకుండా వైఖానస సంహితలు ఏ విధంగా పరిష్కారాలు సూచించాయో తెలుసుకుందాం:

### 1) మరీచి విమానార్చనకల్పం (ప్రాయశ్చిత్త పటలం):

మరీచిమహర్షి తన విమానార్చనకల్పంలో కాలోత్సవం సమయం దాటిపోతే వచ్చే ప్రాథమిక దోషాన్ని మరియు దానికి చేయవలసిన విధిని ఇలా పేర్కొన్నారు:

కాలోత్సవే వ్యతీతే తు తోరణాదివివర్జితే ।
మహాశాంతిం తతః కృత్వా ఉత్సవం తు సమాచరేత్ ॥

నిర్ణీత కాలంలో జరగవలసిన బ్రహ్మోత్సవాది కాలోత్సవాలు ఆ సమయానికి జరగకుండా కాలాతీతమైతే, ఆలయంలో మొదట 'మహాశాంతి' హోమాన్ని/ ప్రోక్షణను నిర్వహించిన తర్వాతే ఉత్సవాన్ని తిరిగి ప్రారంభించాలి.

## వాహన సేవలు



భక్తులు తమ ఇష్టానుసారం శ్రీ వేంకటేశ్వరునికి ఆ యా రోజుల్లో వాహనసేవలు చేయించవచ్చు. ఇవి కూడ ఆర్జిత భక్తుల కోరికమేరకు మాత్రమే జరుగుతాయి. ప్రధానంగా గరుడ వాహనం, హనుమంత వాహనం, పెద్దశేషవాహనంవంటి సేవలు ప్రతిరోజు మధ్యాహ్నం 2 గంటలకు ఆలయం ముందర ఉన్న వైభవ మండపంలో నిర్వహిస్తారు.

## ఆర్జిత వసంతోత్సవం



నిర్ణీత రుసుమును చెల్లించిన భక్తుల కోసం మాత్రమే ప్రతిరోజు మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఆలయం ముందరి భాగంలోవున్న వైభవ మండపంలో ఆర్జిత వసంతోత్సవాన్ని నిర్వహిస్తారు. శ్రీదేవి భూదేవులతో కూడిన శ్రీ మలయప్ప స్వామికి ఈ వసంతోత్సవం జరుగుతుంది.

## సహస్ర దీపాలంకరణ సేవ



ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు శ్రీవారి ఆలయం వెలుపల ఆగ్నేయ మూలలో ఉన్న కొలువు మండపంలో "సహస్ర దీపాలంకరణ సేవ" అనబడే "ఊంజల్‌సేవ" జరుపబడుతుంది.

శ్రీదేవి భూదేవులతో కూడిన మలయప్పస్వామి ఊరేగింపుగా వచ్చి సహస్రదీపాలు వెలిగించిన ఈ మండపములో ఊంజల్ సేవలో పాల్గొం టారు. ఆర్జిత రుసుం చెల్లించిన భక్తులు కూడా ఈ సేవలో పాల్గొనవచ్చు. ఆర్జిత భక్తులు లేకపోయినా ప్రతి సాయంత్రం విధిగా జరిగే సేవ ఇది. 'సహస్ర దీపాలం కరణ' సేవ అనంతరం మహాప్రదక్షిణ మార్గంలో శ్రీస్వామివారల ఊరేగింపు జరుగుతుంది.

కాని ప్రతినెలా రోహిణి నక్షత్రంనాడు రుక్మిణీశ్రీకృష్ణులకు, పునర్వసునాడు శ్రీసీతారామలక్ష్మణ స్వామివారలకు సహస్రదీపాలంకరణ సేవ జరుగుతుంది. ఆరుద్రనక్షత్రం రోజున శ్రీమలయప్ప స్వామితో పాటు ఎదురుగా మరొక పల్లకిపై శ్రీరామానుజుల వారి విగ్రహం ఊరేగింపబడుతుంది.

**2) యజ్ఞాధికారము (భృగుప్రోక్తం-పుట 557): కాల వ్యవధి పెరిగితే వచ్చే తీవ్రత**

కాలాతీతమైన ఉత్సవాల మధ్య వ్యవధి గనుక ఒక సంవత్సరం దాటిపోతే దోషతీవ్రత ఏ విధంగా పెరుగుతుందో ఈ శ్లోకాలు వివరిస్తున్నాయి:

కాలోత్సవే వ్యతీతే తు పూర్వోక్తం హోమమాచరేత్।
కలశైః పంచవింశద్భిః స్నాపయేద్దేవమవ్యయమ్ ।
మహాహవిః ప్రభూతం వా దేవేశాయ నివేదయేత్ ॥

ఉత్సవోక్త విధానేన పశ్చాదుత్సవమాచరేత్ ।
ఏకవర్షే వ్యతీతే తు పంచాగ్నిం స్థాపయేత్క్రమాత్ ॥

కాలోత్సవ నిర్ణీత కాలం దాటినప్పుడు 25 కలశాలతో స్వామివారికి స్నపన తిరుమంజనం జరిపించి, మహాహవిస్సును నివేదించాలి. ఒకవేళ ఉత్సవాల మధ్య వ్యవధి ఒక సంవత్సరం దాటిపోతే (ఏకవర్షే వ్యతీతే తు), దోష నివారణకు మామూలుగా చేసే శాంతి సరిపోదు; పంచాగ్నులను ప్రతిష్ఠించి వైష్ణవ, బ్రాహ్మ్య, రౌద్ర, విష్ణుసూక్త, పురుషసూక్త మంత్రాలతో సుదీర్ఘ ప్రాయశ్చిత్త హోమాలను నిర్వహించాల్సి ఉంటుంది.

**3. భృగు సంహిత (ప్రకీర్ణాధికారము - పుట 284):**

**కాలాతీత మహాదోషం & నిష్ఫలత్వం**

భృగుమహర్షి ప్రకీర్ణాధికారంలో కాలనియమం తప్పడం వల్ల కలిగే మహాదోషాన్ని, సంవత్సరాలు గడిచేకొద్దీ వచ్చే దోషాల గురించి మరింత హెచ్చరిస్తూ ఇలా చెప్పారు:

కాలోత్సవే మహాన్ దోషస్తత్ర కుర్యాత్తు నిష్కృతిమ్ ।
ఉత్సవాత్పూర్వముద్దిశ్య మహాశాంతిం త్ర్యహం చరేత్॥

విజ్ఞాప్య దేవదేవేశం తతః కాలోత్సవం చరేత్ ।
అన్యథా తు కృతం కార్యమకృతం స్యాదసంశయమ్ ॥

అన్యస్మిన్ వాపి మాసే తు న కుర్యాద్యది చోత్సవమ్ ।
ఏష ఏవ విధిః ప్రోక్తః పరస్మిన్వత్సరే కృతే ॥

నిర్ణీతకాలంలో జరుగవలసిన కాలోత్సవం నిర్వహించక పోవడం వల్ల మహాన్ దోషం (మహాదోషం) సంభవిస్తుంది. దానికి నిష్కృతిగా(పరిహారంగా) మూడురోజుల పాటు మహా శాంతి హోమం చేసి స్వామివారిని ప్రార్థించాలి. అలా చేయకుండా కాలం తప్పి (మరో మాసంలో లేదా తర్వాతి సంవత్సరంలో) నేరుగా ఉత్సవం జరిపితే, ఆ ఉత్సవ క్రతువంతా నిస్సంశయంగా నిష్ఫలమైపోతుంది (కృతం కార్యమకృతం స్యాద్).

తిరుమల అధికమాస బ్రహ్మోత్సవాలకు సంబంధించి వైఖానస ఆగమ సారాంశం ప్రకారం- ఒక కాలోత్సవానికి, తదుపరి కాలోత్సవానికి మధ్య కాలవ్యవధి ఎట్టి పరిస్థితుల్లోనూ ఒక సంవత్సరం (12 నెలలు) దాటకూడదు.

❖ ఇది పై శ్లోకాలలో పేర్కొన్న "ఏకవర్షే వ్యతీతే తు" (సంవత్సర కాల వ్యత్యయం) మరియు "అన్యస్మిన్ వాపి మాసే తు" అనే మహాదోషాల కిందకు వస్తుంది. దీనివల్ల దోషాలు కలగడమే కాక, ప్రాయశ్చిత్తం లేకుండా చేసే ఉత్సవం నిష్ఫలమవుతుంది.

❖ ఈ విధమైన పంచాగ్ని హోమాలు, మూడు లేదా ఏడు రోజుల మహాశాంతి ప్రాయశ్చిత్తాల చేసే అవసరం రాకుండా, అసలు దోషమే సంభవించకుండా వైఖానస పండితులు సముచితంగా ఆలోచించి సరైన పరిష్కారంగా రెండవ బ్రహ్మోత్సవాన్ని ఏర్పరిచి ఆగమదోషాలు సంభవించకుండా సమన్వయం చేశారు.

బ్రహ్మోత్సవాల మధ్య కాలవ్యవధి ఒక సంవత్సరం (12 నెలలు) దాటకుండా ఉండడం కోసం అధికమాసం వచ్చిన సంవత్సరంలో రెండు బ్రహ్మోత్సవాలను ఏర్పాటు చేశారు:

**1) మొదటిది (వార్షిక బ్రహ్మోత్సవం):**

చాంద్రమాన భాద్రపద మాసంలో నిర్వహిస్తారు. ఇది ధ్వజారోహణంతో కూడి ఉంటుంది.

**2) రెండవది (నవరాత్రి బ్రహ్మోత్సవం):**

ఆశ్వయుజ మాసంలో నిర్వహిస్తారు. దీనికి ధ్వజారోహణ, అవరోహణలు ఉండవు.

ఈ విధంగా అధికమాసంలో రెండు బ్రహ్మోత్సవాలు నిర్వహించడం వల్ల, ఒక ఉత్సవానికి మరియు మరో ఉత్సవానికి మధ్య ఉండే కాల సమతుల్యత దెబ్బతినదు. తద్వారా మరీచి మహర్షి, భృగుమహర్షి ఆగమ గ్రంథాలలో హెచ్చరించిన "కాలహీన దోషం" లేదా "వ్యతీత దోషం" శ్రీవారి ఆలయానికి సంభవించకుండా, కాలోత్సవ నియమం అక్షరాలా పటిష్టంగా రక్షించబడుతోంది.

శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల 10వ రోజున, **"బాగ్ సవారీ ఉత్సవం"** అనే ఒక విశిష్ట ఉత్సవం నిర్వహించబడుతుంది. దీనిలో ఉభయనాంచార్ల సమేతంగా శ్రీమలయప్ప స్వామివారు బంగారుపల్లకిపై నాలుగు మాడవీథుల్లో అప్రదక్షిణంగా– అంటే ఆలయ వాహనమండపం నుండి ఉత్తర మాఢావీథి వైపు ఆలయం చుట్టూతా ఊరేగుతారు.

ఏదైనప్పటికీ, ఈ పండుగ ప్రారంభం పల్లవుల కాలం నాటిదని మరియు గత అనేక శతాబ్దాలుగా శ్రీ వేంకటేశ్వరుడు బ్రహ్మోత్సవాలను ఆస్వాదిస్తున్నాడని చెప్పడం చాలా సమంజసంగా ఉంటుంది.

*'ఓం నమో వేంకటేశాయ'*

## ఏకాంతసేవ



**'ఏకాంతసేవ'నే 'పాన్పుసేవ', 'పవ్వ ళింపు సేవ' అనికూడ అంటారు. తిరుమల శ్రీవారి ఆలయంలో రోజు వారీ కార్యక్రమాల్లో ప్రధానమైన చివరి సేవ ఏకాంతసేవ. ఏకాంత సేవకు వేళ కాగానే సర్వదర్శనం నిలిపివేస్తారు.**

**శయనమండపంలో వెండి గొలుసు లతో వేలాడదీయబడిన బంగారు పట్టె మంచంపై భోగ శ్రీనివాసమూర్తిని వేంచేపు చేస్తారు.**

**రాములవారిమేడ నడవలో తాళ్ల పాక వంశీయులు ఒకరు జోలపాట లేదా లాలిపాట గానం చేయడానికి సిద్ధంగా ఉంటారు. అదే సమయంలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ వారి తరపున హారతి పళ్లెం వస్తుంది.**

**అన్నమయ్య వంశీయులు "జో అచ్యుతానంద జో జో ముకుందా...!" అని పాటపాడుతూ ఉండగా, తరిగొండ వెంగమాంబ ముత్యాల హారతి జరుగుతుంది.**

**దీని తర్వాత బంగారు వాకిళ్లు మూసి వేస్తారు.**

# తోమని పళ్లాల్లో వేంకటేశ్వరునికి విందు

– శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, 99856 70152

తిరుమల శ్రీనివాసుడు ఎంతటి అలంకారప్రియుడో అంతటి నైవేద్యప్రియుడు! ఎంతటి నైవేద్యప్రియుడో అంతటి భక్తప్రియుడు! అందుకే తాను ఏరి కోరి ఆరగించిన రుచికరములైన ప్రసాదాలన్నీ భక్తులు తింటేనే ఆయన కానందం! తాను తిన్నవన్నీ భక్తులు తింటేనే ఆయనకు ఒక తృప్తి! అసలు భక్తులకు తినిపించడానికే శ్రీవేంకటేశ్వరుడు మంచి మంచి కమ్మనైన పిండివంటల్ని, అన్నప్రసాదాల్ని ఆరగిస్తాడంట! ప్రపంచంలో ఈ స్వామిని మించిన నైవేద్యప్రియుడు, భోజనప్రియుడు మరొకడు కన్పడడు. అందుకే తాళ్లపాక అన్నమాచార్యులు ఒకచోట –

**ఇందిర వడ్డించ ఇంపుగను చిందక ఇట్లే భుజించవో స్వామి!**

అంటూ, 'అక్కాళ పాశాలు, అప్పాలు, వడలు, పేణులు, మిరియపు దాళింపులు, కూరలు, పిండివంటలు, పెరుగు, పాలు' ఇలా... స్వామివారి ఆరగింపును వర్ణిస్తాడు. మరోచోట కూడ...

**అరిసెలు నూనె బూరియలు నౌగులు జక్కెరమండెగల్ వడల్**
**బురుడలు, పాలమండెగ లపూపము లయ్యలమేలుమంగ నీ**
**కరుదుగ విందువెట్టు బరమాన్న శతంబుల సూపకోట్లతో**
**నిరత వినిర్మలాన్నముల నేతుల సోనల వేంకటేశ్వరా!**

– అంటూ పేర్కొన్నాడు అన్నమయ్య.

మరో అజ్ఞాతకవి (17వ శతాబ్దం) తిరుమల శ్రీవేంకటేశ్వరుని భోజన ప్రియత్వాన్ని చాటుతూ–

**పాలు వెన్న బకాళబాతు దధ్యోదనం- బువుళి యోరెము వెన్న బూరియలును**
**సరడాల పాశముల్, చక్కెర పులగముల్- నువ్వు మండిగలు, మనోహరములు**
**అప్పము లిడ్డెన లతిసారముల్ హోళిగల్- వడలు, దోసెలు గల వంటకములు**
**శాకముల్ సూపముల్ చారు లంబళ్లు- శుద్ధోదనములును, సద్యోఘృతమ్ము**
**పండ్లు తేనెలు హొబ్బట్లు పచ్చడులును.**

అని ఆనందనిలయుడు ఆరగింపు చేసే పదార్థాల్ని ఏకరువు పెట్టాడు. తిరుమల స్వామి ఎన్నెన్ని ఆరగిస్తాడో వాటిని ఏకరువు పెట్టలేక తెనాలి రామకృష్ణకవి ఘటికాచలమాహాత్మ్యం గ్రంథంలో **"తిండి మెండయ్య గారు"** అంటూ ఒక్కమాటలో తిరుమలేశునికి పెద్దబిరుదునే తగిలించినాడు.

## తోమని పళ్లాల్లో విందు

ఇలా ఇన్నివిధాలుగా, ఇందరిచేత పొగడబడిన తిరుమలస్వామి నిత్యమూ "తోమని పళ్లాల్లో" ఆరగిస్తాడు తెలుసా! తోమని పళ్లాల్లో ఆరగించే శ్రీవేంకటేశ్వరుని భోగం ఎంతటిదో! ఎంతెంతటిదో కదా! అని మురిసిపోతూ, ఆశ్చర్యపోతూ ఉన్నారు కదూ! వినండిమరి! ఆ స్వామి ఒకసారి ఆరగించిన పళ్లాన్ని తోమకుండా పారవేస్తారు.

### వారోత్సవాలు

**శ్రీవేంకటేశ్వర స్వామివారికి వారానికి ఒకమారు మాత్రమే తప్పని సరిగా జరిగే వారోత్సవాలు కొన్ని ఉన్నాయి. వాటి గురించి...**

### సోమవారం విశేషపూజ

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారికి ప్రతిసోమవారం ఉదయం 6 గంటలకు జరిగే ప్రధాన సేవ "విశేషపూజ". ఈ సేవ సంపంగి ప్రదక్షిణంలోని కల్యాణ మండపంలో శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామివారికి జరుగుతుంది.

ప్రతి సోమవారం జరిగే ఈ సేవ 1991 ఏప్రిల్ ఎనిమిదవతేదీన ప్రారంభింపబడి ఆర్జితసేవగా కూడ రూపు దిద్దుకుంది.

శ్రీవారి ఆలయంలో రెండవ అర్చన, రెండవ నైవేద్యం అయిన తర్వాత దేవేరులతో కూడిన శ్రీమలయప్ప స్వామివారు కల్యాణమండపానికి వేంచేస్తారు. వైఖానసాగమ శాస్త్రోక్తంగా హోమాలు నిర్వహించిన పిదప శ్రీస్వామివారలకు (స్నపన) తిరుమంజనం నిర్వహిస్తారు.



ఈ సేవలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు ఇస్తారు.

మళ్లీ భోజనానికి కొత్తపళ్లెం! మళ్లీ మళ్లీ... కొత్తపళ్లెం వినియోగిస్తారు **"తోమని పళ్లాలు"** అంటే ఏమిటో తెలుసుకోవాలని ఆసక్తిగా ఉన్నారు కదూ?.

ఆ **'తోమని పళ్లాలు'** అంటే! **మట్టికుండలు!** అది కూడా సగానికి పగిలిన మట్టికుండ! దాన్నే **'ఓడు'** అంటారు. అదే **ఓటికుండ!** భక్తప్రియుడైన శ్రీవేంకటేశ్వరుడు తాను పగిలిన మట్టిపెంకులో భోజనం చేస్తూ, భక్తులచేతమాత్రం విందారగింపచేస్తూ ఉన్నాడు. భక్తులే తనకు పరమార్థం! భక్తుల ఆనందమే తనకానందం! అంటూ మురిసిపోతూ చిరుమందస్మిత వదనంతో ప్రకాశిస్తూవున్న స్వామిని దర్శించడానికి...

*వేడుకొందామా వేంకటగిరి వేంకటేశ్వరుని*

*ఆమటి మ్రొక్కులవాడే ఆది దేవుడే వాడు*
*తోమనిపళ్లాలవాడె దురిత దూరుడే ॥ వేడు ॥*

భక్తులు పాడుకొంటూ నిత్యమూ తిరుమల యాత్ర చేస్తుంటారు.

**"తోమని పళ్లాలవాడని"** ప్రసిద్ధిపొందిన శ్రీస్వామివారికి తరతరాలుగా ఎందరో రాజులు, రారాజులు చక్రవర్తుల దగ్గరనుంచి, సామాన్య నిరుపేద భక్తులదాకా తమ తమ శక్తి కొద్దీ ఎన్నో నివేదనలు చేశారు. ఆరగింపులను చేయించారు. శ్రీవేంకటేశ్వరుడు



భక్తులు సమర్పించిన నివేదనల్ని అత్యంత ప్రియంగా ఆస్వాదించి వాటికి దివ్యత్వాన్ని ప్రసాదించి వాటిని మళ్లీ భక్తులకే వినియోగింపచేస్తూ ఉన్నాడు.

శ్రీస్వామివారు అత్యంత ప్రియంగా ఆరగించే ప్రసాదాలు అన్నీ శ్రీవారి ఆలయంలో పూర్వం వంటచెరకు (కట్టెలు)ను ఉపయోగించి కేవలం మట్టికుండలలో మాత్రమే వంట చేసేవారు. కాలక్రమేణ వాటి స్థానంలో ఇత్తడి గంగాళాలు చోటు చేసుకున్నాయి. ఇంకా ఇటీవలి కాలంలో విపరీతంగా పెరుగుతున్న లక్షలాది భక్తులసంఖ్య దృష్ట్యా ప్రస్తుతం 'గాస్'ను ఉపయోగిస్తూ శ్రీవారి పరిచారకులు (వంటవారు)శుచిగా శుభ్రంగా రుచికరంగా అత్యంత భక్తిశ్రద్ధలతో వంటలు తయారు చేసి సమర్పిస్తూ శ్రీస్వామి వారిచేత ముప్పూటలా సుష్టుగా ఆరగింపజేస్తూన్నారు.

## అన్నప్రసాదాలు - పిండివంటలు

ఆనందనిలయునికి ఆరగింపులు చేసే **మాత్రా, పులిహోర, చక్కర పొంగలి, కదంబం, దధ్యోదనం, పాయసం, సీరా,....** మున్నగు అన్నప్రసాదాలు అన్నీ విమాన ప్రదక్షిణంలోని పోటు (వంటశాల)లోను, **లడ్డులు, వడలు, అప్పాలు** ఆనందనిలయంలోని మూల



## మంగళవారం అష్టదళ పాదపద్మారాధన



ప్రతి మంగళవారం ఉదయం 6 గంటలకు రెండవ అర్చనగా బంగారంతో చేసిన 108 కమలాలతో మూలవిరాట్టునకు జరిగే అర్చనా కార్యక్రమమే "అష్టదళ పాదపద్మారాధన".

1984వ సంవత్సరంలో తిరుమల తిరుపతి దేవస్థానం స్వర్ణోత్సవ సందర్భంగా ప్రవేశపెట్టబడిన సేవ ఇది. శ్రీవేంకటేశ్వర స్వామిపై సేవాభక్తితో ఒక భక్తుడు ఇందుకు అవసరమైన 108 బంగారుపద్మాలను కానుకగా సమర్పించాడు. తర్వాత ఇది ఆర్జితసేవగా కూడ రూపు దిద్దుకొంది.

108 బంగారు కమలాలతో అష్టోత్తర శతనామాలతో అర్చన జరుగుతుండగా భక్తులు నయనానందకరంగా శ్రీస్వామివారి మూలమూర్తిని కనుల పండువుగా దర్శించవచ్చు.

## బుధవారం సహస్ర కలశాభిషేకం



**ప్రతి బుధవారం ఉదయం తిరుమలలో బంగారువాకిలి ముందు జరిగే ప్రధాన సేవ "సహస్ర కలశాభిషేకం".**

**భోగ శ్రీనివాస మూర్తితో పాటు, శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీమలయప్ప స్వామివారికి, సేనాధిపతి విష్వక్సేనుల వారికి ఈ సహస్రకలశాభిషేకం జరుగుతుంది.**

**1511 సం॥ నాటికి ముందు నుండి ఈ సహస్రకలశాభిషేకం జరుగుతున్నట్లు దాఖలాలున్నాయి.**

**బంగారువాకిలి ముందు జరిగే ఈ సహస్ర కలశాభిషేకంలో ఆర్జిత రుసుమును చెల్లించిన భక్తులు మాత్రమే పాల్గొని దర్శించవచ్చు.**

**వీరికి శ్రీవారి దర్శనంతోబాటు ప్రసాదాలు ఇస్తారు. ఈ దర్శనంతో సహస్ర విధాలుగా చుట్టుకొన్న పాపాలన్నీ పటాపంచలవుతాయి.**

విరాణ్మూర్తి అయిన శ్రీవేంకటేశ్వరస్వామి వారికి ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం, రాత్రి ఇలా మూడుపూటలా నివేదన జరుగుతుంది. ఈ మూడు పూటలా శ్రీవేంకటేశ్వరుని నివేదన జరగడానికి ముందే క్షేత్ర సంప్రదాయం ప్రకారం, **"తొలి పూజ– తొలి నివేదన– తొలి దర్శనం"** నియమానుసారం శ్రీవారి ఆలయం నుండి ఛత్రచామర బాజాభజంత్రీ సహితంగా **శ్రీవరాహస్వామివారికి** నివేదన పంపబడుతుంది.



అక్కడ శ్రీవరాహస్వామి ఆలయంలో నివేదన పూర్తి అయిన వెంటనే ఇక్కడ ఆనందనిలయంలో నివేదన జరుగుతుంది. ఆ తర్వాత ఆలయంలోని అష్టదిక్కుల్లో బలి సమర్పించడంతో నివేదన పూర్తవుతుంది. ఇలా మూడుపూటలా నివేదన జరుగుతుంది. ఆ తర్వాత శ్రీవారి ఆలయానికి ఎదురుగా, అంటే సన్నిధి వీథిలో ఉండే శ్రీ బేడి ఆంజనేయ స్వామివారికి కూడ శ్రీవారి నివేదనానంతరం నివేదన పంపబడుతుంది.

### "సుప్రభాతం - కొలువు" నివేదనలు

ప్రతిరోజూ తెల్లవారుజామున సుప్రభాతవేళలో తొట్టతొలుత శ్రీనివాసమూర్తికి **'వెన్న, పాలు, చక్కెర'** నివేదిస్తారు. ద్వాపరయుగంలో ఉదయం లేచిన వెంటనే యశోదా దేవి వెన్నముద్దలు తినిపించేదట! ఆనాటి అలవాటేమో మరి!

ఆ తర్వాత శ్రీశ్రీనివాసస్వామివారికి కొలువు (దర్బార్)జరుగుతుంది. బంగారు సింహాసనంపై ఛత్రచామర మర్యాదలతో మహాదర్పంగా వేంచేసి ఉన్న శ్రీవేంకటప్రభువులకు రాజోచిత మర్యాదలన్నీ సమర్పించిన తర్వాత ఆనాటి తిథివార నక్షత్రాది పంచాంగ శ్రవణం, శ్రీవారి ఆలయ ఆదాయవ్యయాలు విన్పించిన తర్వాత **నువ్వులపిండి (వేయించిన నువ్వులను బెల్లంతో కలిపి దంచిన పిండిని)** సమర్పిస్తారు. శనిదేవునకు ప్రీతికరంగా ప్రతిరోజూ శ్రీవేంకటేశ్వరస్వామివారు **"నువ్వులపిండిని"** ఆరగిస్తారు. అందులకే శ్రీనివాసుని కిష్టమైన శనివారవ్రతం ఆచరిస్తూ శ్రీనివాసుని సేవించినవారికి శనిగ్రహ దోషాలు తొలగుతాయి.

### ఉదయం నివేదన - మొదటిగంట

పిదప సహస్రనామార్చన జరుగుతుంది. ఆ తర్వాత మొదటిగంట అని పిలువబడే తొలినైవేద్యంలో శ్రీస్వామి వారికి ఎదురుగా పులిహోర, పొంగలి, దధ్యోదనం, చక్కెర పొంగలి మున్నగు అన్నప్రసాదాలూ, లడ్డు, వడలు, అప్పాలు వగైరా పిండివంటలూ కులశేఖరపడికి ఇవతలే ఉంచుతారు. ఇంతలో ప్రధాన వంటదారుడు **'ఓడు'** అని పిలువబడే పగిలిన మట్టికుండలో **'మాత్రా'** అనబడే మాత్ర దధ్యోదనాన్ని మాత్రం ఆనందనిలయంలోనికి తీసుకెళ్లి సమర్పిస్తాడు. చిక్కటి మీగడ పెరుగన్నం ఉన్న

‘ఓడు’ తప్ప మిగిలిన ప్రసాదాలన్నీ గడపకివతలే నివేదన చెయ్యబడతాయి. ఈ ఓటికుండలే ఏరోజుకారోజు కొత్తవిగా వస్తాయి. అవే **తోమని పళ్లాలు**. ఇలా మీగడ పెరుగన్నాన్ని అత్యంత ప్రియంగా ఆరగించే ద్వాపరయుగం నాటి అలవాటును ఈ కలి యుగంలోకూడా ఈ వేంకటాద్రి కృష్ణుడు ఇంకా మరవలేకున్నాడు మరి!

## మధ్యాహ్నం నివేదన - రెండవగంట

మధ్యాహ్నం “అష్టోత్తరశతనామార్చన” అయిన వెంటనే శ్రీస్వామివారికి రెండవ గంట అనబడే మధ్యాహ్నపు నైవేద్యానికి కూడ వంటలు సిద్ధంగానే ఉంటవి మరి!

పైన పేర్కొన్న అన్నప్రసాదాలతోపాటు, శుద్ధాన్నం, ఇంకా భక్తులు మొక్కులుగా సమర్పించే అన్నప్రసాదాలు, సీరా, పాయసం, కేసరీబాత్, క్షీరాన్నం, కదంబం, మున్నగు ప్రసాదాలను కూడ శ్రీవేంకటేశ్వరుడు ప్రియంగా ఆరగించి భక్తులను ఆనందింపచేస్తూ ఉన్నాడు.

రెండవగంట అయినవెంటనే శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీమలయప్ప స్వామి (ఉత్సవశ్రీనివాసమూర్తి) భక్తులకు కన్నులపండువు చేయడానికి నిత్యకల్యాణోత్సవానికై కల్యాణమండపానికి వేంచేస్తారు. కల్యాణానంతరం శ్రీవారికి లడ్డు, వడలు, అప్పాలు, దోసెలతోపాటు చక్కెరపొంగలి, పులిహోర, పొంగలి, దధ్యోదనం మున్నగు అన్న ప్రసాదాలు నివేదింపబడతవి.

ఆలయంబయట ఉన్న వైభవోత్సవ మండపంలో జరిగే ఆర్జిత బ్రహ్మోత్సవం లోనూ, ఆ వెంటనే అద్దాల మండపంలో జరిగే ‘డోలోత్సవం’లోనూ, సాయంత్రం జరిగే ‘సహస్రదీపాలంకారసేవ’లోనూ శ్రీస్వామివారికి **‘పంచ కజ్జాయం’** అనే ప్రసాదం నివేదింపబడుతుంది. **చక్కెర, గసగసాలు, కలకండముక్కలు, ఎండుద్రాక్ష, జీడిపప్పు, బాదంపప్పు పలుకులు, ఎండుకొబ్బరికోరు** అన్నీ కలిపి తయారు చేసిన పొడిలాంటి ప్రసాదమే ఈ **‘పంచకజ్జాయం’** దీన్ని కూడ వంటశాల పరిచారకులే సిద్ధం చేసి సమర్పిస్తారు. ఆ తర్వాత శ్రీమలయప్పస్వామి కొందరి ఆర్జితసేవా భక్తుల కోరిక మేరకు వసంతోత్సవంలో పాల్గొని కనువిందు చేస్తారు. ఆ వసంతోత్సవంలో కూడా శ్రీస్వామి వారు దోసెలు అన్న ప్రసాదాలను ఆరగించుతాడు.

## రాత్రి నివేదనలు - మూడవగంట

ఇక సాయంత్రం సంధ్యాసమయంలో శ్రీవేంకటేశ్వర స్వామివారికి తోమాలసేవ అనే పుష్పాలంకరణ సేవ ఏకాంతంగా జరుగుతుంది. వెంటనే **తోమాలదోసెపడి** అనే పెద్ద పెద్ద **నెయ్యి దోసెలు, మొళహోర, కదంబం** మున్నగు అన్నప్రసాదాలు నివే దింపబడతవి. పిదప




## గురువారం తిరుప్పావడ సేవ



ప్రతి గురువారం శ్రీ వేంకటేశ్వర స్వామివారికి రెండవ అర్చనానంతరం జరిగే నివేదనే “తిరుప్పావడ సేవ” అనీ “అన్నకూటోత్సవ” మనీ అంటారు.

గురువారం ఉదయం 6 గంటలకు శ్రీస్వామివారి మూల విరాట్టుకు ఉన్న ఆభరణాలను అన్నిటినీ తీసివేస్తారు. పిదప నొసటి మీద ఉన్న నామాన్ని కూడా బాగా తగ్గించి నేత్రాలు స్పష్టంగా కనపడే టట్లు చేస్తారు. పిదప శ్రీస్వామి వారికి ఎదురుగా బంగారు వాకిలి ముందర పెద్దశిఖరంలాగా పులిహోర రాశిని ఏర్పాటు చేస్తారు. పులిహోరతో పాటు జిలేబీలను, మురుకులను చక్కగా అమర్చి పూలతో అలంకరిస్తారు. పిదప ఈ పులిహోర రాశిని నేరుగా గర్భాలయం లోని స్వామివారికి నివేదిస్తారు.

ఈ సేవలో ఆర్జితం చెల్లించిన భక్తులు మాత్రమే పాల్గొనవచ్చు. ఈ సేవలో వేదపండితులు వేద పారాయణంతో పాటు శ్రీనివాసగద్యంను పఠిస్తారు. తర్వాత భక్తులందరికీ తిరు ప్పావడ సేవతోపాటు శ్రీవారి నేత్ర దర్శనం పొందే అవకాశం కలుగు తుంది. ఈ సేవ చేయించినవారికి, వారు చేసిన అన్నగత దోషాలు తొలగ డమే గాక, వారికి వంశపారంపర్యంగా అన్న సమృద్ధి కలుగుతుంది.

## పూలంగి సేవ



ప్రతి గురువారం సాయంత్రం శ్రీవారికి జరిగే తోమాలసేవను "పూలంగి సేవ" అంటారు.

అయితే ఈ సేవ మాత్రం పూర్తిగా ఏకాంతంగా జరుగుతుంది. జియ్యంగారులు అందించే పూలమాలలతో అర్చకులు శ్రీవారి విగ్రహమూర్తిని ఆపాద మస్తకం అలంకరిస్తారు. శ్రీస్వామి వారు పూల అంగీని తొడిగినట్లుగా ఉంటారు.

పూలంగిసేవ అలంకరణ అయిన తర్వాత ప్రతి గురువారం రాత్రి యాత్రికులు పూలంగి అలంకరణలో ఉన్న శ్రీవేంకటేశ్వర స్వామివారిని నయనానందంగా దర్శించి పులకించిపోతారు.

సువాసనలు వెదజల్లే పూలంగి సేవలో ఉన్న స్వామి వారిని దర్శించినట్లైతే అనేక జన్మల్లో చేసిన పాపాలు, ఆజన్మాంతర వాసనలన్నీ ఇట్టే నశిస్తాయి.

శ్రీస్వామివారికి మూడవ అర్చనగా 'అష్టోత్తర శతనామార్చన' జరిగిన తర్వాత 'మూడవగంట' అనబడే రాత్రి నైవేద్యం జరుగుతుంది. ఈ గంటలో కూడ **చక్కెరపొంగలి, పొంగళ్లు, మొళహోర, కదంబం** మున్నగు ప్రసాదాలను శ్రీనివాసుడు ఆరగిస్తాడు. ఇలా మూడుగంటలు అనబడే మూడుపూటలా నివేదనలే కాక చివరగా రాత్రి పూట **'తిరువీసం'** గంట అనే ప్రత్యేక నివేదనతో శ్రీనివాసునికి చక్కెరపొంగలి మాత్రం సమర్పిస్తారు.

### ఏకాంతసేవలో 'మేవా'

పిదప రాత్రి ఏకాంతసేవలో శ్రీవేంకటేశ్వరునికి బాగా కాచి చల్లార్చిన గోరువెచ్చని చక్కెర కలిపిన పాలు, పండ్లు, పంచకజ్జాయంతోపాటు **'మేవా'** అనబడే పంచామృతంలాంటి ప్రసాదం నివేదింపబడుతుంది.

### ఆ యా వారాల్లో ప్రత్యేక నివేదనలు

ఇలా ప్రతిరోజు ఇవేకాకుండా, ప్రతిసోమవారం ఉదయం శ్రీమలయప్ప స్వామివారికి జరిగే **'విశేషపూజ'**లో కూడ పెద్ద వడలు, లడ్లు, అన్నప్రసాదాలు నివేదన చేస్తారు. ప్రతి బుధవారం ఉదయం బంగారువాకిలి వద్ద జరిగే **'సహస్రకలశాభిషేకం'**లో ప్రత్యేకంగా క్షీరాన్నంతోపాటు మిగిలిన అన్నప్రసాదాలు నివేదింపడతాయి.



ఇక ప్రతి గురువారం జరిగే **'తిరుప్పావడ'** అనే సేవలో సుమారు 420 కిలోల బియ్యంతో తయారు చేసిన **'పులిహోర'**ను శ్రీస్వామి వారి మూలమూర్తికి ఎదురుగా బంగారువాకిలి ముందర పెద్ద రాశిగా అమర్చి నేరుగా నివేదిస్తారు.

దీనితోపాటు ప్రత్యేకంగా **చాటంత పెద్ద జిలేబీలు, చాటంత పెద్ద మురుకులు** (తేనెతొల) కూడ **'తిరుప్పావడ'** సమయంలో శ్రీవారు ఆరగిస్తారు.

ఇక శుక్రవారంనాడు శ్రీనివాసునికి **'పోళీలు లేదా హోళిగలు'** అనే పూర్ణంభక్ష్యాలను, **'సుఖియలు'** అనే **ఉండ్రాళ్లను** నివేదించుతూ ఉన్నారు. ఇక ప్రతి ఆదివారం నాడు **'ఆదివారం ప్రసాదం'** అనబడే **'చలిపిండి'** ప్రసాదాన్ని ప్రత్యేకంగా నివేదిస్తారు. ఈ చలిపిండినే **'అమృత కలశం'** అంటారు. పిదప ఈ అమృత కలశ ప్రసాదాన్ని గరుడాళ్వారుకు నివేదిస్తారు.

ఇవిగాక ఏకాదశి, వైకుంఠఏకాదశి మున్నగుపర్వదినాల్లో శ్రీస్వామివారు దోసెలు, శనగపప్పుతో తయారు చేసిన శుండలి(గుగ్గుళ్లు)ని ఆరగిస్తారు. ఇంతేగాక శ్రీవారికి పెసరపప్పు పణ్యారం, పానకాన్ని కూడ నివేదిస్తారు. ఇక నెలరోజులపాటు

జరిగే ధనుర్మాసవ్రత సమయంలో అన్నప్రసాదాలతోపాటు ప్రత్యేకంగా 'బెల్లపుదోసె'ను ప్రియంగా ఆరగిస్తాడు ఆనందనిలయుడు.

## విశేషదినాల్లో విశేష వంటకాలు

ఇవిగాక కొన్ని విశేషపర్వదినాల్లో శ్రీవేంకటేశ్వరస్వామి **పాయసాలను, కేసరీ బాత్, శాకరీబాత్, బకాళాబాత్, మనోహరం** అనబడే విశేషవంటకాల్ని కూడ సుష్టుగా భోంచేస్తారు.

ఇంతేగాక, ఉగాది ఆస్థానం, ఆణివారఆస్థానం, దీపావళి ఆస్థానం... వంటి ఆస్థానాలలోను, బ్రహ్మోత్సవ సమయంలో జరిగే ఉత్సవాల్లో, ఊరేగింపుల్లోనూ, ఇంకా, పారువేట ఉత్సవాల్లోనూ, శ్రీస్వామివారికి విశేషంగా నివేదనలు సమర్పింపబడతాయి.

ఇలా ఎన్నో ఎన్నెన్నో ప్రసాదాలను, అన్ని వేళలా అప్రమత్తంగా వేళ మించకుండా, శ్రీవారి ఆకలిని గమనిస్తూ సరి అయిన వేళల్లో సమర్పించేందుకై అహరహం శ్రీవారి పాచకులు ఈ వంటశాలలో వంటలతయారీలో నిమగ్నులై ఉంటారు. శ్రీనివాసునికి ఏవేళ ఏ ఉత్సవం జరుగుతుందో, అప్పుడు ఆ వేళ అవసరమయ్యే ప్రసాదాన్ని రుచికరంగా వండి వడ్డిస్తూ ఉంటారు శ్రీవారి పరిచారక, అర్చక స్వాములు. తిరుమల శ్రీవారు ఆరగించే ప్రసాదాలన్నీ ఈ ప్రధాన వంటశాలలోనే తయారు చెయ్యబడతాయి.




ప్రపంచంలో ఎక్కడా కూడా ఇంత పెద్ద ఎత్తున నివేదనలు జరగనే జరుగవు. అదీ అన్ని వంటలుకూడా నెయ్యితోనే తయారు చెయ్యబడతవి. శ్రీవారి వంటశాలలో కాగి కాగి చివరకు మిగిలిన ఒకనాటి నెయ్యిగసి (జిడ్డు) ఇతర ఆలయాలలో ఒక సంవత్సరానికి ఉపయోగించవచ్చునని ప్రసిద్ధి. అందుకే, అన్నమయ్య, తిరుమలను సందర్శించినపుడు..

*దండడి నవ్వేల్పు తళిఘల క్రింద- జిందఁగా జేత నూర్చిన నంటివచ్చు-*
*నొకనాటి నెయ్యి వేరొక దేవళమున- నొకయేటనైనను నున్నదే యనుచు*

అని ఆశ్చర్యపడినాడట!

ఇలా **'తిండిమెండయ్యగారు', 'నైవేద్యప్రియుడు', 'తోమని పళ్లాలవాడు'** అయిన తిరుమలేశుడు తనకు ఎన్ని పిండివంటలు సమర్పించినా, ఎన్నిరకాల పాయసాలు నివేదించినా వాటిని మళ్లీ భక్తులకే సమర్పిస్తూ వారినందరినీ పునీతులను చేస్తూ, సంతృప్తిపరుస్తూ తద్వారా భక్తులకు పుష్టినీ తుష్టినీ, సంతుష్టినీ చేకూరుస్తున్న ఆనందనిలయునకు రెండు చేతులెత్తి దండాలు పెడదాం.

*ఏడుకొండలవాడా! వేంకటరమణా!! గోవిందా! గోవిందా!! గోవింద!!!*

## శుక్రవారాభిషేకం




**శ్రీవేంకటేశ్వరస్వామి వారి మూలమూర్తికి ప్రతి శుక్రవారం తెల్లవారు జామున 5 గంటలకు జరిగే అభిషేకమే శుక్రవారాభిషేకం. ప్రతి శుక్రవారం విశేష ఉత్సవంగా జరుపబడే ఈ అభిషేకం 614 సం॥ నుండే జరిగేదని తెలుస్తున్నది.**

**విశేషసందర్భాల్లో జరిగే ఈ శుక్రవారాభిషేకాన్ని, భగవద్రామానుజుల వారు శ్రీస్వామివారి వక్షఃస్థలంలో "బంగారు అలమేలుమంగ" ప్రతిమను అలంకరింపజేసిన శుక్రవారం మొదలుగా ఆనాటినుండి ప్రతి శుక్రవారంనాడు అభిషేకం జరిగేట్లు ఏర్పాటుచేశారట.**

**పునుగు, కస్తూరి, జవ్వాది మున్నగు సుగంధ పరిమళద్రవ్యాలతో ఆకాశగంగా తీర్థంతో సుమారు ఒక గంటపాటు అభిషేకం జరుగుతుంది. ఆ తర్వాత పసుపుతో శ్రీవారి వక్షఃస్థలమ్మీద మహాలక్ష్మికి కూడ అభిషేకం జరుగుతుంది.**

**ఎప్పుడో ఏనాడో బ్రహ్మాది దేవతల కోరికమేరకు కలియుగ మానవుల కోసం వెలసిన శ్రీనివాసుని యథాతథమైన రూపాన్ని వక్షఃస్థల లక్ష్మితో కూడ ఈ శుక్రవారాభిషేక సమయంలో మాత్రమే దర్శించ వీలవుతుంది.**

**అభిషేకం అయిన తర్వాత శ్రీస్వామివారిమెడలో ఉన్న బంగారు అలమేలుమంగకు కూడ అభిషేకం జరుగుతుంది.**

**అభిషేకానంతరం భక్తులందరి మీదా అభిషేకతీర్థాన్ని సంప్రోక్షించడంతో అభిషేకదర్శనం ముగుస్తుంది. శ్రీవారి శుక్రవారాభిషేక దర్శనంతో భక్తుల పాపాలన్నీ కడిగివేసినట్లుగా శుభ్రంగా తొలగడమేగాక, ఆరోగ్యం, ఐశ్వర్య, సంపదలు సమృద్ధిగా కలుగుతాయి.**

# తిరుమోగూర్

108 దివ్యదేశాలు

- ఆచార్య చక్రవర్తి రంగనాథన్, 94409 19186

ప్రకృతి అందాలతో అలరారే, తామరపూలతో నిండిన అందమైన వరిపొలాల మధ్య, తమిళనాడులోని మదురై మహానగరానికి ఈశాన్యంగా సుమారు 12 కి.మీ దూరంలో ఈ క్షేత్రం ఉంది. 'యానైమలై ఒత్తక్కడై' అనే చిన్న పట్టణం నుండి తూర్పున 2 కి.మీ. దూరంలో ఈ **'తిరుమోగూర్'** దివ్యదేశం కొలువై ఉంది.

**ఆలయ నిర్మాణం-** 2.55 ఎకరాల విస్తీర్ణంలో, చుట్టూ ఒకే రక్షణ ప్రాకార గోడ కలిగి ఉంది. ఐదు అంతస్తుల రాజగోపురం మరియు విశాలమైన నాలుగు ప్రాకారాలతో ఈ ఆలయం నిర్మితమైంది. ఇక్కడ శ్రీకృష్ణుడు, ఆండాళ్, ఆంజనేయుడు, పన్నెండు మంది ఆళ్వారులు, చక్రత్తాళ్వార్ మరియు రామానుజాచార్యుల ప్రత్యేక సన్నిధులు (ఉపాలయాలు) కలిగి ఉన్న అత్యంత సుందరమైన దివ్యదేశంగా తిరుమోగూర్ విరాజిల్లుతోంది.

**స్థలపురాణం-** మోహినీ అవతారం: క్షీరసాగరమథనం సమయంలో దేవతలకు అమృతాన్ని పంచడంకోసం పరమాత్ముడు అత్యంత సౌందర్యవతియైన "మోహిని" రూపంలో అవతరించాడు. ఆ సమయంలో సూర్యచంద్రుల మధ్య దేవతల రూపంలో ఇద్దరు అసురులు (రాక్షసులు) ప్రవేశించి అమృతాన్ని తాగాలని ప్రయత్నించారు. ఆ తర్వాత జరిగిన కథతోనే ఈ దివ్యదేశ స్థలపురాణం ముడిపడి ఉంది. భగవంతుడు మోహినీ అవతారం దాల్చి దేవతలకొరకు అమృతాన్ని ప్రసాదించిన స్థలం కావున దీనికి మోహనక్షేత్రం, మోహనియూర్, మోహియూర్ అనే పేర్లు వచ్చాయి. కాలక్రమేణా ఇది **'తిరుమోగూర్'**గా రూపాంతరం చెందింది.

**శ్రీక్షీరాబ్ధినాథుడు -** క్షీరసాగరవిశేషాలను చాటిచెప్పే విధంగా, ఆదిశేషునిపై శయనించిన పడగలతో కూడిన అనంతశయన మూర్తి ఇక్కడ కొలువై ఉన్నాడు. ఈ స్వామిని **"వళిత్తుణై పెరుమాళ్"** (మార్గబంధు పెరుమాళ్) లేదా "క్షీరాబ్ధినాథుడు" అని పిలుస్తారు. క్షీరసాగరం నుండి అమృతాన్ని వెలికితీయడానికి సహాయపడిన లీలలను వ్యక్తపరిచే విధంగా ఈ స్వామి కొలువై ఉండగా, శ్రీదేవి మరియు భూదేవి అమ్మవార్లు పరమాత్ముని పాదాలను తాకకుండా, చేతులు జోడించి నమస్కరిస్తున్న స్థితిలో ఇక్కడ దర్శనమిస్తారు.

ఈ వళిత్తుణై పెరుమాళ్, భగవంతుని మోహినీ అవతారానికి ముందే, క్షీరసాగర మథన సమయంలో మందరపర్వతం కిందికి మునిగిపోకుండా ఉండటానికి తన వీపుపై

| | | |
|---|---|---|
| **భగవానుడు** | : | **కాలమేఘశ్యామలన్** |
| **అమ్మవారు** | : | **మోహనవల్లీ** |
| **స్థలతీర్థం** | : | **క్షీరాబ్ధి పుష్కరిణి** |
| **విమానం** | : | **కేదక విమానం** |
| **ప్రత్యక్షం** | : | **పులస్త్య ముని** |
| **ముఖము/స్థితి** | : | **పూర్వ అభిముఖం, నిల్చున్న భంగిమ** |
| **మంగళాశాసనం** | : | **తిరుమంగై ఆళ్వార్, నమ్మాళ్వార్** |
| **ఆగమం** | : | **పాంచరాత్ర ఆగమం** |

## పక్షోత్సవాలు



**తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ప్రతి పక్షం (శుక్ల పక్షం, కృష్ణపక్షం)లో వచ్చే ఏకాదశి రోజున పక్షోత్సవం నిర్వహిస్తారు. సంవత్సరానికి మొత్తం 24 పక్షోత్సవాలు (అధిక మాసం వస్తే 26 వరకు) జరుగుతుంది.**

**ఈ ఉత్సవంలో ప్రధానంగా ఉత్సవ మూర్తి శ్రీమలయప్పస్వామి వారు శ్రీదేవి, భూదేవి సమేతంగా తిరుమాడ వీధుల్లో భక్తులకు దర్శన మిస్తారు.**

**పక్షోత్సవ విశిష్టత**

**ప్రతి పక్షంలో ఒకసారి నిర్వహించే నియమిత ఉత్సవం.**

**శ్రీమలయప్పస్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతంగా తిరుమాడ వీధుల్లో విహరిస్తారు.**

**బ్రహ్మోత్సవంవంటి మహోత్సవాల వైభవాన్ని భక్తులు తరచుగా అనుభవించేలా ఈ ఉత్సవాన్ని ఏర్పాటు చేశారు.**

**ఏకాదశి తిథి మహిమతో పాటు స్వామివారి ఊరేగింపు దర్శనం భక్తులకు విశేష పుణ్యప్రదంగా భావించబడుతుంది.**

మోసిన మహాకూర్మ(తాబేలు) అవతార రూపమే అని స్థలపురాణం చెబుతోంది. దేవతలు, అసురులు పర్వతాన్ని కవ్వంగా చేసి చిలుకుతున్నప్పుడు అది పడిపోకుండా ఆధారం ఇచ్చారు.

**ప్రాధాన్యత-**అందువల్ల ఇక్కడ శయనించి ఉన్న రంగనాథుడు (వళిత్తుణై పెరుమాళ్) ఈ క్షేత్ర ప్రధాన దైవమైన "కాలమేఘ పెరుమాళ్" కంటే ముందటి వాడు. నమ్మాళ్వార్ పరమపదానికి వెళ్లే సమయంలో ఈ స్వామి తోడుగా (వళిత్తుణైగా) నిలిచారు. నేటికీ మన జీవితమార్గంలో తోడుగా నిలిచే "క్షేత్రాధిపతి"గా ఈయన్నే స్థలపురాణం కీర్తిస్తోంది. ఇలాంటి స్వామికి ప్రథమ సేవకుడిగా ఉంటూ, ఆయన్ను మోసే కైంకర్యమే పరమ భాగ్యంగా భావించే ఆదిశేషుడు ఇక్కడ సువర్ణ కవచం (బంగారు కవచం) ధరించి ప్రకాశిస్తున్నాడు.

**మూలవర్ మరియు ఉత్సవర్-**ఇక్కడి మూలవిరాట్ అయిన "కాలమేఘ పెరుమాళ్" నిలుచున్న భంగిమలో *(నిన్ర తిరుక్కోలం)*, కుడిచేతిలో వరద ముద్రను, ఎడమచేతిలో గదను ధరించి భక్తులను అనుగ్రహిస్తున్నారు. ఉత్సవమూర్తికి "తిరుమోగూర్ ఆప్తన్" అనే తిరునామం ఉంది. ఆయన పంచాయుధాలను ధరించి దర్శనమిస్తారు.

**అమ్మవార్ల విశేషం-**ఇక్కడి అమ్మవార్లు మోహనవల్లి, మేఘవల్లి అనే పేర్లతో ప్రత్యేక సన్నిధిలో కొలువై ఉన్నారు. ఆమె *"పడి తాండాద పత్ని"* (గడప దాటని ఇల్లాలు)గా కూర్చున్న భంగిమలో అనుగ్రహిస్తున్నారు. ఈమెకు విడిగా ఎటువంటి ఉత్సవాలు జరగవు. ఇందువల్లనే ఫాల్గుణఉత్తర (పంగుని ఉత్తరం) పర్వదినాన భగవంతుడే స్వయంగా అమ్మవారి సన్నిధికి విచ్చేసి, జగత్కల్యాణ కారకమైన తిరుకల్యాణ ఉత్సవాన్ని జరిపించుకుంటాడు. స్వామి వీధి ఉత్సవాలకు వెళ్లే సమయంలో ఆండాళ్ అమ్మవారు స్వామితో కలిసి విచ్చేస్తారు.

ఉత్సవమూర్తియైన తిరుమోగూర్ ఆప్తన్ పెరుమాళ్‌కు "వళిత్తుణై పెరుమాళ్" అనే పేరు కూడా ఉంది. నమ్మాళ్వార్ పరమపదం చేరడానికి ఈ స్వామి మార్గదర్శనం చేసినందున, నమ్మాళ్వార్ ఈ స్వామిని కీర్తిస్తూ *"వాయ్త్త తణ్ పనై వళవయల్ శూళ్ తిరుమోగూర్ ఆత్తన్"* అని మంగళాశాసనం (పాశురకీర్తన) చేశారు.

**శ్రీచక్రత్తాళ్వార్ (సుదర్శన చక్రం)-** ఇక్కడ అమ్మవారి సన్నిధికి వెనుక భాగంలో బీజాక్షరాలతో కూడిన, వెనుక వైపు నరసింహస్వామి కలిగిన వరప్రసాదియైన "శ్రీచక్రత్తాళ్వార్" సన్నిధి ఉంది. ఈ చక్రత్తాళ్వార్‌ను పూజిస్తే సమస్తవ్యాధులు, కష్టాలు, ఇబ్బందులు తొలగిపోతాయని భక్తుల దృఢమైన నమ్మకం.



**ఉత్సవాలు-** ఇక్కడి అధ్యయన ఉత్సవాలు మరియు మిగిలిన అన్ని ప్రధాన ఉత్సవాలు క్షేత్రాధిపతియైన

## మాసోత్సవాలు (నక్షత్రోత్సవాలు)



**తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రతి నెలా ఆ యా నక్షత్ర దినాల్లో విశేషంగా కొన్ని ఉత్సవాలు జరుగుతున్నాయి. ఇవి నెలకు ఒక్కమారే వస్తాయి కనుక వీటిని మాసోత్సవాలని కూడా అంటారు.**

**తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ప్రతి నెలా నియమితంగా జరిగే ఉత్సవాలను మాసోత్సవాలు అంటారు. ఇవి స్వామివారి ఆరాధనలో విశిష్ట స్థానం కలిగిన సేవలు.**

**మాసోత్సవాల ప్రాముఖ్యం**

**ప్రతి నెల భక్తులకు స్వామివారి విశేష దర్శన భాగ్యం కలుగుతుంది.**

**ఆలయ పవిత్రత, ఆగమసంప్రదాయం పరిరక్షించబడుతుంది.**

**భక్తుల ఐశ్వర్యం, ఆరోగ్యం, ఆధ్యాత్మిక శ్రేయస్సు కోసం ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు.**

రంగనాథుని సన్నిధిలోనే నిర్వహిస్తారు. కాలమేఘ పెరుమాళ్ బ్రహ్మోత్సవాలు వైశాఖమాసంలో శ్రవణానక్షత్రం తీర్థవారితో కూడి 10 రోజులపాటు అత్యంత వైభవంగా ప్రతి సంవత్సరం జరుగుతుంది.

**విమానం మరియు తీర్థాలు-** ఇక్కడి ప్రధాన గోపుర విమానాన్ని "చతుర్ముఖ విమానం" అంటారు. ఇక్కడి ప్రధాన పుష్కరిణిని "తీర్థం- క్షీరాబ్ధి పుష్కరిణి" అంటారు. క్షీరసాగరాన్ని చిలికినప్పుడు ఉద్భవించిన అమృతం యొక్క ఒక చుక్క ఇక్కడ పడటం వల్ల ఈ పుష్కరిణి ఏర్పడిందని నమ్ముతారు. అంతేకాకుండా, మధుకైటభులనే రాక్షసులను సంహరించి వేదాలను రక్షించినందుకు కృతజ్ఞతగా బ్రహ్మదేవుడు ఇక్కడ ఒక తీర్థాన్ని నిర్మించి, కఠోర తపస్సు ఆచరించి విష్ణుమూర్తి అనుగ్రహాన్ని పొందాడట. బ్రహ్మదేవుడు ఏర్పరచిన తీర్థం కావున దీనికి "బ్రహ్మతీర్థం" అనే మరోపేరు కూడా ఉందని స్థలపురాణంలో ఉంది.

క్షీరసాగరమథన సమయంలో భగవంతుడు దాల్చిన ఆ మోహినీ రూపాన్ని చూడాలని ద్వాపరయుగంలో పులస్త్య మహర్షి తీవ్రమైన కాంక్షతో కఠోర తపస్సు ఆచరించాడు. ముని తపస్సుకు మెచ్చిన పరమాత్ముడు మోహినీ రూపంలో ఆయనకు ప్రత్యక్షమై అనుగ్రహించాడు. అంతటితో ఆగక పులస్త్యుడికి "విల్వరూపుడు" అనే వారసుడు జన్మించేలా వరాన్ని కూడా ప్రసాదించాడని స్థలపురాణం చెబుతోంది.

**నామసార్థకత-** ఆనాడు మొదలుకొని నేటి వరకు ఈ తిరుమోగూర్‌లో భక్తులను సేవించేందుకు, మనసును దోచుకునే ఆ మోహన రూపాన్ని ధరించి, క్షీరసాగర మథనంలో వ్యక్తమైన అమృతాన్ని దేవతలకు పంచి ఇక్కడే కొలువై భక్తులను అనుగ్రహిస్తున్నాడు. అందువల్లనే ఈ స్వామి నామంతో ఈ ఊరికి "తిరుమోగూర్" అనే పేరు రావడం విశేషం.

**ఆళ్వారుల కీర్తన -**

ఈ క్షేత్రాన్ని నమ్మాళ్వార్ మరియు తిరుమంగై ఆళ్వార్ మంగళా శాసనం చేశారు. ఇక్కడి విమానాన్ని 'చతుర్ముఖ విమానం' అని కూడా అంటారు.



భక్తులందరూ ఈ క్షేత్రానికి విచ్చేసి స్వామిని దర్శించుకొని అలాగే చక్రత్తాళ్వార్‌ను విశేషంగా నమస్కరించి సకలవ్యాధి బారి నుండి విముక్తులై సకలవిధమంగళములను పొంది తరించగలరు.

**ధ్యాన శ్లోకం:**

మోహూరాఖ్యే పురే రమాపతిరయం శ్రీకాలమేఘాహ్వయః
దేవీ మేఘలతా విమానమపి వై తత్ కేతకం నామతః
తీర్థం క్షీరపయోనిధిః శ్రితజనానందావహః సర్వదా
భాస్వద్భాస్కరదిఙ్ముఖః సురగణాభీష్టప్రదో భాసతే ॥

## రోహిణీ నక్షత్రోత్సవం



ప్రతినెలా శ్రీకృష్ణుని జన్మ నక్షత్రమైన రోహిణి నాటి ఉదయం సుప్రభాతానంతరం భోగ శ్రీనివాస మూర్తితో పాటు రుక్మిణీ శ్రీకృష్ణులకు అభిషేకం జరుగుతుంది.

ఆ సాయంత్రం రుక్మిణీ సమేతంగా శ్రీకృష్ణస్వామి ఆలయం వెలుపలికి వచ్చి కొలువు మండపంలో జరిగే సహస్ర దీపాలంకరణ సేవలో పాల్గొంటారు. పిదప మహాప్రదక్షిణ మార్గంలో రుక్మిణీ శ్రీకృష్ణులకు ఊరేగింపు జరిగిన తర్వాత ఆలయంలో ప్రవేశిస్తారు. ఈ సేవను దర్శించిన వారందరికి అనగా 27 నక్షత్రాలవారికి నక్షత్రశాంతితోపాటు ముఖ్యంగా రోహిణి నక్షత్రశాంతి విశేషంగా జరుగుతుంది.


పెద్దశేషవాహనం
15-09-2026
(రాత్రి)
చిన్నశేషవాహనం
16-09-2026
(పగలు)
హంసవాహనం
16-09-2026
(రాత్రి)
సింహవాహనం
17-09-2026
(పగలు)



**ముత్యపుపందిరివాహనం**
17-09-2026
(రాత్రి)



**కల్పవృక్షవాహనం**
18-09-2026
(పగలు)



**సర్వభూపాలవాహనం**
18-09-2026
(రాత్రి)



**పల్లకిలో మోహినీ అవతారోత్సవం**
19-09-2026
(పగలు)



**గరుడవాహనం**
19-09-2026
(రాత్రి)



**హనుమద్వాహనం**
20-09-2026
(పగలు)



**స్వర్ణరథరంగ డోలోత్సవం**
20-09-2026
(సాయంత్రం)



**గజవాహనం**
20-09-2026
(రాత్రి)


సూర్యప్రభవాహనం
21-09-2026
(పగలు)
చంద్రప్రభవాహనం
21-09-2026
(రాత్రి)
అశ్వవాహనం
22-09-2026
(రాత్రి)
చక్రస్నానం
23-09-2026
(పగలు)
ధ్వజావరోహణం
23-09-2026
(రాత్రి)

# శ్రీవారి బ్రహ్మోత్సవ వాహనాల దివ్యవైభవం

– అర్చకం శ్రీనివాసకృష్ణచంద్ర దీక్షితులు, శ్రీవారి అర్చకులు, 91005 98227

తిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామివారికి నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాలు వైఖానసాగమ సంప్రదాయానికి ప్రతీకగా, వేలాది సంవత్సరాలుగా నిరంతరాయంగా కొనసాగుతున్న మహోత్సవాలు. పురాణాలు, శాసనాలు, ఆలయ సంప్రదాయాలు ఈ ఉత్సవాల ప్రాచీనతను చాటుతున్నాయి. ఆధునిక కాలంలో తిరుమల తిరుపతి దేవస్థానం యాత్రికుల కోసం విశాలమైన వసతి, అన్నప్రసాదం, వైద్యసేవలు, రవాణా, భద్రత, పరిశుభ్రతతో పాటు ఎస్వీబీసీ ద్వారా ప్రత్యక్ష ప్రసారాలను ఏర్పాటు చేయడం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు ఈ దివ్యోత్సవాలను ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం పొందుతున్నారు.

బ్రహ్మోత్సవాలలో ప్రతి ఉదయం, సాయంత్రం జరిగే వాహనసేవలు ఈ మహోత్సవాలకు ప్రధానఆకర్షణ. విద్యుద్దీపాలంకరణలు, పుష్పాలంకరణలు, వేద ఘోషలు, మంగళవాద్యాలు, పండితుల వ్యాఖ్యానాల నడుమ శ్రీవారు వివిధవాహనాలపై భక్తులకు దర్శనమివ్వడం భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో ముంచెత్తుతుంది. ప్రతి వాహనం ఒక ప్రత్యేకమైన తాత్త్విక సందేశాన్ని, దైవగుణాన్ని ప్రతిబింబిస్తుంది.

పాద్మపురాణంలోని శ్రీవేంకటాచల మాహాత్మ్యం ప్రకారం, స్వాయంభువ మన్వంతరంలో భాద్రపద శుక్ల ద్వాదశి, శ్రవణ నక్షత్రయుక్త సోమవారంలో శ్రీనివాస భగవానుడు అవతరించిన కారణంగా ఈ బ్రహ్మోత్సవాలు నిర్వహించబడుతున్నాయి. వైఖానసాగమం ప్రకారం బ్రహ్మోత్సవాలను సోమయాగానికి సమానమైన మహాక్రతువుగా భావిస్తారు. ఈ ఉత్సవాలలో పాల్గొనడం వల్ల ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సత్సంతానం, పాపక్షయం, అంతిమంగా భగవదనుగ్రహం, మోక్షప్రాప్తి కలుగుతాయని ఆగమాలు పేర్కొంటున్నాయి.



## ఆర్ద్రనక్షత్రోత్సవం



శ్రీభగవద్రామానుజులవారి అవతార నక్షత్రం ఆర్ద్ర నక్షత్రం నాటి సాయంత్రం రోజున శ్రీమలయప్పస్వామివారు 'సహస్రదీపాలంకరణసేవ'లో పాల్గొంటారు. ఆరోజు భగవద్రామానుజుల వారు మరో పీఠాన్ని ఎక్కి శ్రీస్వామి వారికి అభిముఖంగా ఉంటూ తిరుమల తిరువీధుల్లో ఊరేగింపబడతారు.

ప్రత్యేకంగా మేషమాసంలోని ఆర్ద్ర నక్షత్రానికి ముందు పదిరోజుల నుంచి భాష్యకార్ల ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. ఆ పదిరోజులు శ్రీస్వామివారికి అభిముఖంగానే రామానుజులవారు ఊరేగింపబడతారు. ఆలయంలో భాష్యకారుల సన్నిధిలో శ్రీస్వామివారికి ఆస్థానం జరుగుతుంది. నివేదనానంతరం శ్రీస్వామివారి మాలలు రామానుజులకు సమర్పిస్తారు.

అలాగే శ్రీస్వామి వారి శేషహారతి రామానుజులకు ఇవ్వబడుతుంది. ఈ దర్శనంతో 27 నక్షత్రాలవారికి నక్షత్రశాంతితో పాటు విశేషంగా 'ఆర్ద్ర' నక్షత్రశాంతి జరుగుతుంది.



## పునర్వసు నక్షత్రోత్సవం



**శ్రీరాముని జన్మనక్షత్రం పునర్వసు. ప్రతినెలా పునర్వసు రోజున సుప్రభాతానంతరం భోగ శ్రీనివాసమూర్తితో పాటు శ్రీ సీతారామ లక్ష్మణులకు అభిషేకం జరుగుతుంది. శ్రీరామ నవమిరోజు, ఆ మరునాడు దశమిరోజు బంగారు వాకిలి ముందు శ్రీ సీతారామ లక్ష్మణులకు ఆస్థానం జరుగుతుంది.**

**ఆ సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవలో శ్రీ సీతారామ లక్ష్మణులు ఆజ్ఞా పాలక ఆంజనేయ స్వామి మాత్రమే పాల్గొంటారు. అనంతరం తిరుమల పుర వీధుల్లో ఊరేగింపు జరిగిన తర్వాత శ్రీ సీతారామలక్ష్మణులు శ్రీ బేడీ ఆంజనేయ స్వామి వారి వద్దకు రాగా, అక్కడ రాముల వారి పూలమాలను బేడీ ఆంజనేయ స్వామికి సమర్పించిన తర్వాత శేషహారతి ఇస్తారు.**

**పిదప, శ్రీ సీతారామ లక్ష్మణులు ఆలయంలో ప్రవేశిస్తారు. ఈ సేవ దర్శనంతో 27 నక్షత్రాలవారికి నక్షత్ర శాంతితోపాటు, "పునర్వసు" వారికి విశేషంగా నక్షత్రశాంతి జరుగుతుంది.**

చతుర్ముఖ బ్రహ్మ స్వయంగా ఈ ఉత్సవాలకు అధిపతిగా వ్యవహరిస్తాడనే విశ్వాసానికి ప్రతీకగా ప్రతి వాహనసేవకు ముందు **'బ్రహ్మరథం'** ఊరేగుతుంది. ధ్వజారోహణానికి పూర్వం అంకురార్పణ, అనంతరం యాగశాలలో నిర్వహించే వైదిక హోమాలు ఈ ఉత్సవాల ఆధ్యాత్మిక ప్రాముఖ్యాన్ని మరింత పెంపొందిస్తాయి. సంప్రదాయం, ఆగమశాస్త్రం, ఆధునిక నిర్వహణ–ఈ మూడింటి సమన్వయంతో తిరుమల బ్రహ్మోత్సవాలు నేటికీ ప్రపంచవ్యాప్తంగా కోట్లాది భక్తులను ఆకర్షిస్తున్న దివ్య మహోత్సవాలుగా వెలుగొందుతున్నాయి.

శ్రీ వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైఖానసాగమ విధానాన్ని అనుసరించి అత్యంత వైభవంగా, నియమనిష్ఠలతో నిర్వహించబడతాయి. ఈ తొమ్మిది రోజులపాటు **'ద్విగుణ ఆరాధన'**, **'ద్విగుణ నివేదనం'** జరగడం ప్రత్యేకత. నిత్యనైవేద్యాల కంటే రెట్టింపు నివేదనలు, విశిష్ట ప్రసాదాలు స్వామివారికి సమర్పిస్తారు. ధ్వజారోహణానికి ముందు వచ్చే శుక్రవారం అభిషేకానంతరం స్వామివారికి **వజ్రకిరీటం, వజ్రఖచిత శంఖచక్రాలు, మకరకంఠి, స్వర్ణపీతాంబరం** వంటి దివ్యాభరణాలతో మహా అలంకారం చేస్తారు. ఈ విశేష అలంకారం సంవత్సరంలో నాలుగు ప్రధాన పర్వదినాలలో మాత్రమే జరుగుతుంది. తమిళ సంప్రదాయంలో ఈ శుక్రవారాన్ని **"రెట్టపడి వారం"** అని వ్యవహరిస్తారు.

బ్రహ్మోత్సవాలకు ముందు నిర్వహించే 'కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం' ద్వారా ఆలయం, గర్భగృహం, పూజా సామగ్రి, ఉత్సవమూర్తుల సింహాసనాలు శాస్త్రోక్తంగా శుద్ధి చేయబడతాయి. అనంతరం పసుపు, కుంకుమ, చందనం, గడ్డకర్పూరం తదితర సుగంధద్రవ్యాలతో తయారైన "పరిమళం" అనే ఔషధ లేపనాన్ని గర్భగృహ గోడలకు పూసి ఆలయానికి పవిత్రతను చేకూరుస్తారు.

బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఆగమశాస్త్రంలో నిష్ణాతులైన అర్చకులను **'కంకణ భట్టరు'**గా నియమిస్తారు. అంకురార్పణ నుండి ధ్వజావరోహణం వరకు వారు దీక్షతో, బ్రహ్మచర్యవ్రతం, ఏకభుక్తం, నిత్యానుష్ఠానాలను ఆచరిస్తూ ఉత్సవాలను నిర్వహిస్తారు.

ధ్వజారోహణానికి ముందురోజు రాత్రి నిర్వహించే అంకురార్పణ బ్రహ్మోత్సవాల ఆరంభ సూచకం. విష్వక్సేనులవారు ముందుగా ఉత్సవవీధుల్లో విహరించి విఘ్ననివారణ సంకల్పం చేస్తారు. అనంతరం భూదేవిని ఆవాహన చేసి నవధాన్యాలను పాలికలలో నాటుతారు. ఈ అంకురాలు సమృద్ధిగా పెరగడం ఉత్సవాల విజయానికి, లోకక్షేమానికి శుభసూచకంగా భావించబడుతుంది.

బ్రహ్మోత్సవాల ప్రధాన ఘట్టమైన ధ్వజారోహణం మొదటి రోజు సాయంత్రం కన్యాలగ్నంలో జరుగుతుంది. ఆగమోక్తంగా ప్రతిష్ఠించిన గరుడధ్వజాన్ని వేదమంత్రాల నడుమ ఎగురవేయడం ద్వారా దేవతలందరినీ బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించినట్లుగా భావిస్తారు. గరుడునికి ప్రత్యేకంగా **'ముద్గాన్నం'** (కట్టె పొంగలి) నివేదిస్తారు. ఇతర ఆలయాలకు భిన్నంగా తిరుమలలో ధ్వజారోహణం సాయంత్రం నిర్వహించడం విశిష్ట సంప్రదాయం. 1339 సం॥లో మలయప్ప కోనలో వెలికితీయబడిన శ్రీ మలయప్ప స్వామివారు, శ్రీదేవి–భూదేవి సమేతంగా నేటికీ బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఉత్సవ మూర్తిగా భక్తులకు దివ్యదర్శనం అనుగ్రహిస్తున్నారు.

ధ్వజారోహణం అనంతరం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ తరఫున, రాష్ట్ర ప్రజలందరి పక్షాన ఆంధ్రప్రదేశ్ మాన్య ముఖ్యమంత్రి శ్రీవేంకటేశ్వరస్వామివారికి నూతన పట్టువస్త్రాలను సమర్పించడం బ్రహ్మోత్సవాలలో ఒక విశిష్ట సంప్రదాయం.

**పెద్దశేషవాహనం-** మొదటి రోజు రాత్రి శ్రీ మలయప్పస్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతంగా ఏడు తలల పెద్దశేష వాహనంపై భక్తులకు దర్శనమిస్తారు. వైఖానసాగమంలో ఆదిశేషుడు **అనంతుడు, సహస్రశీర్షుడు, నాగరాజు, శేషుడు** అనే నామాలతో స్తుతింపబడతాడు. బ్రహ్మోత్సవాల ప్రారంభంలో జరిగే రక్షాబంధనంలో కూడా ఆదిశేషునికే ప్రత్యేకపూజ నిర్వహిస్తారు. తిరుమల శేషాచలం అనే పేరే ఆదిశేషుని మహిమను తెలియజేస్తుంది. విశిష్టాద్వైత సిద్ధాంతం ప్రకారం భగవంతుడు **'శేషి'**, జీవులు **'శేష భూతులు'**. ఆదిశేషుని వాహనంగా అధిరోహించిన శ్రీవారు, ప్రతి భక్తుడు దాస్యభావంతో భగవంతుని ఆశ్రయించి జీవితం సార్థకం చేసుకోవాలనే సందేశాన్ని అందిస్తారు.

**చిన్నశేష వాహనం-** రెండవ రోజు ఉదయం శ్రీ మలయప్పస్వామివారు ఐదు తలల చిన్నశేష వాహనంపై ఏకాకిగా దర్శనమిస్తారు. సంప్రదాయం ప్రకారం పెద్దశేషుడు ఆదిశేషునికి, చిన్నశేషుడు వాసుకికి ప్రతీకగా భావించబడుతుంది. భగవద్గీతలో శ్రీకృష్ణుడు "అనంతశ్చాస్మి నాగానాం" అని అనంతుని వైభవాన్ని ప్రకటించాడు.

యోగశాస్త్ర దృష్ట్యా చిన్నశేష వాహనం కుండలినీశక్తికి ప్రతీక. ఈ వాహన సేవను భక్తిశ్రద్ధలతో దర్శించిన వారికి అంతర్ముఖత, మనోనిగ్రహం, ఆధ్యాత్మిక చైతన్యం కలుగుతాయని ఆగమ సంప్రదాయం వివరిస్తుంది.

**హంస వాహనం-** రెండవ రోజు రాత్రి శ్రీ మలయప్పస్వామివారు హంసవాహనంపై విద్యాలక్ష్మి లేదా సరస్వతీ స్వరూపంగా భక్తులను అనుగ్రహిస్తారు. హంసకు క్షీర-నీర వివేకం ఉన్నదనే ప్రసిద్ధి. అందువల్ల ఈ వాహనం ఆత్మానాత్మ వివేకానికి ప్రతీకగా భావించబడుతుంది. అన్నమాచార్యులు "హంస చేతి పాలు నీరు నట్లాయె బ్రదుకు" అని కీర్తించినట్లుగా, సత్యాసత్యాలను గ్రహించి భగవంతుని ఆశ్రయించినవారికి జ్ఞానం, వివేకం, భక్తి ప్రసాదించడమే ఈ వాహనసేవ సందేశం.

**సింహ వాహనం-**మూడవ రోజు ఉదయం శ్రీమలయప్పస్వామివారు సింహవాహనంపై యోగాసనంలో దర్శనమిస్తారు. భగవద్గీతలో "మృగాణాం చ మృగేంద్రోఽహమ్" అని శ్రీకృష్ణుడు సింహాన్ని తన విభూతిగా పేర్కొన్నాడు. విష్ణు సహస్రనామంలోనూ "సింహః" అనే నామం రెండు పర్యాయాలు వస్తుంది.

సింహం ధైర్యం, పరాక్రమం, ధర్మరక్షణకు ప్రతీక. నరసింహావతారాన్ని స్మరింపజేసే ఈ వాహనసేవ ద్వారా శ్రీవారు దుష్టశిక్షణ, శిష్టరక్షణ తన ధర్మమని భక్తులకు సందేశమిస్తారు.

**ముత్యపు పందిరి వాహనం-** మూడవ రోజు రాత్రి శ్రీమలయప్పస్వామివారు ఉభయ దేవేరులతో కలిసి ముత్యపు పందిరి వాహనంపై విహరిస్తారు. చంద్రునికి ప్రతీకలైన ముత్యాలు శాంతి, శైత్యం, నిర్మలత్వానికి చిహ్నం. "మౌక్తికస్రగ్విణే నమః" అని సహస్రనామాలలో కీర్తింపబడే శ్రీవారు ముత్యాల పందిరిలో దర్శనమివ్వడం భక్తుల తాపత్రయాలను తొలగించి మనశ్శాంతిని ప్రసాదిస్తుందనే భావన.

## శ్రవణ నక్షత్రోత్సవం



**శ్రీవేంకటేశ్వరస్వామివారి అవతార నక్షత్రం శ్రవణం. శ్రవణం నాటి ఉదయం భోగ శ్రీనివాస మూర్తితో పాటు దేవేరులతో శ్రీ మలయప్పకు అభిషేకం జరుగుతుంది.**

**అన్ని సేవలు అయిన తర్వాత ఆ సాయంత్రం శ్రీ మలయప్పస్వామి సహస్రదీపాలంకరణ సేవలో పాల్గొన్న పిదప పురవీధుల్లో ఊరేగింపబడి ఆలయం ప్రవేశిస్తారు.**

**తిరుమలలో శ్రవణ నక్షత్రానికి కొన్ని నెలల్లో విశేషంగా ఉత్సవాలు జరుపుతారు.**

**ప్రతి కన్యామాసంలోని శ్రవణ నాటికి ముగిసేట్లుగా బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. కార్తికమాసంలోని శ్రవణంనాడు శ్రీస్వామివారికి పుష్ప యాగోత్సవం నిర్వహిస్తారు.**

**శ్రవణం నక్షత్రం రోజున శ్రీస్వామి వారి సహస్ర దీపాలంకరణ సేవలో పాల్గొన్న తర్వాత పురవీధుల్లో ఊరే గింపబడతారు.**

**పున్నమి గరుడసేవ**



**కేవలం నక్షత్రోత్సవాలేగాక, ప్రతి నెలా ప్రతి పున్నమినాటి రాత్రి పూట తిరుమలేశునికి "పున్నమి గరుడసేవ" నిర్వహిస్తారు.**

**పున్నమి నాటి రాత్రి 7.00 గంటల సమయంలో వజ్ర కవచ వజ్రకిరీటాది సర్వాభరణ భూషితుడైన శ్రీ మలయప్ప స్వామివారు బంగారు గరుడునిపై వేంచేసి, ఛత్ర చామరాలతో, గజ తురగ వృషభరాజులతో తిరుమల పురవీథుల్లో విహరిస్తూ దర్శన మిస్తారు.**

**కల్పవృక్ష వాహనం-** నాలుగవ రోజు ఉదయం శ్రీ మలయప్పస్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతంగా కల్పవృక్షవాహనంపై భక్తులను అనుగ్రహిస్తారు. క్షీరసాగరమథనంలో ఉద్భవించిన కల్పవృక్షం కోరిన కోరికలను తీర్చేదిగా పురాణాలు వర్ణిస్తాయి. అయితే కల్పవృక్షాన్ని అధిరోహించిన శ్రీ వేంకటేశ్వరస్వామివారు కేవలం ఐహిక సంపదలనే కాదు, భక్తులకు ధర్మం, భక్తి, వైరాగ్యం, మోక్షమార్గాన్ని కూడా ప్రసాదించే భక్తజన కల్పవృక్షుడు అనే సందేశాన్ని ఈ వాహనసేవ ద్వారా చాటుతున్నారు.

**సర్వభూపాల వాహనం-** నాలుగవ రోజు రాత్రి శ్రీ మలయప్పస్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతంగా సర్వభూపాలవాహనంపై భక్తులకు దర్శనమిస్తారు. వేదాలు శ్రీమహా విష్ణువును "రాజాధిరాజాయ ప్రసహ్య సాహినే" అని కీర్తించాయి. సమస్త భూపాలకులకు అధిపతిగా, జగన్నాయకునిగా శ్రీహరి ఈ వాహనంపై విహరిస్తాడు. శాస్త్రం ప్రకారం రాజులు భగవదంశ సంభూతులు; వారికి ఆధారభూతుడు భగవంతుడే. అందువల్ల సర్వభూపాల వాహనం ధర్మపాలన, ప్రజారంజక పరిపాలన, రాజధర్మ పరిరక్షణకు ప్రతీకగా నిలుస్తుంది. శ్రీవారి ఆలయంలో ఉగాది, ఆణివార, దీపావళి, శ్రీరామనవమి, కైశికీద్వాదశి వంటి ప్రధాన ఆస్థానాలలో కూడా సర్వభూపాలవాహనమే ఉపయో గించడం దీని విశిష్టతను తెలియజేస్తుంది. రాజులు మాత్రమే కాదు, ప్రతి భక్తుడు తన హృదయంలో భగవంతుణ్ణి ప్రతిష్ఠించి జీవించాలనే సందేశాన్ని ఈ వాహనసేవ అందిస్తుంది.

**మోహినీ అవతారం-** ఐదవ రోజు ఉదయం శ్రీ వేంకటేశ్వరస్వామివారు మోహినీ అవతారంలో జగన్మోహినిగా దర్శనమిస్తారు. మైసూరు సంస్థాన రాజులు సమర్పించిన దంతపు పల్లకిలో మోహినీ రూపంలో స్వామివారు, పక్కనే శ్రీకృష్ణస్వామివారు ఉత్సవంగా వేంచేయడం ఈ సేవ ప్రత్యేకత. సముద్రమథనంలో అమృతాన్ని దేవతలకు అందించిన మోహినీ అవతారాన్ని స్మరింపజేసే ఈ ఉత్సవం, జగత్తంతా భగవంతుని మాయాశక్తికి లోబడినదని, భక్తి, శరణాగతి ద్వారానే ఆ మాయను అధిగమించగలమని బోధిస్తుంది. స్త్రీ స్వరూపానికి తగిన దివ్యాభరణాలు, పట్టువస్త్రాలు, పుష్పమాలలతో అలంకరింప బడిన స్వామివారి ఈ దర్శనం బ్రహ్మోత్సవాలలో అత్యంత మనోహరమైన ఘట్టాలలో ఒకటిగా భావించబడుతుంది.

**గరుడసేవ-**ఐదవ రోజు రాత్రి జరిగే గరుడసేవ బ్రహ్మోత్సవాలలో అత్యంత ప్రధాన మైనది. గరుత్మంతుడు శ్రీమహావిష్ణువు నిత్యవాహనం, నిత్యసూరి, పరమభక్తుడు. అందువల్ల ఈ రోజున లక్షలాది మంది భక్తులు తిరుమలకు చేరుకొని గరుడసేవను దర్శించుకుంటారు. ఈ సందర్భంగా శ్రీమలయప్పస్వామివారికి మూలవిరాట్టుకు నిత్యం అలంకరించే **లక్ష్మీహారం, మకరకంఠి, సహస్రనామహారం, వజ్రకిరీటం** వంటి అపూర్వ దివ్యాభరణాలను సమర్పిస్తారు. తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూరు నుండి ఆండాళ్ పుష్ప మాలలు, రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన పట్టువస్త్రాలు, చెన్నై నుండి సంప్రదాయబద్ధంగా తీసుకువచ్చే గొడుగులు కూడా ఈ సేవలో విశేష ఆకర్షణగా నిలుస్తాయి. గరుడసేవ దర్శనం సర్వపాపహరం, సర్వసంపత్ప్రదం, మోక్షప్రదమని పురాణాలు ప్రశంసించాయి.

**హనుమంత వాహనం-**ఆరవ రోజు ఉదయం శ్రీమలయప్పస్వామివారు హనుమంత వాహనంపై దర్శనమిస్తూ త్రేతాయుగ శ్రీరాముడే కలియుగంలో శ్రీనివాసుడిగా అవతరించాడనే సత్యాన్ని భక్తులకు స్మరింపజేస్తారు. హనుమంతుడు దాస్యభక్తికి, అచంచల విశ్వాసానికి, సేవాతత్పరతకు ప్రతీక. ఈ వాహనసేవను దర్శించిన భక్తులకు బుద్ధి, బలం, ధైర్యం, ఆరోగ్యం, వాక్పటిమ, భక్తి ప్రసాదించబడతాయని విశ్వాసం.

**స్వర్ణరథం-గజవాహనం-** అదే రోజు సాయంత్రం రంగనాయకుల మండపంలో వసంతోత్సవానంతరం శ్రీమలయప్పస్వామివారు స్వర్ణరథంపై భక్తులను అనుగ్రహిస్తారు. సువర్ణ రథంలో విహరించే శ్రీనివాసుని దర్శనం శ్రీకృష్ణుని దివ్యరథయాత్రను స్మరింపజేస్తూ భక్తులకు ఐశ్వర్యం, మంగళం, విజయాలను ప్రసాదిస్తుంది. అనంతరం రాత్రి గజవాహనంపై దర్శనమిచ్చే శ్రీవారు గజేంద్రమోక్ష ఘట్టాన్ని గుర్తుచేస్తూ సంపూర్ణ శరణాగతియే భగవదనుగ్రహానికి మార్గమని ఉపదేశిస్తారు. గజేంద్రుని వలె భగవంతుని ఏకైక శరణుగా ఆశ్రయించినవారిని స్వామివారు తప్పక రక్షిస్తాడనే విశ్వాసానికి ఈ వాహనసేవ ప్రతీక.

**సూర్యప్రభ వాహనం-** ఏడవ రోజు ఉదయం శ్రీమలయప్పస్వామివారు సూర్యప్రభ వాహనంపై తేజోమయ స్వరూపంతో దర్శనమిస్తారు. సూర్యుడు ప్రత్యక్షదైవం, ఆరోగ్య ప్రదాత, జగత్తుకు జీవనాధారం. గీతలో శ్రీకృష్ణుడు "జ్యోతిషాం రవిరంశుమాన్" అని తన వైభవాన్ని ప్రకటించినట్లు, సూర్యప్రభ వాహనం ద్వారా శ్రీవారు భక్తులకు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, జీవనోత్సాహాన్ని ప్రసాదిస్తారు.

**చంద్రప్రభ వాహనం-** ఏడవ రోజు రాత్రి శ్రీమలయప్పస్వామివారు చంద్రప్రభ వాహనంపై శాంతస్వరూపుడై విహరిస్తారు. చంద్రుడు శైత్యానికి, ప్రశాంతతకు, ఓషధీశక్తికి ప్రతీక. సూర్యుని తేజస్సు జీవనానికి బలమైతే, చంద్రుని కాంతి మనస్సుకు ప్రశాంతతను ప్రసాదిస్తుంది. చంద్రప్రభ వాహనంపై శ్రీవారిని దర్శించిన భక్తులకు ఆధ్యాత్మిక ఆనందం, మానసిక ప్రశాంతత, త్రివిధ తాపాల నివృత్తి కలుగుతుందని ఆగమ, పురాణ సంప్రదాయాలు పేర్కొంటున్నాయి. **ఈ విధంగా నాలుగవ నుండి ఏడవ రోజు వరకు జరిగే వాహనసేవలు భక్తి, జ్ఞానం, ధర్మం, శరణాగతి, లోకక్షేమం అనే శాశ్వత సనాతన విలువలను భక్తులకు బోధిస్తూ బ్రహ్మోత్సవాల వైభవాన్ని మరింత ఉజ్జ్వలంగా నిలబెడుతున్నాయి.**

**మహారథోత్సవం-** శ్రీ వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో చివరి రెండు రోజుల ఉత్సవాలు ఆధ్యాత్మిక వైభవానికి పరాకాష్ఠగా నిలుస్తాయి. ఎనిమిదవ రోజు ఉదయం జరిగే మహా రథోత్సవం బ్రహ్మోత్సవాలలో అత్యంత వైభవోపేతమైన ఘట్టం. ఉభయ దేవేరులతో కూడిన శ్రీమలయప్పస్వామివారు మహారథంపై నాలుగు మాడ వీధులలో విహరిస్తూ భక్తులను అనుగ్రహిస్తారు. ఇతర వాహనసేవలలో భక్తులు కేవలం దర్శనార్థులైతే, రథోత్సవంలో స్వయంగా రథపగ్గాలు పట్టి రథాన్ని లాగుతూ సేవలో భాగస్వాములు కావడం ఈ ఉత్సవ ప్రత్యేకత. **"రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే"** అనే ఆర్షవాక్యం ప్రకారం రథారూఢుడైన శ్రీనివాసుని దర్శనం మోక్షప్రదమని భావిస్తారు. కఠోపనిషత్తు బోధించినట్లుగా శరీరం రథం, ఆత్మ రథికుడు, బుద్ధి సారథి, మనస్సు పగ్గాలు, ఇంద్రియాలు గుర్రాలనే తత్త్వాన్ని ఈ రథోత్సవం స్మరింపజేస్తుంది.

## సంవత్సరోత్సవాలు

సప్తగిరీశునకు సంవత్సరానికి ఒక్కమారు మాత్రమే ఆయా విశేషదినాల్లో ఆయా ఉత్సవాలు జరుగుతున్నాయి. అవి-

## కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

కోయిల్ అనగా 'గుడి'. 'ఆళ్వారు' భగవంతునితో తాదాత్మ్యం పొందిన భక్తుడు. భక్తుడు భగవంతుణ్ణి తన హృదయంలో ప్రతిష్ఠించుకొన్నట్లే గుళ్లో దేవుణ్ణి ప్రతిష్ఠిస్తారు. అందుకే 'కోయిల్ ఆళ్వార్' అని గుడిని పిలవడం. తిరుమజ్జనమే తిరుమంజనం అయింది. తిరుమజ్జనం అనగా-మంగళస్నానం. ఆలయం అంతా శుద్ధి చేయడం అన్నమాట. తిరుమల శ్రీవారి ఆలయానికి సంవత్సరంలో నాలుగు మార్లు తిరుమంజనం జరుగుతుంది. ఉగాదికి ముందు, ఆణివర ఆస్థానానికి ముందు, బ్రహ్మోత్సవాలకు ముందు, వైకుంఠ ఏకాదశికి ముందు వచ్చే మంగళ వారాల్లో శ్రీవారి ఆలయాన్ని శుభ్రంగా కడగడం అనే కోయిల్ ఆళ్వారు తిరుమంజనం జరుగుతుంది. ఇదొక మహా యజ్ఞంగా జరుగుతుంది.

గర్భాలయంలోని అన్ని ఉత్సవ విగ్రహాలు, బంగారు వెండిపాత్రలు బంగారు వాకిలి వరకు తెస్తారు. లోపల గోడలు పైకప్పులు ఇలా అంతటా కడిగి శుభ్రం చేస్తారు. చుట్టూ ఉన్న గుళ్లు కూడా శుభ్రం చేస్తారు. పిదప 'పరిమళాన్ని' ఆలయంలో గోడలకు పూస్తారు. నామంకోపు, శ్రీచూర్ణం, గడ్డకర్పూరం, గంధంపొడి, కుంకుమ, ఖిచిలిగడ్డ- వీటి మిశ్రమమే 'పరిమళం' అంటారు. ఈ పరిమళపు లేపన్ని అంతటా పూస్తారు. ఈ సేవ ఆర్జితంగా కూడ ప్రవేశపెట్టబడింది. ఈ సేవలో పాల్గొన్న గృహస్థులకు దివ్యక్షేత్రంలోని ఆలయాన్ని పరిశుభ్రం చేసిన పుణ్యం కలుగుతుంది.



## ఉగాది ఆస్థానం



ప్రతి సంవత్సరం తెలుగు ఉగాది నాడు, తెలుగువారి ఇలువేలుపు అయిన శ్రీ వేంకటేశ్వర స్వామికి 'ఉగాది ఆస్థానం' జరుగుతుంది. ఆరోజు ఉదయం మొదటి ఘంట నివేదన అనంతరం శ్రీ మలయప్ప స్వామి దేవేరులతో కూడా సర్వ భూపాల వాహనంలో బంగారు వాకిలి ముందు వేంచేస్తారు. శ్రీవారి సేనాధిపతి విష్వక్సేనులవారు పక్కన దక్షిణాభిముఖంగా మరొక పీఠంపై వేంచేస్తారు.

విశేషంగా పట్టువస్త్ర సమర్పణ, ప్రసాద నివేదన అనంతరం, అక్షతా రోపణ జరిగిన తర్వాత పంచాంగ శ్రవణం జరుగుతుంది. ఆనాటి తిథి వార నక్షత్రాలతో పాటు సంవత్సర ఫలాలు, దేశకాల వ్యవహారాది పంచాంగ వివరాలను శ్రీనివాసునికి విన్పించడం జరుగుతుంది.

చివరిగా కర్పూర నీరాజనాలు జరిగిన తర్వాత తీర్థప్రసాద వినియోగం జరుగుతుంది.

**అశ్వవాహన సేవ-** అదే రోజు రాత్రి జరిగే అశ్వవాహన సేవలో శ్రీనివాసుడు ఖడ్గధారి యోధునిగా అశ్వంపై విహరిస్తాడు. అశ్వం వేగం, శౌర్యం, ధర్మరక్షణకు ప్రతీక. పురాణాల ప్రకారం కలియుగాంతంలో **కల్కి అవతారంగా** భగవంతుడు అశ్వారూఢుడై అధర్మాన్ని నిర్మూలిస్తాడనే సందేశాన్ని ఈ వాహనసేవ ప్రతిబింబిస్తుంది. అలాగే ఇంద్రియనిగ్రహం, ధర్మాచరణ, నామసంకీర్తన ద్వారానే కలిదోషాలను అధిగమించ వచ్చని స్వామివారు భక్తులకు బోధిస్తున్నట్లు భావిస్తారు.

**చక్రస్నానం-** తొమ్మిదవ రోజు ఉదయం జరిగే చక్రస్నానం బ్రహ్మోత్సవాల మహా సమాప్తి యాగస్వరూపమైన అవభృథస్నానం. ఉభయ దేవేరులతో కూడిన శ్రీ మలయప్ప స్వామివారు, సుదర్శన చక్రత్తాళ్వారుతో కలిసి వరాహపుష్కరిణికి ఉత్సవంగా విచ్చేసి స్నపన తిరుమంజనం స్వీకరిస్తారు. అనంతరం సుదర్శన చక్రానికి పవిత్ర స్నానం నిర్వహించగా, అర్చకులు, జీయర్ స్వాములు, అధికారులు, భక్తులు కూడా పుష్కరిణిలో స్నానం చేస్తారు. శ్రవణ నక్షత్రాన చక్రస్నానం చేయడం వలన పూర్వజన్మ పాపాలు నశించి ఐహిక-పారత్రిక శ్రేయస్సు సిద్ధిస్తుందని వైఖానస ఆగమం పేర్కొంటుంది.

అదే రోజు సాయంత్రం జరిగే **ధ్వజావరోహణం**తో బ్రహ్మోత్సవాలు శాస్త్రోక్తంగా ముగుస్తాయి. ధ్వజారోహణ సమయంలో గరుడధ్వజం ద్వారా దేవతలను ఆహ్వానించి నట్లే, ధ్వజావరోహణంలో వారికి మంత్రపూర్వకంగా వీడ్కోలు పలుకుతారు. యాగ శాలలో అంత్యహోమం, పూర్ణాహుతి, బలి సమర్పణల అనంతరం ధ్వజాన్ని అవనతం చేస్తారు. తరువాత **శ్రవణా** నక్షత్ర ఆస్థానం, ప్రధాన కలశ శక్తిని మూలమూర్తిలో ఆరోపణ, విశేష నివేదనలతో ఉత్సవాలు పరిపూర్ణమవుతాయి. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించిన కంకణభట్టాచార్యులు, అర్చకులకు ఆలయ మర్యాదలు నిర్వహించడం సంప్రదాయం.

శ్రీ వేంకటేశ్వరునికి సమానమైన దైవం లేదని "వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి" అనే పురాణవాక్యం ఘోషిస్తుంది. అందువల్ల తిరుమల బ్రహ్మోత్సవాలు భక్తులకు అత్యంత పుణ్యప్రదమైన మహోత్సవాలుగా భావించబడుతున్నాయి. ప్రత్యక్షంగా పాల్గొన్నవారికి, దర్శించినవారికి అశ్వమేధయాగఫలం లభిస్తుందని, పుత్రకామునికి పుత్రప్రాప్తి, ధనకామునికి సంపద, విజయకామునికి విజయం, శ్రేయోభిలాషికి ఐశ్వర్యం ప్రసాదించబడుతాయని వైఖానస ఆగమం తెలియజేస్తుంది. అంతేకాక, ఇరవై ఒక తరాలకు విష్ణుసాయుజ్యం లభిస్తుందని శాస్త్రవచనం పేర్కొంటుంది.

అందుచేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు కేవలం ఆలయోత్సవాలు మాత్రమే కాక, వైఖానస ఆగమ వైభవం, భక్తి, తత్త్వజ్ఞానం, శరణాగతి, మోక్షమార్గాన్ని ప్రజలకు బోధించే మహా దివ్యయజ్ఞంగా యుగయుగాలుగా భాసిల్లుతున్నాయి.

అజ్ఞానినా మయా దోషాన్ అశేషాన్ విహితాన్ హరే ।
క్షమస్వ త్వం క్షమస్వ త్వం శేషశైల శిఖామణే ॥

॥ శ్రీనివాసో విజయతే ॥

సెప్టెంబరు 4న 'గోకులాష్టమి' సందర్భంగా...

# అన్నమయ్య పదాల్లో శ్రీకృష్ణ తత్త్వం

- డా॥ వేదార్థం మధుసూదన శర్మ, 90638 87585

ఆధ్యాత్మిక చింతనకు నిలయమైన మన భారతదేశంలో జన్మించిన ఎందరో మహానుభావులు, తమ బోధనలతో ప్రజలను పవిత్రులను చేస్తూ వస్తున్నారు. కర్మ భక్తి జ్ఞాన యోగ మార్గాలలో తరగని ఆధ్యాత్మిక సంపదను అందించిన మహానుభావులలో **తాళ్లపాక అన్నమాచార్యులు** ఒకరు. పదకవితా పితామహుడు, సంకీర్తనాచార్యుడు అయిన వీరు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి, అహోబిలంలోని శ్రీనరసింహస్వామి ఇంకా అనేక దివ్యక్షేత్రాల్లోని దేవతలను కీర్తిస్తూ 32 వేల సంకీర్తనలను రచించారు. విష్ణుమూర్తి యొక్క దశావతారాల్లో ద్వాపరయుగంలో జరిగిన **'శ్రీకృష్ణావతారానికి'** ఎంతో విశిష్టత ఉంది. శ్రీకృష్ణుడు శ్రావణబహుళఅష్టమి నాడు రాత్రి రోహిణి నక్షత్రంలో కారాగారంలో జన్మించినట్లు పురాణ కథనం. ఇతని తల్లి దేవకీ, తండ్రి వసుదేవుడు. పెంచింది యశోదాదేవి, నందుడు. శ్రీకృష్ణుడు తాను పరమాత్ముడు అయినప్పటికీ ఒక సాధారణ బాలకునిలా ఎన్నో చిలిపి చేష్టలు చేశారు. మన మనస్సు అనే కుండలోని వెన్న అజ్ఞానానికి సంకేతం. నల్లని కుండ వెలుగుకు, విజ్ఞానానికి చిహ్నం. తెల్లని వెన్న రూపంలాంటి తన భక్తుల మనసులోని అజ్ఞానం అనే చీకటిని తొలగించి విజ్ఞానం అనే వెలుగును నింపడంకోసమే శ్రీకృష్ణుడు వెన్నను తినేవాడు. ఆయన లీలామానుష విగ్రహుడు.

## అన్నమయ్య పదాల్లో శ్రీకృష్ణతత్త్వం

శ్రీకృష్ణలీలలు బ్రహ్మ, విష్ణు, బ్రహ్మాండ, బ్రహ్మవైవర్త, కూర్మ, పద్మ, మార్కండేయ పురాణాల్లో, శ్రీగర్గ, శ్రీదేవిభాగవతాల్లో, భారత హరివంశాల్లో గొప్పగా వర్ణించ బడ్డాయి. శ్రీభాష్యం అప్పలాచార్యులుగారు రచించిన **"తిరుప్పావై"** వ్యాఖ్యాన గ్రంథములో కృష్ణ శబ్దాన్ని ఈ విధంగా నిర్వచించారు. **"క్రిష్"** అంటే అపరిమితం. **"ణ"** అంటే ఆనందం. **"కృష్ణ"** అంటే అపరిమితమైన ఆనందము అని అర్థం చెప్పబడింది. అదియే బ్రహ్మస్వరూపము. అటువంటి పరబ్రహ్మ స్వరూపమైన కృష్ణతత్త్వాన్ని, అతని లీలామానుష వైభవాన్ని అన్నమయ్య తన కీర్తనల్లో గొప్పగా సాక్షాత్కరింపజేశాడు. అన్నమయ్య కీర్తనల్లో శ్రీకృష్ణుని జయంతి సందర్భంగా జరిపే గోకులాష్టమి పర్వదినాన్ని గురించి,అదే రోజున జరిపే ఉట్ల ఉత్సవాన్ని గురించి, అలాగే కృష్ణుని లీలలు మొదలైన వాటిని తెలిపే విశేషాలు ఉన్నాయి.

కృష్ణాష్టమి పర్వదినాన్ని గురించి అన్నమయ్య– "జో జో యని మీరు జోలపాడరో, సాజవు జయంతి నేడే, సఫల మందరికీ" "హరికర్థ్యము లీరో జయంతి పండుగ సేయరో".... అంటూ శ్రావణ అష్టమితో కలిసివచ్చే రోహిణి నాడు కృష్ణ జయంతిగా సూచిస్తూ అన్నమయ్య సంకీర్తనలు రాసి పాడాడు. అలాగే– "సతులారా చూడరే శ్రావణ బహుళాష్టమి నాడు".... అంటూ ఎంతో విశిష్టమైన శ్రావణ బహుళాష్టమి ప్రాముఖ్యతని, దాని ప్రాశస్త్యాన్ని వారు తన సంకీర్తనల్లో భావబంధురంగా అభివర్ణించి ఆలపించారు. "కొడుకై జన్మించినాడు కూరిమి శ్రీకృష్ణుడు, నడిరేయి నిదే

### శ్రీరామనవమి ఆస్థానం



ప్రతి సంవత్సరం చైత్రశుద్ధ నవమి రోజున బంగారు వాకిలి ముందు శ్రీరాములవారికి ఆస్థానం జరుగుతుంది.

ఆ సాయంత్రం హనుమద్వాహనంపై ఊరేగింపు జరుగుతుంది. తరువాత బంగారు వాకిలి వద్ద సర్వభూపాల వాహనంలో వేంచేయబడిన శ్రీ సీతారామ లక్ష్మణులకు, హనుమంతునికి ఆస్థానం, నివేదనలు, అక్షతారోపణ జరిగిన తర్వాత శ్రీ రామాయణంలోని శ్రీరామ జన్మ వృత్తాంతం పురాణ ప్రవచనం జరుగుతుంది. పిదప మంగళనీరాజనాలతో ఆస్థానం ముగుస్తుంది.

## శ్రీరామ పట్టాభిషేకం



పతి సంవత్సరం చైత్రశుద్ధ దశమి రోజు సాయంత్రం తిరుమల పుర వీథుల్లో శ్రీ సీతారామ లక్ష్మణులకు - అభిముఖంగా మరొక పీఠంపై ఆంజనేయుడు ఊరేగింపబడతాడు.

పిదప బంగారువాకిలి ముందు శ్రీ సీతారామలక్ష్మణులకు వీరికి ప్రక్కన ఒక్కొక్క పీఠంపై సుగ్రీవ, అంగద, హనుమంతులను వేంచేపు చేసిన తర్వాత ఆస్థానం జరుగుతుంది. అక్షతారోపణ నివేదన కార్యక్రమాలు అయిన తర్వాత శ్రీరామజననం నుండి పట్టాభిషేకం వరకు కథను ప్రవచనం చేస్తారు. పిదప మంగళ నీరాజనము, పట్టాభిషేకం ఉత్సవం ముగుస్తుంది. తీర్థప్రసాద వినియోగం జరుగుతుంది.




శ్రావణ బహుళాష్టమి నాడు", "శ్రావణ బహుళాష్టమీ చంద్రోదయం రోహిణి కావింప జన్మదిన మిదివో శ్రీ వేంకటపతికి", "గోవిందుడు జన్మించే గోకులాష్టమిదే నేడు", "అందమైన మధురలోన నదివో కృష్ణావతార మందేను శ్రావణ బహుళాష్టమి నేడు", "దేవకి కొడుకుగన్న దినమిది శ్రీజయంతి, వసుదేవు డెత్తెను శ్రావణ బహుళాష్టమి దినాన", "పురాణ పురుషుడు భువినవతరించే, సిరుల జయంతి నేడు, సేయరో పండగలు శ్రావణ బహుళాష్టమి జందురుడుదయించెను" అంటూ శ్రీకృష్ణాష్టమి తిథి నక్షత్రాలను మేళవించి కూడా అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు.

"పలువురు ఉట్ల పండుగను చిలుకు చిడుక్కొని చందగను" అంటూ జన్మాష్టమి నాడు దేశం యావత్తు ఎంతో ఉత్సాహంగా వినోదాన్ని పంచుకునే ఉట్ల పండుగకు అన్నమయ్య తన సంకీర్తనల్లో ప్రత్యేక స్థానాన్ని ఇచ్చాడు. అలాగే భాగవత దశమ స్కంధములో ప్రస్తావించినట్లుగా, శ్రీకృష్ణుని దివ్యలీలలే అన్నమయ్య లీలావైభవ సంకీర్తనలకు ఆధారము. అన్నమయ్య తన సంకీర్తనల్లో పూతన, శకటాసుర, తృణావర్త, కంసాదుల సంహారం, ఉలూఖల బంధనం, కాళీయమర్దనం, గోవర్ధనోద్ధరణ మొదలైన ఘట్టాలను గురించి ఎంతో రసవత్తరంగా ఆలపించాడు.

శ్రీతాళ్లపాక అన్నమాచార్యులు ప్రధానంగా శ్రీవేంకటేశ్వరస్వామిని స్తుతించినప్పటికీ, ఆయన సంకీర్తనల్లో శ్రీకృష్ణుని లీలలు, వాటి మాధుర్యం, పరబ్రహ్మతత్త్వం, భక్తవత్సలత్వం వంటి అంశాలు కూడా కనిపిస్తాయి. శ్రీకృష్ణునితత్త్వాన్ని తెలియజేసే ప్రసిద్ధ అన్నమయ్య కీర్తనల్లో– **"ముద్దుగారే యశోద ముంగిటి ముత్యము వీడు దిద్దరాని మహిమల దేవకి సుతుడు"..** ఒకటి. ఇందులో బాలకృష్ణుణ్ణి వివిధ రత్నాలతో పోలుస్తూ, ఆయన దివ్యస్వరూపాన్ని గురించి గొప్పగా వారు వర్ణించారు. శ్రీకృష్ణుడు బాలుడిగా కనిపించినా, అది పరబ్రహ్మస్వరూపమని ఇందులోని తత్త్వం మనకు బోధపడుతుంది. "భావములోనా బాహ్యమునందునా గోవింద గోవింద యని కొలువవో మనసా"....

అనే మరొక కీర్తనలో భగవంతుడు అంతరంగంలోను బాహ్యప్రపంచంలోనూ ఉన్నాడని భావము వ్యక్తమవుతుంది. శ్రీకృష్ణుడు సర్వాంతర్యామి అనే తత్త్వం ఇందులో మనకు కనబడుతుంది. "వినరో భాగ్యము విష్ణు కథ...." అనే మరొక కీర్తనలో విష్ణు అవతారాల మహిమను గానం చేశారు అన్నమయ్య. శ్రీకృష్ణుడు విష్ణుమూర్తి అవతారంగా లోకక్షేమం కోసం అవతరించాడని ఇందులో తెలుపబడింది. "జో అచ్యుతానంద జోజో ముకుంద రావే పరమానంద రామ గోవిందా....." అనే అన్నమయ్య కీర్తనలో శ్రీకృష్ణుని బాల్య విశేషాలను ఎన్నిటినో పేర్కొనడం జరిగింది.

ఈ విధంగా అన్నమయ్య దృష్టిలో, శ్రీకృష్ణుడు బాలుడు, గోపాలుడు, జగద్గురువు, పరబ్రహ్మ, ప్రేమస్వరూపుడు అనే పలు విధాలుగా దర్శనమిస్తాడు. అన్నమయ్యకు శ్రీకృష్ణుడు సాధారణ మానవుడు కాదు. సర్వలోకాలను సృష్టించి, పోషించి, లయపరిచే పరమాత్మ స్వరూపం. ఆయన ఎన్నో అవతారాలను ధరించినప్పటికీ, స్వరూపంలో మాత్రం ఒకే పరబ్రహ్మ. కృష్ణావతారం ద్వారా భక్తులకు చేరువైన దివ్య స్వరూపమే అన్నమయ్యకు కనిపిస్తుంది. అన్నమయ్య తన కీర్తనల్లో బాలకృష్ణుని అల్లరి, అమాయకత్వం, వెన్నదొంగతనం, యశోదతో ఆయనకున్న అనుబంధాన్ని ఎంతో మధురంగా చిత్రించారు. ఈ బాలలీలలు కేవలం వినోదం కోసం కాదు. భక్తుని హృదయంలో ప్రేమ, వాత్సల్యం, దైవానుభూతిని కలిగించే సాధనమని ఆయన భావించారు. అన్నమయ్య దృష్టిలో గోపికల ప్రేమ సాధారణ ప్రేమ కాదు. అది జీవాత్మ పరమాత్మను చేరాలనే తపనకు ప్రతీక. గోపికలు శ్రీకృష్ణుడిని ఎలా పరమప్రేమతో ఆరాధించారో, అలాగే ప్రతి భక్తుడు భగవంతునిపై అచంచలమైన ప్రేమను కలిగి ఉండాలని ఆయన తన కీర్తనల ద్వారా గొప్ప సందేశం ఇచ్చారు.

అన్నమయ్య దృష్టిలో శ్రీకృష్ణుడు కేవలం పురాణాల్లోని దేవుడు కాదు. ప్రతి హృదయంలో నివసించే పరమాత్మ. ఆయనలో బాలుడి అమాయకత్వం, గోపాలుని మాధుర్యం, గురువుయొక్క జ్ఞానం, పరబ్రహ్మయొక్క దివ్యత్వం సమన్వయమై ఉన్నాయి. ప్రేమ, భక్తి, సమర్పణ, ధర్మం, కరుణ అనే విలువలను జీవితంలో ఆచరించినప్పుడే శ్రీకృష్ణతత్త్వాన్ని అనుభవించ గలమని అన్నమయ్య తన సంకీర్తనల ద్వారా తెలియజేశారు. అందువల్ల అన్నమయ్య ప్రతిపాదించిన శ్రీకృష్ణ తత్త్వం భక్తి, వేదాంతం, మానవతా విలువల సమన్వయంగా తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచింది.

*"కృష్ణం వందే జగద్గురుమ్"*

## 2026, అక్టోబర్ నెల ఉత్సవాలు, పర్వదినాలు

| | |
|---|---|
| 02 | మహాత్మాగాంధీజయంతి |
| 10 | మహాలయ అమావాస్య |
| 12-20 | తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవం |
| 17 | సరస్వతిపూజ |
| 19 | దుర్గాష్టమి, మహానవమి |
| 20 | విజయదశమి |

## వసంతోత్సవాలు



ప్రతి సంవత్సరం చైత్ర పూర్ణిమకు ముగిసేట్లుగా మూడు రోజుల పాటు తిరుమలలో వార్షిక వసంతోత్సవాలు నిర్వహిస్తారు.

చైత్రశుద్ధ త్రయోదశి రోజు ఉదయం శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీ మలయప్పస్వామి ఆలయానికి నైరృతి మూలలో ఉన్న వసంత మండపానికి వేంచేయగా వసంతోత్సవ అభిషేకాలు నివేదన ఆస్థానాలు జరుగుతాయి. పిదప ఆలయాన్ని చేరుకొంటారు.

రెండవ రోజు శ్రీ మలయప్ప స్వామికి బంగారు రథోత్సవం జరిగిన తర్వాత మళ్లీ ముందురోజు మాదిరే వసంతమండపంలో వసంతోత్సవం జరుగుతుంది.

మూడవ రోజు శ్రీ మలయప్ప స్వామితోపాటు, వేర్వేరు పల్లకీలలో రుక్మిణీ శ్రీకృష్ణులు, శ్రీ సీతారామ లక్ష్మణులు కూడా వసంతమండపానికి ఊరేగింపుగా వెళ్ళి వసంతోత్సవ వేడుకల్లో పాల్గొని ఆ సాయంత్రం ఆలయానికి చేరుకొంటారు.

అర్జితంగా జరిగే ఈ వార్షిక వసంతోత్సవాల్లో భక్తులు పాలు పంచుకోవచ్చు. వసంతోత్సవం చేయించిన భక్తులకు తీవ్రమైన రోగాలు తగ్గి, ఆరోగ్యం సిద్ధిస్తుంది.

## శ్రీ పద్మావతీ పరిణయోత్సవాలు



వైశాఖ శుద్ధ దశమినాడు పద్మావతీ శ్రీనివాసుల పరిణయోత్సవ దినం. ఆ దినాన్ని పురస్కరించుకొని 1992 నుంచి మూడు రోజులపాటు 'పద్మావతీ పరిణయోత్సవాలు' తిరుమలలో జరుప బడుతున్నాయి.

ముందురోజు వైశాఖశుద్ధ నవమి రోజు సాయంత్రం శ్రీ వేంకటేశ్వరస్వామి గజవాహనంపై, శ్రీదేవి భూదేవులు పల్లకిపై వేంచేసి, ఊరేగింపుగా నారాయణగిరి ఉద్యానవనం చేరుకోగా అక్కడ పరిణయోత్సవవేడుకలు ఘనంగా జరుగుతాయి. సంగీత కచ్చేరీలు ఆస్థానం జరిగిన తర్వాత శ్రీ స్వామి వారు దేవేరులతో కలిసి ఆలయం చేరుకొంటారు.

అలాగే రెండవ రోజు వైశాఖ శుద్ధ దశమిరోజు అశ్వవాహనంపైన, మూడవ రోజు వైశాఖశుద్ధ ఏకాదశి గరుడ వాహనం పైన వేంచేయగా, పల్లకిలో శ్రీదేవిభూదేవులు వేంచేస్తారు. నారాయణగిరి ఉద్యానవనంలో పరిణయోత్సవ వేడుకలు మొదటిరోజు మాదిరి గానే రెండవ, మూడవ రోజున కూడా నిర్వహిస్తారు. శ్రీపద్మావతీ పరిణయోత్సవ వేడుకలు దర్శించిన భక్తుల ఇండ్లలో వివాహాది శుభకార్యాలు సిద్ధిస్తాయి. ఆర్జిత రుసుమును చెల్లించిన భక్తులు ఈ సేవల్లో పాల్గొనవచ్చును.

*సెప్టెంబరు 14న 'వినాయకచవితి' సందర్భంగా...*

# ప్రథమపూజితా ప్రమథగణాధిపా!

– శ్రీ జంధ్యాల శరత్‌బాబు, 99483 45013

ప్రణమ్య శిరసా దేవం, గౌరీపుత్రం వినాయకమ్
భక్తావాసం స్మరేన్నిత్యం, ఆయుష్కామార్థసిద్ధయే!

గణాధిపా, భవాత్మజా, సింధుర వదనా అని మనమందరం రెండు చేతులూ జోడించి మనసారా నమస్కరించే వినాయకచవితి మహోత్సవ ఉత్సాహం భారతీయులతో పాటు ప్రపంచ వ్యాప్త భక్తజనులందరి మనోమందిరాలూ స్వామి స్తుతితో నినదిస్తూనే ఉంటాయి.

సర్వాయా, సర్వసిద్ధిప్రదాయా, విశ్వరక్షాకృతే అంటున్నంత సేపూ నిరుపమాన భక్తితాదాత్మ్యత. ఏటా వచ్చే పండుగే అయినా ఎప్పటికప్పుడు ఎక్కడికక్కడ నిత్య నూతనత్వ భావనా తత్పరత. అంతటి ఉద్విగ్నతా పర్వదినం ముందు వెనకా కూడా నిరవధికంగా కొనసాగి, అత్యంత ఉత్తేజపూరిత వాతావరణాన్ని నలుదిశలా విస్తరిస్తుంది.

'ఆదిమధ్యాంత భవాయ' అంటుంది గణనాథస్తోత్రం. ఏ శుభకార్య ఆరంభమైనా, రోజూ చేసే అనుష్ఠానంలోనైనా ప్రథమంగా జరిగేది గణపతి పూజే కదా! ప్రత్యేకించి గణేశ ఆరాధన వేళ..

"ఇరువదినొకండు పత్రులు, విరిబాలలు పేర్చి, పాల వింటిని కూర్చి హరు సుతునారాధించిన గరికలకే మురిసి ఇచ్చు ఘనఫలితంబుల్" అని రామభద్రకవి వాక్కు.

ఈ మహోత్సవాన నిర్వర్తించే ప్రతీ అంశానికీ ప్రత్యేకత ఉంది. తెలుగువత్సరం లోని భాద్రపదమాసం వర్ష సంబంధం. ఈ కాలంలో ఆరోగ్య సంరక్షణకు వీలుగా, ఔషధ గుణాల పత్రులతో స్వామికి పూజ. ఇరవైఒక్క ఆకులతో సేవించడం తరతరాల సంప్రదాయం. అంటే ఏకవిశంతి నేపథ్యాన్ని పరిశీలిస్తే, 21 అనేది రాజచిహ్నాల సూచిక కూడా. ఛత్రం, చామరం, ధ్వజం వంటివి ఇందులో భాగాలు. ఏకవింశతి పత్రాలు అన్నీ సకలవిధాలా ఆరోగ్యప్రదాయకాలు.

'గణాధిపాయ నమః' అని మనం ప్రారంభించే **దుర్వాయుగ్మం** (గరిక) అంటే గణేశునికి పరమప్రీతి. ఆ పత్రంతో పూజించినా ఆయన పరమానందభరితుడవుతాడు. అదేవిధంగా తులసి, బదరి, దేవదారు, సింధువారపత్రాలకు వేటి ప్రాధాన్యతలు వాటికి ఉన్నాయి. అలాగే ఇతర వాటికీ.

పూర్వా/ఉత్తరాభాద్ర నక్షత్రంలో చంద్రసంచారం ఆధ్యాత్మికతా విస్తృతికి పేరొందిన సమయం. అందుకే భాద్రపదాన ఈ పూజాది కాలనిర్వహణ, రోజుల పర్యంత వేడుక మట్టివిగ్రహాన్ని మండపంలో ప్రతిష్ఠాపన చేయడం అంటే ప్రకృతిని ఆరాధించడమే! వినాయక ఆవిర్భావ కథనాన్ని అనుసరించి, మనం పూజించాల్సింది అంటువంటి ప్రతిమ.

ఆ మాటకొస్తే మట్టి, పత్రి సైతం ప్రకృతి రూపాలే. మట్టితో రూపొందించిన వాటిని పూజించడం, వాటినే జలనిమజ్జనం చేయడం నీటిశుద్ధికి మూలమవుతుంది. ముందుగా చెరువులనుంచి బంకమట్టిని సమీకరించి విగ్రహాలు చేయడం జలవనరుల బాగుదలకు దోహదపడుతుంది.

పూజలో దీపారాధనకు ఎంతో విశిష్ఠత ఉంది. దైవరూపం ముందు ప్రమిదలో నూనెపోసి వత్తులతో వెలిగించడం. దీపాన్నీ సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపంగా భావించడం అన్నమాట. శరీరానికి ప్రతీక ప్రమిద, మనసుకు సూచిక వత్తి. ఇటువంటి భావనతో దీప ఆరాధన చేయడం... మనలోని అజ్ఞాన అంధకారాన్ని తొలగించి విజ్ఞానమనే వెలుగును ప్రసాదించాలని వినాయకస్వామిని వేడుకోవడం.

భాద్రపదశుక్ల చవితిన వినాయక పుట్టినరోజున జన్మ ఆరాధన విస్తారంగా ఉంటుంది. జనన సందర్భ విధానాన్ని పద్మపురాణం, స్కంధపురాణం ఎంతగానో విపులీకరించాయి. స్వామి మంత్రాలన్నింటికీ ముందున్న 'ఓం' ఆయన శబ్దబ్రహ్మ స్వరూపమని చాటి చెప్తుంది. ధ్యానంలో, జపంలో ఉపాసనలో ఓంకారం నినదిస్తుంటుంది. బాల, తరుణ, ధ్వజ, క్షిప్ర, మహావిజయ, వీర, శక్తి, సిద్ధి ఆదిరూపాలు ఆయనవి. వర, సృష్టి రూపాలూ తనవే.



'ఓం శ్రీమహాగణాధిపతయే నమః' అని మొదలవుతుంది వ్రత కల్ప పూజ. 'ఉత్తమం గణనాథస్యవ్రతం సంపత్కరం శుభం' అంటూ కలశపూజ. శతనామ పూజక్రియ 'గజాననాయ నమః' అని మొదలై 'శ్రీవిఘ్నేశ్వరాయ నమః' గా ముగుస్తుంది. 'దేవదేవేశ ప్రసిద్ధ గణనాయక' అనేది ప్రతి గ్రహమంత్ర సారాంశం. 'శ్రీపార్వతీపుత్ర లోకత్రయీ స్తోత్ర' అంటూ దండకం.

''విఘ్నేశ్వర! కొబ్బరిపలుకులు/ చిట్టి బెల్లము నానబ్రాలు

## జ్యేష్ఠాభిషేకం



ప్రతి సంవత్సరం జ్యేష్ఠ మాసంలో జ్యేష్ఠానక్షత్రానికి ముగిసేట్లుగా మూడు రోజులపాటు తిరుమల శ్రీవారికి జ్యేష్ఠాభిషేకం సంపంగి ప్రదక్షిణంలోని కల్యాణ మండపంలో జరుగుతుంది. దీన్నే "అభిదేయక అభిషేకం" అంటారు. తరతరాలుగా అభిషేకాదులతో అత్యంత ప్రాచీనములైన శ్రీ స్వామివారి ఉత్సవమూర్తులు అరిగిపోకుండా పరిరక్షించే నిమిత్తం ఏర్పాటు చేసిన ఉత్సవమే ఇది. ఇది మూడురోజులపాటు నిర్వహించబడుతున్నది.

మొదటిరోజు శ్రీ మలయప్పకు ఉన్న బంగారు కవచాన్ని తీసివేసి, హోమాలు అభిషేకాలు పంచామృత స్నపనతిరుమంజనాదులు జరిగిన తర్వాత శ్రీస్వామివారికి వజ్రకవచం అలంకరించి పురవీథుల్లో ఊరేగిస్తారు. యథాక్రమంగా రెండవ రోజు ముత్యాలకవచ సమర్పణ చేసి ఊరేగిస్తారు. మూడవ రోజు కూడ తిరుమంజనాదులు పూర్తిచేసి, బంగారుకవచాన్ని సమర్పించి ఊరేగింపు చేస్తారు. ఈ బంగారు కవచ సమర్పణ మళ్లీ జ్యేష్ఠాభిషేకంలోనే తీస్తారు. అంత వరకు సంవత్సరం పొడవునా శ్రీవారు బంగారు కవచంతోనే ఉంటారు. ఆర్జిత సేవగా నిర్వహింప బడుతున్న ఈ ఉత్సవంలో భక్తులు పాల్గొనవచ్చు. ఈ సేవలో పాల్గొన్న భక్తులను కవచంలాగా స్వామి రక్షిస్తాడు.

## ఆణివర ఆస్థానం



ప్రతి సంవత్సరం దక్షిణాయన పుణ్య కాలం, కర్కాటక సంక్రాంతి నాడు తిరుమలలో "ఆణివర ఆస్థానం" అనే ఉత్సవం జరుగుతుంది. తమిళుల ఆణిమాసం చివరిరోజున జరిగే ఆస్థానం కనుక దీన్ని "ఆణివర ఆస్థానం" అంటారు. ప్రతి సంవత్సరం జూలై నెలలో ఈ ఆస్థానం జరుగుతుంది.

పూర్వం దేవస్థానం వారి ఆదాయ వ్యయాలు, నిలువలు, మున్నగు సంవత్సర లెక్కలు ఈ ఆణివర ఆస్థానం రోజున ప్రారంభమయ్యేవి. ప్రస్తుతం వర్తమాన లెక్కల ప్రకారం "బడ్జెట్" ఏప్రిల్‌కు మార్పు చేయబడింది. అయినా ఆ ఉత్సవం అలాగే కొనసాగుతూ ఉంది.

ఆరోజు బంగారు వాకిలి ముందు సర్వ భూపాల వాహనంలో శ్రీదేవి, భూదేవులతో శ్రీ మలయప్ప స్వామివారిని వేంచేపు చేస్తారు. మరొక పల్లకిపై విష్వక్సేనుల వారిని వేంచేపు చేసిన పిదప ఘనంగా వస్త్రసమర్పణ, నివేదనలు జరుగుతాయి. పిదప అక్షతారోపణ జరిగిన తర్వాత కార్య నిర్వహణాధికారికి దేవస్థానం బీగాల గుత్తిని తగిలించి హారతి, శఠారులను ఇస్తారు. ఆ తర్వాత ప్రసాద వితరణ జరుగుతుంది.

బంగారు వాకిలి ముందు జరిగే ఆణివర ఆస్థానంలో అర్చకులు, జియ్యంగార్లు అధికారులు దేవస్థానం ఉద్యోగులు మాత్రమే పాల్గొంటారు.

చెరుకు రసంబుల్ నిటలాక్షు నగ్రసుతునకు/ పటుతరముగ విందు చేత ప్రార్థించు మదిన్" అని ప్రార్థన. విఘ్నేశ్వర కథ, ఆధిపత్యం, శమంతక ఉపాఖ్యానం వివరీకరణతో ఇంటిల్లిపాదీ భక్తిపారవశ్యంలో నిమగ్నమవుతారు.

పానకము, వడపప్పు, పనస, మామిడిపండ్లు, దానిమ్మ, ఖర్జూర, ద్రాక్షపండ్లు/ తేనెతో మాగిన తియ్యమామిడిపండ్లు మాకు బుద్ధినిచ్చు/ గణపలికినపుడు జయమంగళం నిత్యశుభమంగళం అంటూ మంగళహారతి.

అదే క్రమంలో అగరుగంధాక్షత. ధూపదీప నైవేద్య తాంబూల పుష్పోప హారములును/ భాద్రపదశుద్ధ చవితిని కుడుములు, ఉండ్రాళ్లు, పప్పు, పాయసము, జున్ను భక్తిమీర/ కోరి పూజింతు.. అంటూ స్వామికి కైమోడ్పులందిస్తారు.

నిత్యమూ పూజలందుకున్న స్వామి జలతత్త్వ ప్రతీక. కనుకనే, నిమజ్జనోత్సవం ఏర్పాటవుతుంది. పలురకాల పత్రి, ప్రతిమలోని మట్టి అంతా నీటిలో కలవడంతో ఔషధగుణాలు అందులో చేరతాయి. ఇదీ ప్రజలందరి ఆరోగ్యభాగ్యానికి ఉపకరించేదీ. విగ్రహాన్ని నీటిలోకి చేర్చేముందు 'శ్రీగణేశం ఉద్యాపయామి... శోభనార్థం పునరాగ మనాయ చ' అని సంకల్పం వహించాలి అందరూ.

స్వామి మన హృదయవిహారి. భక్తసులభుడని గణపతి అథర్వశీర్షోపనిత్, *గణాధిపపంచరత్నం, మూలమంత్రపదమాలా స్తోత్రం, మంత్రప్రభావస్తుతి* తేటతెల్లం చేస్తున్నాయి. గణేశ హృదయ కవచం, నవార్ణ దేవనాయకం ప్రకారం; భాను వినాయకం కావ్య అనుసారం... మహాగణపతిం మనసా స్మరామి. వేదాలు, పురాణాలు, ఆధ్యాత్మిక రచనలనేకం వినాయకస్వామిని 'గణానాం.. త్వా గణపతిం' అని కీర్తించాయి. కీర్తిస్తూనే ఉన్నాయి.

వామనాకారుడి విరాట్ రూపచిత్రణ వినాయక చవితిన అన్నింటా అంతటా దర్శనమిస్తుంటుంది. పరిపూర్ణా! పరబ్రహ్మ స్వరూపా! అని ఊరూవాడా జేజేలు పలుకుతూనే ఉంటుంది ప్రతి ఒక భక్తుని హృది!

*ఓం గణేశాయ నమః*

### శ్రీపదకేళి
### :: 128 - సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 ఉ | పా | 2 ధ్యా | య | 3 ది | నో | త్స | వ | 4 ము |
| దం | | నం | | ష్యం | | | | స |
| 5 కు | బ్జ | | 6 సే | తు | వు | | 7 క | ల |
| డు | | 8 నం | | డు | | 9 తా | | ము |
| | 10 మం | దు | డు | | 11 శ | మి | త | |
| 12 సం | | డు | | 13 వి | | స్ర | | 14 అ |
| 15 పా | ర్శ్వ | | 16 ఫా | లా | క్ష | ము | | జ |
| ద | | 17 పా | | సం | | | 18 అ | |
| 19 న | కు | లు | డు | | 20 కృ | ష్ణా | ష్ట | మి |

శ్రీవారి ఆలయంలో స్వామివారిని 'గోవిందా! గోవిందా!!' అని అనుకొంటూ దర్శించుకోవాలి

సెప్టెంబరు 23న 'వామనజయంతి' సందర్భంగా...

# శ్రీ 'వామన' వైభవం

- ప్రాచార్య శలాకరఘునాథశర్మ, 98660 68542

మన పురాణాలూ ఇతిహాసాలూ వేదం అందించిన జ్ఞానవిజ్ఞానాలను సామాన్యజనాలకు దగ్గరగా తీసుకొని వెళ్ళటానికి ఏర్పడిన వాఙ్మయ దేవాలయాలు, భాగవతంలోని వామన చరిత్రను ఈ పూర్వరంగంతో వ్యాఖ్యానించటం ఈ వ్యాసం లక్ష్యం.

అణోరణీయాన్ మహతో మహీయాన్ ఆత్మా గుహాయాం నిహితోఽస్య జన్తోః।
తమక్రతుం పశ్యతి వీతశోకో
ధాతుః ప్రసాదాన్మహిమానమానమ్. (మహానారాయణము-12.1)

"పరమాత్మ అణువుకంటె అణువు, మహత్తు కంటె గొప్ప మహిమ కలవాడు. అట్టి పరమాత్మ ప్రాణి హృదయగుహలో గుట్టుగా నిలిచియున్నాడు. పరమేశ్వరుని అనుగ్రహము వలన, సంకల్పములేనివాడును, మిక్కిలి గొప్పవాడును అగు ఆ పరమేశ్వరుని సాక్షాత్కారము చేసికొన్నవాడు. సర్వవిధములగు శోకములును లేనివాడగును."

ఇది స్థూలంగా మంత్రార్థము, దీని వ్యాఖ్యాన రూపమే భాగవతమునందలి వామనచరిత్ర.

వామనుడు త్రివిక్రముడగుట, బలిని పాతాళమునకు అణగద్రొక్కుట- అనేవి ఈ వామనచరిత్రలో ముఖ్యాంశములు.

బలి జన్మమును బట్టి రాక్షసజాతికి చెందినవాడు. గొప్పబలముగలవాడు అని వ్యుత్పత్త్యర్థము. బలము దేహమునకు సంబంధించినది. దేహబలము కంటె బుద్ధిబలము గొప్పది. ఎట్లనగా గొప్పబలంకలది అనుకొన్న దేహాన్ని కూడా తన ఇష్టం వచ్చినట్లు త్రిప్పుతున్నది సూక్ష్మదేహమే కదా! (మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారముల మొత్తమే సూక్ష్మదేహము.)

రక్కసుడయిన బలి యజ్ఞం చేశాడు. దేనికోసం అంటే స్థూలంగా, తన బలాన్ని మరింత పెంపొందించుకోటానికి. దాని వలన దివ్యభావాలకు ప్రమాదం సంభవిస్తుంది. పరమేశ్వరుడు దానిని ఉపేక్ష చేస్తే ప్రళయం సంభవిస్తుంది.

అట్టి, అకాలప్రళయాన్ని నిలువరించటానికి మహత్తులతో మహీయమైన రూపాన్ని అణువుకంటె అణువు అయిన రూపంగా చేసుకొని యజ్ఞవేదిక దగ్గరకు వచ్చాడు పరమాత్మ. నిజాన్ని తెలుసుకోలేకపోయాడు బలి. ఏదో చిన్నపిల్లవాడు. అడుక్కోటానికి వచ్చాడనుకున్నాడు. అలా అనుకోవటాన్నే తాత్త్వికంగా 'అజ్ఞానం' అంటారు. "నాయమాత్మా బలహీనేన లభ్యః". ఈ ఆత్మ బలహీనునకు అందనిది- అని ఉపనిషద్వాక్కు. అలా అందకపోవటం వలననే వామనుడు మామూలు పిల్లవాడుగా కన్పించాడు. రాక్షసగురువైన శుక్రాచార్యులవారికి మాత్రం, సత్త్వగుణ పరిపాకస్థితి లేకపోవటం వలన, మహామహిముని దర్శనం ఏకపక్షం మాత్రమే అయింది. వచ్చింది విష్ణువని బలికి చెప్పటమే కాకుండా నీటిధారకు, సూక్ష్మరూపంలో అడ్డుపడ్డాడు. కన్ను పోగొట్టుకొన్నాడు. పరమాత్మ దర్శనసామర్థ్యం పాక్షికం అయిపోయిందని తాత్పర్యం.

## పుష్పపల్లకి



జూలై నెలలో జరిగే ఆణివర ఆస్థానం సందర్భంగా ఆ సాయంత్రం తిరుమల పురవీథుల్లో దేవేరులతో కూడిన శ్రీ మలయప్పస్వామికి పుష్ప పల్లకిలో ఊరేగింపు జరుగుతుంది.

వివిధ పుష్పమాలలతో అత్యంత అందంగా అలంకరింప బడిన పుష్ప రథంలాంటి పల్లకిలో శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీ మలయప్పస్వామివారి తిరువీథ్యుత్సవం చూచి తీరవలసిందే కాని వర్ణించడానికి సాధ్యం కాదు.

ఆర్జిత రుసుమును చెల్లించిన భక్తులు ఈ పుష్పపల్లకి ఉత్సవంలో పాల్గొనవచ్చును. ఈ సేవను చేయించినా, లేదా పుష్ప పల్లకిని దర్శించినా పూర్వజన్మ వాసనలన్నీ నశించి, శాంతి ఏర్పడుతుంది.

బలిచక్రవర్తికి స్వామి పరమాత్మ తత్త్వాన్ని విస్పష్టంగా, వ్యంగ్య వైఖరితో తెలియ జెప్పాడు.



పోతన్న గారు దానిని రమ్యంగా “నేను విశ్వంలోని అంతర్బహిర్వ్యామిని. నేను సర్వతంత్ర స్వతంత్రత కలవాడను. నేను మూడు పోకడలతో నా ఇష్టాన్ని బట్టి పోగలవాడను. కర్మబద్ధులైన వారికి అట్టి శక్తి ఉండదు. అన్ని విద్యలూ నా నుండియే ప్రవర్తించాయి. కనుక కొత్తగా నేర్చుకోవలసినది. ఏమీ లేదు.” అని ఈ విధంగా పరమాత్మ తత్త్వాన్నంతటినీ అణువులలో అణుస్వరూపంగా కానవస్తున్న వామనుడు బలిచక్రవర్తికి తేటతెల్లం చేశాడు. అయినా అజ్ఞాన మోహితునకు బుర్రకెక్కలేదు. తన చక్రవర్తిత్వాహంకారంతోనే వ్యవహరించాడు. అతనికి జ్ఞానం కలిగించటానికి త్రివిక్రమత్వాన్ని ప్రదర్శించాడు. త్రివిక్రమత్వం అంటే **‘మహతో మహీయాన్’**గా బ్రహ్మాండాంత సంవర్ధి కావటమే.

బలికి తలతిరిగిపోయింది. మూడవ అడుగు తిరిగి పోయిన తలమీద పెట్టమని ప్రార్థించాడు. స్వామి అనుగ్రహించాడు. ఆయన అనుగ్రహస్వరూపమే బలిని జ్ఞానబలవంతుణ్ణి చేసింది. శాశ్వతంగా ఆనంద సామ్రాజ్య చక్రవర్తిత్వం పొందటమే ఆ మహాబలం.

ఒకసారి మంత్రవాక్యాల దగ్గరకువద్దాం.

**తమక్రతుం పశ్యతి వీతశోకో, ధాతుః ప్రసాదా న్మహిమానమీశమ్.**

ఇతర సంకల్పాలేవీ లేకుండా, పరమేశ్వరుని అనుగ్రహం వలన, ఆ పరమతత్త్వం త్రివిక్రమత్వ దర్శనం తీసుకొని వీతశోకుడవుతాడు. **వీతశోకత్వమంటే మోక్షమే.**

*ఓం నమో నారాయణాయ*

## పవిత్రోత్సవాలు



వైదిక సంప్రదాయం ప్రకారం జాతాశౌచం, మృతాశౌచం వంటి వేళల్లో ఆలయ ప్రవేశం నిషిద్ధం. అయినా యాత్రీకులవల్ల సిబ్బందివల్ల తెలిసీ, తెలియక ఇలాంటి దోషాలు జరుగుతుంటాయి. ఇలాంటి వాటి వల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా నివారించేందుకు తెలిసీ, తెలియక జరిగే దోషాల పరిహారణార్థం జరిగే పవిత్ర కార్యక్రమమే “పవిత్రోత్సవం”. ఈ పవిత్రోత్సవాలు కేవలం ఆలయశుద్ధి, పుణ్యాహవాచనంలాంటి కార్యక్రమాలు మాత్రం కావు. సంప్రోక్షణకంటె భిన్నమైన క్రియాకలాపంతో కూడినదే ఈ పవిత్రోత్సవం.

పవిత్రోత్సవాలు తిరుమలలో 15-16 శతాబ్దాల వరకు జరుగుతున్నట్లు దాఖలాలున్నాయి. అర్ధాంతరంగా నిలిచిపోయిన ఈ ఉత్సవాలు 1962 నుంచి దేవస్థానం ఉద్ధరించి నిర్వహిస్తున్నది. ఇది మూడు రోజుల కార్యక్రమం. ప్రతి సంవత్సరం శ్రావణ శుద్ధ దశమి ఏకాదశి ద్వాదశి రోజుల్లో కల్యాణమండపంలో జరుగుతున్నది.

మొదటిరోజు పవిత్రాల ప్రతిష్ట, హోమాలు, దేవేరులతో శ్రీమలయప్ప స్వామికి అభిషేకాలు జరుగుతాయి. రెండవ రోజు ఆలయాలలో ఆలయ పరిసరాలలోను ఉన్న మూర్తులకు పవిత్రాల సమర్పణ జరుగుతుంది. మూడవ రోజు పూర్ణాహుతి. మూడురోజులూ సాయంత్రం పూజ తర్వాత శ్రీమలయప్పస్వామి ఊరేగింపబడుతారు. ఆర్జిత రుసుమును చెల్లించి భక్తులు ఈ సేవలో పాల్గొనవచ్చు. ఈ సేవల్లో పాల్గొన్న భక్తులకు వారి వంశంలో ఎవరైనాసరే, తెలిసికాని, తెలియకకాని చేసిన దేవతాపరాధాలు తొలగిపోతాయి. తద్వారా సుఖశాంతులు కలుగుతాయి.

సెప్టెంబరు 13న 'బలరామజయంతి' సందర్భంగా...

## తిరుమంగయాళ్వార్ల పాశురాలలో

# "బలరాముడు"

- డా।। ఈ.ఏ. శింగరాచార్యులు, 98850 03420

"బహూని మే వ్యతీతాని జన్మాని" అని అంటూ శ్రీకృష్ణ భగవానుడు "తన అవతారాలు అనేకం" అని అన్నాడు. ఈ విధంగా ఉండే అనేక భగవదవతారాలలో పది అవతారాలు ప్రధానంగా కీర్తింపబడుతున్నాయి. వీటికే 'దశావతారాలు' అని పేరు. ఈ అవతారాలలో 'బలరామావతారం' ఒకటి. ఈ అవతారం కృష్ణావతారంవలె ద్వాపరయుగాంతంలో సంభవించింది. ఈ అవతారాన్ని మహర్షులు ఇతిహాస పురాణాల లోనూ, ఆళ్వారులు దివ్యప్రబంధాలలోను స్తుతించారు. భగవంతుని దశావతారాలలో ఇది ఎనిమిదవ అవతారంగా పరిగణింపబడుతున్నది. ఈ అవతారంలోని కొన్ని విశేషాలు ఆళ్వారుల దివ్యప్రబంధ సూక్తులలో ప్రస్తావించబడ్డాయి. ముఖ్యంగా తిరుమంగై ఆళ్వార్ల పాశురాలలో ఈ అవతార విశేషాలను గమనిద్దాం.

ఆళ్వార్లలో చివరివారైన తిరుమంగై ఆళ్వారులు 'పెరియతిరుమొళి' అనే ప్రబంధంలోని ఒక దశకంలో భగవంతుని దశావతారాలను కీర్తిస్తూ, ఈ బలరామావ తార వైభవాన్ని ఒక పాశురంలో అనుభవించారు. ఈ పాశురం బలరామమూర్తి స్వరూపరూప గుణలీలా దులను సంగ్రహంగా మనకు తెలుపుతున్నది.



"ఒట్రై క్కుళైయుమ్ నాంజిలుమ్ ఒరుపాల్ తోన్ఱ త్తాన్ తోన్ఱి వెట్రి త్తొళిలార్ వేల్ వేందర్ విణ్ పాల్ శెల్ల వెంజ మత్తు, శెట్ర కొట్రత్తొళి లాన్" (8-8-8)

'ఒక చెవిలో ప్రకా శించే కుండలం, ఒక వైపు నాగలిప్రకాశిస్తూ ఉండగా, బలరాముడై అవతరించి, విజయమే స్వభావంగా కలిగిన వాడై, హలాయుధాన్ని ధరించిన వీరులు

## శ్రీకృష్ణాష్టమి



శ్రీకృష్ణాష్టమి రోజు రాత్రి తోమాల సేవ అనంతరం బంగారువాకిలి వద్ద శ్రీకృష్ణస్వామికి తిరు మంజనం జరుగు తుంది. అదేసమయంలో మరొక పీఠంపై శ్రీదేవి, భూదేవి సమేత ఉగ్రశ్రీనివాసమూర్తిని వేం చేపు చేసి ద్వాదశ తిరువారాధన చేస్తారు. ఈ అభిషేకాలు ఏకాంతంగా నిర్వహి స్తారు. పిదప ఉగ్రశ్రీనివాసమూర్తిని ఆనంద నిలయంలోనికి వేంచేపు చెయ్యగా శ్రీకృష్ణ స్వామికి ఆస్థానం జరుగుతుంది. శయనిం చిన బాలకృష్ణుని రూపంలో ఉన్న స్వామికి నివేదనలు జరిగిన తర్వాత అక్షతా రోపణం జరుగుతుంది.

పిదప శ్రీమద్భాగవతంలోని శ్రీకృష్ణావ తార ఘట్టం పురాణపఠనం జరుగుతుంది. హారతితో ఆస్థానం పూర్తి అవుతుంది.

మరునాడు తెల్లవారు ఝామున బాల కృష్ణుని ఊరేగిస్తూ బాలకృష్ణునికి తైలకాపు చేసిన నూనెను భక్తులకు పంచుతారు. భక్తులు ఆ నూనెను తలలకు అంటుకొని మంగళస్నానాలు చేస్తారు.

పిదప ఆ మధ్యాహ్నం శ్రీమలయప్ప స్వామితోపాటు మరొక పల్లకిపై వెన్నముద్ద కృష్ణుడు తిరుమల వీధుల్లో ఊరేగుతుం డగా ఉట్లఉత్సవం జరుగుతుంది. ఉట్లు కొట్టడమనే వేడుక తిరుమలలో ఘనంగా జరుగుతుంది.

శ్రీవారు ఆలయంలో ప్రవేశించడంతో కృష్ణాష్టమి వేడుకలు ముగుస్తాయి.

## దీపావళి ఆస్థానం



దీపావళి పండుగనాడు బంగారు వాకిలిముందు శ్రీ మలయప్పస్వామి వారికి ఆస్థానం జరుగుతుంది.

ఆలయంలో యథాకార్యక్రమంగా మొదటిఘంట నివేదన పూర్తి అయిన తర్వాత బంగారువాకిలి ముందు సర్వ భూపాల వాహనంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీ మలయప్ప స్వామివారిని వేంచేపు చేస్తారు. మరొక పీఠంపై విష్వ క్సేనులవారిని వేంచేపు చేసిన తర్వాత ఘనంగా నూతనవస్త్ర సమర్పణ, నివేదనలు జరిగిన తర్వాత అక్షతారోపణ చేస్తారు. చివరగా ఘనంగా హారతులు సమర్పించి తీర్థచందన, శఠారి వితరణతో దీపావళి ఆస్థానం ముగుస్తుంది.

## ధనుర్మాసం-తిరుప్పావై

తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ఏడాదిపొడవునా తెల్లవారు జామున "సుప్రభాతసేవ" జరుగుతుంది. కాని ధనుర్మాసంలో ఒక్కనెలపాటు మాత్రం సుప్రభాతానికి బదులుగా "తిరుప్పావై" పఠనం జరుగుతుంది. గోదాదేవి తాను ద్వాపరయుగం నాటి గోపికగా భావించి పాడిన 30 పాశురాలను రోజుకొకటి వంతున గానం చేస్తూ విన్పిస్తారు. ఈ సందర్భంలో భోగశ్రీనివాసమూర్తికి కాక వెన్నముద్ద కృష్ణునికి ఏకాంతసేవ జరుగుతుంది. ఈ తిరుప్పావై పఠనం పూర్తిగా ఏకాంతంగా జరుగుతుంది.

ఈ ధనుర్మాసంలో శ్రీవేంకటేశ్వరస్వామి వారి సహస్రనామార్చనలో తులసికి బదులుగా "బిల్వదళాల్ని" ఉపయోగిస్తారు.

స్వర్గం పొందేటట్లుగా యుద్ధంలో వారు జయించే వీరకృత్యాలను కలవాడు, బలరాముడు' అని ఈ పాశురంలో తిరుమంగైయాళ్వార్లు అంటున్నారు.

ఈ పాశురం బలరాముని స్వరూపస్వభావాలను, గుణాలను అందంగా తెలియజేస్తున్నది. బలరాముడు ఒక చెవికిమాత్రం కుండలాన్ని ధరిస్తాడు. ఈ కుండలాన్ని వరుణుడు బలరామునకు బహుమానంగా పంపినట్లు శ్రీవిష్ణుపురాణం మనకు తెలియజేస్తున్నది. ఈ విషయం ఆ పురాణంలోని పంచమాంశంలోని 25వ అధ్యాయంలో బలరాముడు యమునానదిని తన నాగలితో బలాత్కారంగా ఆకర్షించిన సందర్భంలో గోచరిస్తుంది. వరుణుడు శిరోభూషణంగా అలంకరించుకోదగిన కలువ పూవును, ఒక కుండలాన్ని, వాడని పద్మాల మాలను, సముద్రవర్ణాన్ని కలిగిన వస్త్రాలను పంపగా, వాటిని లక్ష్మీదేవి తీసుకుని వచ్చి బలరామునకు ఇచ్చినట్లుగా శ్రీవిష్ణుపురాణం తెలుపుతున్నది.

*"అవతంసోత్పలాంచారు గృహీత్వైకం చ కుండలమ్, వరుణప్రహితాం చాస్మై మాలా మమ్లానపంకజామ్, సముద్రాభే తథా వస్త్రే నీలే లక్ష్మీ రయచ్ఛత"* (5-25-16) అనేవి ఆ శ్లోకాలు.

పైన ప్రస్తావించిన ఆళ్వార్ల పాశురంలో బలరాముని ఆయుధం నాగలి అని కూడా సూచింపబడింది. "వెట్రత్తొళిలార్" (జయశీలుడు) అని అన్నందున బలరామమూర్తి యొక్క జ్ఞానం, బలం అనే గుణాలు సూచింపబడ్డాయి.

బలరాముడు వసుదేవుని ఇంకొక భార్య అయిన రోహిణిగర్భం నుండి జన్మించినవాడు. ఇతడు అదిశేషాంశను కలిగినవాడు అని శ్రీవిష్ణుపురాణం, శ్రీభాగవతం, హరివంశం మొదలైన పురాణాలు తెలుపుతున్నాయి. శ్రీవిష్ణుపురాణం పంచమాంశంలోని ప్రథమాధ్యాయంలో, సాక్షాత్తు భగవానుడే యోగనిద్రతో ఈ విషయాన్ని తెలియజేస్తూ- "శేషాఖ్యోంశః తతో మమ, అంశాంశేనోదరే తస్యాః సప్తమః సంభవిష్యతి" (5-1-73) (నా శేషాంశ యొక్క అంశగా దేవకి కడుపున సప్తమగర్భంగా ఏర్పడగలడు)అని

## మే నెల క్విజ్-48 సమాధానాలు

| | | |
|---|---|---|
| 01)కుమారస్వామి | 06)కచ్ఛపి | 11)పుస్తకం |
| 02)మహాసరస్వతి | 07)ఉత్తరాభాద్ర | 12)కుంతీదేవి |
| 03)వేదవ్యాసుడు | 08)వాయుదేవుడు | 13)అమ్మ |
| 04)వినాయకుడు | 09)భృగుమహర్షి | 14)మహతి |
| 05)శయనఏకాదశి | 10)విఖనసమహర్షి | 15)వీణ |

**సరైన సమాధానాలు వ్రాసినవారు-**

01) ఎస్.శ్రీనివాసులు, మహబూబ్ నగర్; 02) వెంట్రప్రగడ ఋషిత సౌమ్య, ఉయ్యూరు 03) పైళ్ళ జాహ్నవి, ఖమ్మం; 04) డి.ముక్తీశ్వర్, విజయవాడ; 05) రిత్విక్ సాయి, ఖమ్మం; 06) కాండూరి శ్రీచరణ్, కోదాడ; 07) డి.అర్పిత, విజయవాడ; 08) ఎస్.సిద్ధార్థ సాయి, కుప్పం

అన్నాడు. ఈ గర్భాన్నే, భగవంతుని ఆజ్ఞానుసారంగా, యోగమాయ దేవకి గర్భంనుండి ఆకర్షించి, రోహిణి గర్భంలో ప్రవేశపెట్టింది అని కూడా మనకు పురాణాలు తెలుపుతున్నాయి. అందుచేత బలరాముడు ఆదిశేషాంశను కలిగినవాడు.

సంకర్షణ స్వరూపుడైన ఆదిశేషునకు గల గుణాలు అన్నిటిలో 'జ్ఞానం, బలం' అనే రెండు గుణాలు ప్రధానమైనవి. ఈ గుణాలే బలరామావతారంలో కూడా వ్యక్తమయ్యాయి. అందుచేతనే బలరామునకు బలరాముడని, బలదేవుడనే పేర్లు కలిగాయి. పైన ఉదాహరించిన ఆళ్వార్ల పాశురంలో "వెట్రి త్తోళిలాన్" అనే ప్రయోగం ద్వారా ఈ రెండు గుణాలు సూచింపబడ్డాయి. జయశీలునకు జ్ఞానం, బలం రెండు ఆవశ్యకాలు కదా. ఆదిశేషుడు అంశతో అవతరించిన బలరాముడు తెల్లని వర్ణంతో ఉంటాడు. ఈ విషయాన్ని కూడా తిరుమంగై ఆళ్వారులు తమ సూక్తులలో సూచించారు. పెరియ తిరుమొళి ప్రబంధంలో "వళై కొండ వణ్ణత్తన్"(6-9-3) అని, "వళైవణఙ్కు" (8-5-2) అని, "వళై వణ్ణ నన్ మామేని" (10-7-4) "(శంఖవర్ణం వంటి తెల్లని వర్ణాన్ని కలిగిన బలరాముడు) అని పలుమార్లు ఈ విషయాన్ని ప్రస్తావించారు.

ఈ ఆళ్వారుల సూక్తిలో వేరొక విలక్షణమైన అంశం కూడా గోచరిస్తున్నది. "మైన్నంబు వేఙ్కణ్ మడవాళ్ మున్న ప్పెట్ర వళై వణ్ణ నన్ మామేని" (10-7-4) అనే ప్రయోగాన్ని వ్యాఖ్యానిస్తూ శ్రీకృష్ణ సూరి అనే వ్యాఖ్యాత "కాటుకను అలంకరించుకున్న హలాయుధంవంటి నేత్రాలను కలిగినదై, ఆత్మగుణాలను కలిగినదైన దేవకీదేవి కన్న బలరాముడు శంఖం వంటి వర్ణాన్ని కలిగినవాడు, గొప్ప రూపాన్ని కలిగినవాడు" అని వివరించారు. దీనివల్ల ఆళ్వారులు బలరాముని రోహిణీదేవి కుమారుడుగానే కాకుండా, దేవకీదేవి కుమారుడుగా కూడా భావించారని ఏర్పడుతున్నది. మొదట, ఏడునెలల పాటు దేవకి కడుపులో ఉన్న గర్భాన్ని యోగమాయ భగవంతుని ఆజ్ఞానుసారంగా రోహిణీదేవిగర్భంలో ప్రవేశపెట్టినది. అయితే, మొదట బలరాముని జన్మకు కారణమైనది దేవకియే కనుక, ఈ విధంగా ఆళ్వార్లు భావించి ఉండవచ్చు.

## గోదా పరిణయోత్సవం

**ధనుర్మాసంలో చివరిరోజున కనుమపండుగ నాడు శ్రీస్వామివారి వక్షఃస్థలలక్ష్మిని గోదాదేవిగా భావించి గోదాపరి ణయోత్సవం నిర్వహిస్తారు. ఆ రోజు తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలోని (ఆండాళ్) గోదాదేవి ధరించిన పూలమాలను తిరుమలకు తీసికొని వచ్చి శ్రీస్వామివారికి ధరింపజేస్తారు.**

## వైకుంఠ ఏకాదశి




**ధనుర్మాసంలో శుద్ధ ఏకాదశిని వైకుంఠ ఏకాదశి అంటారు. వైకుంఠ ఏకాదశి తెల్లవారు జామున వైకుంఠ ద్వారం తెరవబడి, తిరిగి వైకుంఠ ద్వాదశి తెల్లవారు జామున మూసివేయబడుతుంది. కానీ, భక్తలోకాన్ని అనుగ్రహించడానికి 'వైకుంఠద్వారాన్ని' గత కొన్ని సంవత్సరాలుగా తి.తి.దే. 10 రోజుల పాటు తెరచి ఉంచుతున్నారు. వైకుంఠ ఏకాదశి రోజున శ్రీదేవి, భూదేవి, సమేతుడైన శ్రీమలయప్పస్వామి సర్వాభరణ భూషితుడై తిరుమల తిరువీథులలో స్వర్ణరథంలో ఊరే గింపబడిన తర్వాత ఆలయంలో ఆస్థానం జరుగుతుంది.**

## పుష్పయాగం



**ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాల అనంతరం కార్తికమాసంలో శ్రవణ నక్షత్రం రోజున శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీమలయప్ప స్వామివారికి "పుష్పయాగం" జరుగుతుంది. 15వ శతాబ్దం నాటికే తిరుమలలో జరుగుతూ, అర్ధాంతరంగా నిలిచిపోయిన ఈ పుష్పయాగాన్ని 1980 నవంబరు 14 నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం పునరుద్ధరించి నిర్వహిస్తున్నది.**

**పుష్పయాగం జరిగే రోజు యథాక్రమంగా రెండు అర్చనలు రెండునివేదనలు పూర్తి అయిన తర్వాత శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామి కల్యాణ మండపానికి వేంచేస్తారు. హోమాలు, స్నపన తిరుమంజనాదులు నిర్వహిస్తారు. పిదప ఆ మధ్యాహ్నం శ్రీస్వామివారికి వివిధరకాలయిన పుష్పాలతో పుష్పార్చన జరుగుతుంది. ఈ పుష్పాలు శ్రీవారి హృదయం వరకు రాగానే వీటిని తొలగిస్తారు. మళ్లీ పుష్పార్చన జరుగుతుంది. ఇలా 20 మార్లు జరుగుతుంది. పిదప ఘనంగా హారతి సమర్పిస్తారు.**

**ఆర్జిత రుసుమును చెల్లించిన భక్తులు కూడ ఈ పుష్పయాగంలో పాల్గొనవచ్చు. పుష్పయాగంలో పాల్గొన్న భక్తులకు పూర్వ జన్మల వాసనలు తొలగడమేగాక, సర్వ రోగాలు నశిస్తాయి. తద్ద్వారా సుఖశాంతులతో ప్రశాంతంగా జీవనం సాగుతుంది.**

## పారువేట ఉత్సవం

ప్రతి సంవత్సరం కనుమ పండుగరోజు తిరుమలలో పారువేట ఉత్సవం జరుగుతుంది. ఆరోజు ఆలయంలో రెండవ నైవేద్యం ముగిసిన తర్వాత శ్రీ స్వామి వారు పంచాయుధాలను ధరించి వేటకు బయలుదేరుతారు. మరొక పల్లకిపై శ్రీకృష్ణ స్వామి వేంచేస్తారు.

శ్రీవారిఆలయానికి వాయవ్యమూలలో ఒక మైలు దూరంలో ఉన్న పారువేట మండపానికి వేంచేసి సాయంత్రం వరకు అక్కడనే ఉండి శ్రీస్వామివారు వేట కార్యక్రమంలో పాల్గొంటారు. పారువేటలో తాళ్ల పాక వారి సేవలందుకొంటాడు. శ్రీకృష్ణ స్వామి ఆ పక్కనేవున్న సన్నిధి గొల్లల విడిదికి వెళ్లి వారి అర్చనలందుకొంటాడు.

సంగీత ధార్మిక కార్యక్రమాలతో ఘనంగా జరిగే పారువేట ఉత్సవంలో వేలాదిమంది పాల్గొంటారు. ఆ సాయంత్రం మళ్లీ యథా క్రమంగా శ్రీవారు ఆలయానికి వేంచేస్తారు. ప్రతి మూడవ ఏట జరిగే నవరాత్రి బ్రహ్మోత్సవానంతరం కూడ ఇలాగే "పారువేట ఉత్సవం" జరుగుతుంది. పారువేటలో శ్రీవారిని దర్శించిన వారికి ఇంద్రియనిగ్రహం కలుగుతుంది.



## పుష్కరిణి హారతి

ఏడాది పొడవునా, ప్రతినిత్యం, సాయంత్రం, శ్రీ స్వామివారి ఉత్సవం పూర్తి అవుతున్న సమయంలో తూర్పు దిక్కున శ్రీవారికి ఇచ్చిన నక్షత్ర, కర్పూర హారతులను "స్వామిపుష్కరిణి"కి సమర్పిస్తారు.

# శ్రీవారి వైద్య సేవ-మానవసేవకు శ్రీనివాసుని దివ్య వేదిక

"మానవసేవయే మాధవసేవ" అనే భారతీయ సనాతన ధర్మసూత్రాన్ని ఆచరణలో ప్రతిష్ఠిస్తూ తిరుమల తిరుపతి దేవస్థానాలు ప్రారంభించిన "శ్రీవారి వైద్య సేవ" సేవా కార్యక్రమం ధర్మం, భక్తి, వైద్యం, సేవాభావాల సమన్వయానికి 2026, జూన్ 5 శుక్రవారం నాడు నూతన నాంది పలికింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందూ వైద్యనిపుణుల జ్ఞానాన్ని, అనుభవాన్ని శ్రీవారి భక్తుల ఆరోగ్యరక్షణకు వినియోగించాలనే మహోన్నత సంకల్పానికి ఇది ప్రతీక.

రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవనీయులు శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారి మార్గదర్శకత్వంలో, తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఎం.రవిచంద్ర గారి ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న వైద్య నిపుణులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని తి.తి.దేవస్థాన ఆసుపత్రుల్లో స్వచ్ఛంద సేవలు అందించవచ్చు. సూపర్ స్పెషాలిటీ వైద్యులకు మూడురోజులు, ఎం.బి.బి.ఎస్., వైద్యులకు ఏడురోజులపాటు సేవచేసే అవకాశం కల్పించడంతో పాటు, వారికి తిరుమల, తిరుపతిలో వసతి, భోజన సౌకర్యాలను తి.తి.దే. అందిస్తోంది.

అశ్విని ఆసుపత్రి, స్విమ్స్, బర్డ్, ఆయుర్వేద ఆసుపత్రి, శ్రీ పద్మావతి చిన్నపిల్లల ఆసుపత్రి తదితర తి.తి.దే. వైద్య సంస్థల్లో ఈ సేవలు అందించబడనున్నాయి. డిజిటల్ వేదిక ద్వారా నమోదు ప్రక్రియను సరళీకరించడం ద్వారా ఆధునిక సాంకేతికతను సేవా కార్యక్రమాలతో సమన్వయం చేసిన ఆదర్శంగా ఈ కార్యక్రమం నిలుస్తోంది.

"వైద్యో నారాయణో హరిః" అనే భారతీయ భావనకు అనుగుణంగా రోగిలో భగవంతుని దర్శించి సేవ చేయడమే నిజమైన వైద్యధర్మం. తిరుమలలో శ్రీవారి సన్నిధిలో వైద్య సేవ చేయడం వైద్యులకు వృత్తిధర్మంతో పాటు దైవకైంకర్యం కూడా. ఇప్పటికే అన్నప్రసాదం, ధర్మ ప్రచారం, విద్య, గోసంరక్షణవంటి సేవా కార్యక్రమాలతో సమాజానికి విశిష్ట సేవలందిస్తున్న టీటీడీ, ఈ వినూత్న కార్యక్రమం ద్వారా ప్రజారోగ్యరంగంలోనూ సేవాధర్మాన్ని మరింత విస్తరించింది.

హిందూ మతానికి చెందిన ఆసక్తిగల వైద్య నిపుణులు ఆన్‌లైన్ ద్వారా తి.తి.దే. వెబ్ సైట్ https://ttdevasthanams.ap.gov.in/srivari-seva/instructions లో తమ స్లాట్‌ను బుక్ చేసుకుని ఈ కార్యక్రమంలో పాల్గొనగలరు.

భక్తి, కరుణ, సేవ, సమాజహితం అనే భారతీయ విలువలకు ప్రతిరూపమైన "శ్రీవారి వైద్య సేవ" దేశ విదేశాల్లోని వైద్య నిపుణులను సేవాస్ఫూర్తితో ఏకతాటిపైకి తీసుకువచ్చి, అనేకమంది భక్తులకు ఆరోగ్యాన్ని, ఆశను, ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించాలని శ్రీ వేంకటేశ్వరస్వామివారిని ప్రార్థిద్దాం.

॥ సర్వే సంతు నిరామయాః ॥



శ్రీవేంకటేశ్వర లీలలు

# శ్రీవారి సేవా మాహాత్మ్యం

- శ్రీమతి ఏ.వీ.ఎస్.లలిత

నాకు శ్రీవారిసేవచేసే భాగ్యం 25-06-2026 నుండి 01-07-2026 వరకు లభించింది. అన్నదానం హాలు-1లో ఉ.8.30-సా॥4.00వరకు సేవ వేశారు. ఉ.8.00 గం॥లకు వెళ్లి స్వామివారికి నైవేద్యం పెట్టే సమయంలో గోవిందనామాలు, స్తుతులు, కీర్తనలు ఆలపించి, ఉ.8.30 నుండి సా.4.00వరకు శ్రద్ధాభక్తులతో నా సేవావిధిని చేశాను. అక్కడున్న సేవకులు/ ఉద్యోగులు చాలా సహకరించారు. 29-06-2026 రోజున స్వామి సన్నిధిలో ఉ.8.30 నుండి మ.12.00వరకు శ్రీవారిసేవ వేశారు. ఆ స్వామి కరుణతో నాకు సన్నిధిలో శ్రీవారిసేవ చేసే మహద్భాగ్యం దక్కింది. వాతావరణ మార్పువల్ల ఆరోగ్యం కొంత సన్నగిల్లినా, ఆ స్వామి తన భక్తులను చల్లగా చూస్తాడనడానికి నేనే సాక్షి. చక్కగా నా విధి నేను నిర్వర్తించాను. మరల ఆలయ సేవ 30-06-2026న రా.10.00 నుండి చివరి దాకా దక్కింది. నా ఆశ్చర్యానికి అవధుల్లేనట్టయింది. ఏడురోజుల్లో రెండు రోజులు స్వామిసన్నిధిలో సేవ దొరకడం అదృష్టమే!

శ్రీవారి మాహాత్మ్యం ఏంటంటే "దైవం మానుషరూపేణ" అన్నట్లు రా.10.00 గం॥లకు హుండీ దగ్గర సేవ చేస్తున్న నన్ను టిటిడి ఉద్యోగి ఒకరు స్వామి సన్నిధిలో చేయమని లోపలికి తీసుకెళ్లారు. నేను ఆనందడోలికలలో తేలియాడుతున్న సమయంలో చటుకున్న ఒక తలపు మెదలింది. అది "ఆ వేళ నా పుట్టిన రోజు" అందుకే స్వామి తన సన్నిధిలో సేవకు పిలిచాడనుకున్నాను. ఇంకా అత్యద్భుత సంఘటన ఏంటంటే 29-06-2026 రోజున సన్నిధిలో సేవ చేస్తున్నప్పుడు ఒక బాలుడు లైన్‌లో పడి పోయాడు. నేను ఆ బిడ్డను చూడబోయి ముందుకు వెళ్తూ బల్లమీద కాలు సరిగ్గా మోపక నేనూ కింద పడిపోయాను, స్వామిదయతో ఇద్దరికీ ఏమి కాలేదు. 30-06-2026 రోజున నన్ను సన్నిధిలో చేయమని తీసుకెళ్లిన అతను బల్ల కూడా సరిగ్గా ఉందోలేదో తన చేతులతో చూసి, అప్పుడు నన్ను సేవ చేయమన్నారు. అతనెవరో నాకు తెలియదు, నేను క్రితం రోజున పడిపోయానని ఎవ్వరూ చెప్పలేదు.




"నీ రూపులనంతాలు, నీ లీలల నంతాలు, నీవు వసంతుడవు వేంకటేశా" యని ఊరికేనే అన్నారా పెద్దలు?" నీదు నీ నామము నాలికనుండగ తలకొని యితరము పలుకనేల? తిరుమల వాసుడు వేంకటేశునియందు నమ్మకము ఉంచిన మన జీవితం మధురానంద మయం. నేను చేసుకున్న పూర్వజన్మ సుకృతమేమోగాని, అన్ని గంటలు స్వామి సన్నిధిలో చేసే మహద్భాగ్యం కలిగింది రెండు రోజుల్లో. నా జన్మ ధన్యం.

## తెప్పోత్సవాలు

ప్రతిఏటా శ్రీస్వామి పుష్కరిణిలో ఫాల్గుణ పూర్ణిమకు పూర్తి అగునట్లుగా ఐదురోజుల పాటు తెప్పోత్సవాలు జరుగుతాయి.

1468 సం॥ నాటికే తెప్పోత్సవాలు జరుగుతున్నట్లు తెలుస్తున్నది. తాళ్లపాక అన్నమయ్య కూడ తెప్పోత్సవాలను ఘనంగా వర్ణించాడు. కాలాంతరంలో నిలిచిపోయిన ఈ తెప్పోత్సవాలు 1921 లో పునరుద్ధరింపబడినాయి. ప్రస్తుతం ఐదురోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో మొదటిరోజు ఫాల్గుణశుద్ధ ఏకాదశిన శ్రీసీతారామలక్ష్మణులు, రెండవ రోజు ద్వాదశిన రుక్మిణీ శ్రీకృష్ణులు పాల్గొంటారు. ఇక మూడవ రోజు త్రయోదశి నుండి పున్నమి వరకు మూడురోజులపాటు శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీమలయప్ప స్వామి తెప్పోత్సవంలో పాల్గొంటారు.

## రథసప్తమి



ప్రతి సంవత్సరం మాఘ శుద్ధసప్తమి "సూర్యజయంతి" నాడు తిరుమలలో రథ సప్తమి పేరుతో ఉత్సవం జరుగుతుంది. ఆ రోజు శ్రీస్వామివారు సూర్యోదయం మొదలుగా సూర్యాస్తమయం వరకు ఏడు వాహనాల్లో విహరిస్తారు. సూర్యప్రభ వాహనం, చిన్న శేషవాహనం, గరుడ వాహనం, హనుమద్వాహనం, కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం, చంద్ర ప్రభ వాహనం ఇలా ఏడు వాహనాల్లో శ్రీ మలయప్పస్వామి దర్శనమిస్తాడు. మధ్యాహ్నం చక్రస్నానం కూడా జరుగు తుంది. రథసప్తమి వేడుకలను అర్ధ బ్రహ్మోత్సవమని, ఒకనాటి బ్రహ్మోత్సవ మనీ అంటారు.

చిత్ర కథ

# గోవర్ధనగిరిధారి

కథ- శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు
చిత్రాలు- శ్రీ కె.ద్వారకనాథ్





అంతా అల్లకల్లోలమయింది. యాదవుల అందరి ప్రార్థనని విని కరుణించాడు శ్రీకృష్ణుడు.
వెంటనే గోవర్ధనగిరిని తన ఎడమచేతి చిటికెన వేలి మీద గొడుగులాగా నిలిపాడు కన్నయ్య.
అందరూ కొండ కిందకి రండి! రండి!!
ఏడు రోజుల తర్వాత ఇంద్రునికి కనువిప్పు కలిగింది. తత్త్వం బోధపడింది. వర్షం ఆగింది. శ్రీకృష్ణుని శరణు వేడాడు.
కృష్ణం వందే దేవదేవమ్!
దేవా! మమ్మల్ని మన్నించు. ధర్మంగా ప్రవర్తిస్తాం.
ఇటువంటి తప్పు ఎప్పుడూ చెయ్యం!
శ్రీకృష్ణుడు దయతో ఇంద్రుని మన్నించాడు.
ఇంద్రా! గర్వం అహంకారం అనర్థానికి కారణం అవుతుంది
దేవతలు శ్రీకృష్ణుని మీద పూలవాన కురిపించారు. గోవర్ధనగిరిని యథాస్థానంలో ఉంచాడు గోవర్ధనగిరిధారి.
యాదవులు కేరింతలు కొడుతూ ఆలమందలతో బృందావనానికి తరలివెళ్లారు.
సర్వే జనాః సుఖినో భవన్తు!!

# క్విజ్ 50

01) 'వేదఘోష' దేనిని ప్రేరేపిస్తుంది? జ)..........

02) మానవజీవితానికి సార్థక్యం దేని వలన కలుగుతుంది? జ)..........

03) స్వామివారిని మేలుకొలపడాన్ని ఏమంటారు? జ)..........

04) స్వామివారి సన్నిధిలో చేసే ప్రబంధ పారాయణాన్ని ఏమంటారు? జ)..........

05) స్వామివారికి సోమవారం జరిగే పూజ? జ)..........

06) తిరుమోగూర్‌లో వెలసియున్న స్వామిపేరు? జ)..........

07) 'కృష్ణ' అంటే ? జ)..........

08) దేహబలముకన్నా ఏది గొప్పది? జ)..........

09) వీతశోకత్వమనగా ఏవి? జ)..........

10) ధనుర్మాసంలో స్వామివారిని జరిగే పఠనం? జ)..........

11) ఆదిశేషునికి గల రెండు ప్రధాన గుణాలు? జ)..........

12) ధనుర్మాసంలో వచ్చే ఏకాదశి? జ)..........

13) స్వామివారికి నిత్యం సమర్పించే పుష్పమాలా కార్యక్రమాన్ని ఏమంటారు? జ)..........

14) అర్చకులకు ప్రతిరోజూ శ్రీనివాసుడు కొలువులో ఏమి దానం చేస్తారు? జ)..........

15) స్వామివారి నేత్రదర్శనం వారంలో ఎప్పుడు జరుగుతుంది? జ)..........

## నియమ నిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.

02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.

03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు వ్రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.

04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.

05) జవాబులు చేరాల్సిన చివరితేది **25-09-2026**.

06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా వ్రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.

07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.

08) క్విజ్‌కి సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వ బడదు.

09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా వ్రాసి పంపాలి.

10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే వ్రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో వ్రాయకూడదు.

11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోని వ్యాసాల్లోనే ఉన్నాయి. వెతికి వ్రాయండి.

చందాసంఖ్య: .......... వయస్సు: ..........

పాఠశాల: .......... తరగతి: ..........

పేరు: ..........

చిరునామా: ..........

..........

..........

.......... పిన్‌కోడ్: ..........

ఫోన్ సంఖ్య: ..........

## జవాబులు చేరాల్సిన చిరునామా

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 507, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం-** మాసారంభంలో మృష్టాన్నభోజనం, విందువినోదాలు, ధైర్యం, ప్రణాళికతో కార్య జయం, విద్యార్థులు రాణిస్తారు. ఆదాయానికి మించిన ఖర్చులు.



**వృషభం-** మాసారంభంలో ప్రతిబంధకముల వలన భయము మాసాంతములో శత్రుజయము, సౌమ్య స్వభావాన్ని అలవరచుకోవడం, పుష్ప గంధ మృష్టాన్న భోజనములు, కృషి వాణిజ్య భూలాభములు కలుగును.



**మిథునం-** క్రీడలలో రాణింపు, హాస్య సంభాషణలు, ఇతరులను మెప్పించి అందరికీ ఆమోద యోగ్యమైన పరిష్కారం చేస్తారు. ఆదాయమార్గాలు కనిపిస్తాయి. ఆర్థికవికాసం వస్తుంది.



**కర్కాటకం-** కొత్తగా వ్యాపారాలు ప్రారంభించే వారికి కలిసివచ్చే కాలం, బ్యాంకు బ్యాలన్స్ పెరుగుతుంది. విదేశీ విద్య లేదా ఉద్యోగం కోసం ప్రయత్నించే వారికి ఈ సమయం కలిసి వస్తుంది.



**సింహం-** కళలు, అందం, వినోదాల కోసం అధిక ధనవ్యయం. ఇతరులను ప్రేమపూర్వకంగా ఆదరిస్తారు. అందం, ఆకర్షణ, సృజనాత్మకతతో ఆదాయం, బహుమతులను సంపాదిస్తారు.



**కన్య-** వ్యక్తిగత, వృత్తిపరమైన జీవనం బాగుంటుంది. భవిష్యత్తుకు బలమైన పునాదిని వేస్తారు. తల్లిదండ్రులతో సమన్వయం, స్థాన మార్పుకు అవకాశం.



**తుల-** ఆర్థికంగా కూడా మంచి ఫలితాలు ఉంటాయి. ఆదాయం పెరిగే అవకాశం ఉంది. సంతోషంగా ఉంటారు.



**వృశ్చికం-** జీవనంలో కొత్త ఆశలు, ఒంటరిగా సమయం గడపడానికి మక్కువ. కళాత్మక, సృజనాత్మక విషయాలను ఆనందిస్తారు.



**ధనుస్సు-** విద్యార్థులకు జ్ఞాన పురోగతి, ఉద్యోగ పరీక్షలలో నెగ్గి ముందునుంచే ఆదాయాన్ని కూడా పొందుతారు. మానసికంగా, శారీరకంగా, బలంగా స్వస్థత.



**మకరం-** ప్రమాద సూచన. ప్రయాణంలో జాగ్రత్త అవసరం. జీవిత భాగస్వామి, కుటుంబ సభ్యులతో సంబంధం సామాన్యం. కొన్ని అనవసరఖర్చులు చేస్తారు.



**కుంభం-** స్వతంత్రంగా ఉండటానికి ఆసక్తి చూపుతారు. ఆధిక్య స్వభావం, వ్యాపారంలో పోటీని ఎదుర్కొంటారు. సృజనాత్మకంగా వ్యాపారాన్ని విస్తరిస్తారు. పనిచేసేచోట తోటి ఉద్యోగులతో ఘర్షణలు మానుకోవాలి.



**మీనం-** ఇతరులచే దూషణకు గురి అవుతారు. శ్రమించే గుణం కలిగి, బుద్ధి కుశలతతో ధనం సంపాదిస్తారు. స్త్రీ కారణంగావచ్చే సంపద విశేషంగా లాభించగలదు.

**శ్రీనివాసా గోవిందా! శ్రీవేంకటేశ గోవిందా!!**
**భక్తవత్సల గోవిందా! భాగవతప్రియ గోవిందా!!**

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :

(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పనిసరి)

సెల్ నెం.

**2.** కావలసినభాష :

తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐

హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

**3.** సంవత్సరచందా : ☐ రూ.240/-

జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

**4.** విదేశాలకు సంవత్సరచందా : ☐ రూ.1030/-

**5.** చందా పునరుద్ధరణ :

(అ) చందానెంబరు :

(ఆ) భాష :

**6.** చెల్లించిన మొత్తం :

డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :

.............................................................. తేది :..................

ప్రదేశం :

తేది :

చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి' మ్యాగజైన్, తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.

2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# శ్రీపదకేళి

128



**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

**అడ్డం** 1)సెప్టెంబరు '5' ప్రత్యేకత (9); 5)శ్రీకృష్ణుడు అనుగ్రహించిన స్త్రీ(2); 6)వంతెన(3); 7)స్వప్నము(2); 10)బుద్ధి హీనుడు(3); 11)శాంతి పొందుట(3); 15)భాద్రపదశుద్ధ ఏకాదశి(2); 16)మూడవకన్ను గల ప్రదేశము(4); 19)పాండవులలో ఒకడు(4);

**నిలువు** 1)భృగువంశమువాడు, గౌతముని శిష్యుడు(4); 2)ఎప్పుడు భగవంతుని గూర్చి ఇది చేయాలి(2); 3)దుష్యంతుని తమ్ముడు(4); 4)మునులను అపహాస్యం చేస్తే యాదవకులంలోఇది పుట్టింది(4); 8)యశోద భర్త(3); 9)చీకటి(4); 12)ఆర్జన(4); 13)అందము లేక హొయలు(3); 14)భాద్రపద బహుళ ఏకాదశి(2); 17)క్షీరము(2); 18)సంస్కృతంలో ఎనిమిది సంఖ్య(2); 20)శ్రావణ బహుళ అష్టమి(4)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.



Printed by Sri R.V.Vijaya Kumar, B.A., B.Ed., and Published by Dr.V.G.Chokkalingam, M.A., Ph.D., P.G.Diploma in JMC., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D., P.G.Diploma in JMC



17-07-2026న 'ఆణివర ఆస్థానం' సందర్భంగా తమిళనాడు శ్రీరంగం శ్రీరంగనాథ స్వామి వారి ఆలయం నుండి తిరుమల స్వామివారికి తమిళనాడు దేవదాయశాఖ అధికారులు, తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి మరియు ఇతర తి.తి.దే. అధికార్ల సమక్షంలో 'పట్టు వస్త్రాల సమర్పణ' గావిస్తున్న దృశ్యం.



03-07-2026న తిరుపతి శ్రీవకుళమాత ఆలయంలో 'అక్షర గోవిందం-అన్నప్రాశనం' కార్యక్రమాన్ని తి.తి.దే. అధ్యక్షులు శ్రీ బి.ఆర్.నాయుడు, తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ముద్దాడ రవిచంద్ర, ఐ.ఏ.ఎస్. గార్లు ప్రారంభిస్తున్న దృశ్యం. ఇందులో చంద్రగిరి ఎం.ఎల్.ఎ. శ్రీ నాని, తి.తి.దే. బోర్డు సభ్యులు శ్రీమతి పనబాక లక్ష్మి, శ్రీ భానుప్రకాష్ రెడ్డి, శ్రీ సదాశివరావు మరియు సంయుక్త కార్యనిర్వహణాధికారి డా॥ఏ.శరత్, ఐ.ఏ.ఎస్., గార్లు పాల్గొన్నారు.




05-06-2026న తిరుపతి స్విమ్స్ నందు 'శ్రీవారి వైద్యసేవ'ను ప్రారంభిస్తున్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ముద్దాడ రవిచంద్ర, ఐ.ఏ.ఎస్. ఈ కార్యక్రమంనందు స్విమ్స్ డైరెక్టర్ మరియు వైస్ ఛాన్సలర్ డా॥ఆర్.వి.కుమార్, బర్డ్ డైరెక్టర్ డా॥ జగదీష్, అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ సి.హెచ్. వెంకయ్య చౌదరి, ఐ.ఆర్.ఎస్., సంయుక్త కార్య నిర్వహణాధికారి డా॥ ఏ.శరత్, ఐ.ఏ.ఎస్., సి.వి.&ఎస్.ఓ శ్రీ మురళీకృష్ణ, ఐ.పి.ఎస్., మరియు చీఫ్ పి.ఆర్.ఓ. డా॥ టి.రవి గార్లు పాల్గొన్నారు.



10-07-2026న చంద్రగిరి శ్రీ కోదండరామాలయంలో హిందూ ధర్మప్రచారపరిషత్ మరియు ఎస్వీబిసి సంయుక్తంగా భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించిన 'శ్రీ మహాలక్ష్మి దీపపూజ' చిత్రం.



08-07-2026న తిరుమల శ్రీవారి ఆలయంలో తి.తి.దే. బోర్డు ఎక్స్ అఫీషియోసభ్యునిగా ప్రమాణం చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ దేవదాయ శాఖ కార్యదర్శి శ్రీ కె.కన్నబాబు, ఐ.ఏ.ఎస్., గారికి శ్రీవారి చిత్రపటాన్ని అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి, ఐ.ఆర్.ఎస్., గారు అందజేస్తున్న దృశ్యం. చిత్రంలో సి.వి.&ఎస్.ఓ. శ్రీ మురళీకృష్ణ, ఐ.పి.ఎస్., గారిని కూడా తిలకించవచ్చు.



10-08-2026 న తి.తి.దేవస్థానముల నూతన సంయుక్త కార్యనిర్వహణాధికారి (వైద్యం & విద్య)గా శ్రీ ప్రభల గోపీనాథ్, ఐ.ఏ.ఎస్., తిరుమల శ్రీవారి ఆలయంలో బాధ్యతలు స్వీకరిస్తున్న చిత్రం.

SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams Printing on 25-08-2026 and Posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd. No.TRP/155/2024-2026 "LICENCED TO POST WITHOUT PREPAYMENT No.PMGK/RNP/WPP-04(1)/2024-2026" Posting on 1st of Every Month.

